ప్రజల కోసం.. ప్రకృతి కోసం.. సామాన్యుని గొంతుగా.. సామాజిక సమరంగా..

# ధర్మఘంటి

TELTEL/2012/47103

జాతీయ తెలుగు దిన పత్రిక

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 304 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | శుక్రవారం 30 జనవరి 2026 | పేజీలు : 8 | వెల : 3

**Circulated by:** Nalgonda, Hyderabad, Warangal, Ranga Reddy, Medak, Khammam, Adilabad, Nizamabad, Mahabub Nagar, Karimnagar


### మధ్యప్రాచ్యానికి మారిన భారత చమురు కొనుగోళ్లు

భారత్ ముడి చమురు కొనుగోలు విధానాల్లో మార్పులు చేస్తోంది. అమెరికా ఆంక్షల కారణంగా రష్యా చమురు కొనుగోలు క్లిష్టంగా మారిన నేపథ్యంలో భారత్ ఇప్పుడు సురక్షితమైన వనరులను ఎంచుకుంటోంది. రియల్ టైమ్ అనలిటిక్స్ కంపెనీ కెప్లర్ డేటా ప్రకారం, రష్యన్ ముడి చమురు దిగుమతి జనవరి మొదటి మూడు వారాల్లో రోజుకు 1.1 మిలియన్ బ్యారెళ్లకు పడిపోయింది, ఇది గత నెలలో సగటున 1.21 మిలియన్ బ్యారెళ్లుగా ఉంది.

### త్వరలో యాపిల్ డిజిటల్ చెల్లింపుల సేవలు ప్రారంభం

డిజిటల్ చెల్లింపులకు సంబంధించి భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా ఉంది. ప్రధానంగా యూపీఐ లాంటి డిజిటల్ చెల్లింపుల ప్లాట్‌ఫామ్ కారణంగా లావాదేవీలు అత్యంత సులభంగా, త్వరగా జరుగుతున్నాయి. అయితే, ఈ విభాగంలో దేశీయంగా ఇప్పటికీ గూగుల్, మెటా, అమెజాన్ లాంటి గ్లోబల్ కంపెనీలు, ఫోన్‌పే, పేటీఎమ్, భారత్‌పే లాంటి దేశీయ చెల్లింపుల యాప్‌ల హవా జోరుగా సాగుతోంది.

## దేశంలోని అత్యంత ప్రమాదకరస్థితిలోని మూడు డ్యామ్‌లలో

# మేడిగడ్డ

- డ్యామ్‌ల భద్రతపై పార్లమెంటులో టీడీపీ ఎంపీల ప్రశ్న
- అత్యంత ప్రమాదకరస్థితిలో మేడిగడ్డ, లోయర్ ఖజురి, బొకారో డ్యామ్‌లు
- వెల్లడించిన కేంద్ర జల్‌శక్తి శాఖ



హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలోని మేడిగడ్డ డ్యామ్ అత్యంత ప్రమాదకరస్థితిలో ఉందని కేంద్ర జల్‌శక్తి శాఖ వెల్లడించింది. డ్యామ్‌ల భద్రతపై టీడీపీ ఎంపీలు లక్ష్మీనారాయణ, శబరి పార్లమెంటులో అడిగిన ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం సమాధానం ఇచ్చింది. ఈ క్రమంలో మేడిగడ్డతో పాటు దేశంలోని వివిధ ప్రాజెక్టులపై కీలక సమాధానం ఇచ్చింది. దేశంలో - మిగతా3లో



## ఈయూ ఒప్పదంతో లక్ష్యాలు సాకారం

- కొత్తగా తెరుచుకుంటున్న అంతర్జాతీయ మార్కెట్లను అందిపుచ్చుకోవాలని దేశీయ తయారీదారులకు పిలుపు
- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేసిన ప్రసంగంపై ప్రధాని హర్షం
- అది కేవలం అధికారిక ప్రసంగం మాత్రమే కాదు
- 140 కోట్ల భారతీయుల నమ్మకానికి, సామర్థ్యానికి ముఖ్యంగా యువత ఆకాంక్షలకు అద్దం పడుతోంది
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

## బోగస్ కార్డుల

# ఏరివేత?

- రేషన్‌కార్డుదారులకు షాకింగ్ న్యూస్!
- బోగస్‌కార్డుల ఏరివేతకు సన్నాహాలు చేస్తున్న పౌరసరఫరాలశాఖ
- రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా అధికారుల చర్యలు
- అనర్హులు రేషన్ తీసుకుంటున్నట్లుగా గుర్తించిన అధికారులు
- ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న వారిలో అధికశాతం మంది తెల్ల రేషన్ కార్డును కలిగి ఉన్నట్లు తెలుస్తోంది
- ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా దాదాపు 50 వేలకుపైగా బోగస్ కార్డులున్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించినట్లుగా సమాచారం.



హైదరాబాద్

ప్రభుత్వం ఏటా వేల కోట్లు ఖర్చుచేసి పేదలకు చౌకధరలకు అందిస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా ఉండేందుకు తెలంగాణ పౌరసరఫరాలశాఖ బోగస్ రేషన్ కార్డుల ఏరివేత ప్రక్రియకు సిద్ధమవుతోంది. ఇప్పటికే కొన్ని పలు జిల్లాల్లో ఈ ఏరివేత ప్రక్రియ మొదలుపెట్టగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనూ చేపట్టనున్నారు. అనర్హులైన వారు ప్రతినెలా రేషన్ బియ్యాన్ని తీసుకుంటున్నట్లుగా అధికారులు గుర్తించారు. దీంతో వారి జాబితాలను తయారు చేస్తున్నారు. అలాంటి వారిని గుర్తించి పౌరసరఫరాలశాఖకు నివేదించనున్నారు. - మిగతా3లో



## 'దాదా'కు కన్నీటి వీడ్కోలు

- అశ్రునయనాల మధ్య అజిత్ పవార్ అంత్యక్రియలు
- తమ అభిమాన నేత దాదాకు తుది వీడ్కోలు పలికేందుకు వేలాది మంది అంత్యక్రియలు జరిగే ప్రాంతానికి తరలివచ్చారు
- మరత్వాడా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలతో విద్యా ప్రతిష్టాన్ పరిసరాలు కిక్కిరిసిపోయాయి.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక మలుపు



- కేసీఆర్‌కు సిట్ నోటీసులు
- కేసీఆర్ ఇంటికి వెళ్లి నోటీసులు ఇచ్చిన సిట్ అధికారులు
- మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు రావాలని నోటీసులు
- రాష్ట్రంలో రాజకీయ ప్రకంపనలు సృష్టించిన ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో సిట్ దర్యాప్తును వేగవంతం
- అనేక వాంగ్మూలాల్లో కేసీఆర్ పేరు వెలుగులోకి రావడంతో నోటీసులు జారీ

హైదరాబాద్

ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. హైదరాబాద్ నందినగర్‌లో ఉన్న ఆయన నివాసానికి వెళ్లి అందజేశారు. రేపు మధ్యాహ్నం మూడు గంటలకు విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. 65 ఏళ్ల వయసు దృష్ట్యా పీఎస్‌కు రావాల్సిన అవసరం లేదని తెలిపారు. విచారణకు హాజరయ్యేందుకు హైదరాబాద్ పరిధిలోని అనువైన ప్రాంతం వివరాలు తెలపాలని సూచించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటికే కేటీఆర్, - మిగతా3లో

# కమలానికి పరీక్ష?

- రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఎదగాలంటే ప్రతి ఎన్నికల్లోనూ బీజేపీ గెలవాల్సిన పరిస్థితి
- ఈ ఫలితాలను బట్టే ప్రజల్లోకి పాజిటివ్ సంకేతాలు వెళ్తాయి
- అధికారంలోని కాంగ్రెస్ పార్టీకి తామే ప్రత్యామ్నాయమని చెప్పుకునే కమలం పార్టీ ఇప్పు డు ఆశలన్నీ మున్సిపల్‌పైనే పెట్టుకుంది
- ఇప్పటికే జాతీయ నాయకత్వం ముగ్గురు ఎన్నికల ఇన్‌చార్జీలు, కో ఇన్‌చార్జీలను నియమించగా త్వరలోనే జాతీయ అధ్యక్షుడితోపాటు పలువురు జాతీయ నాయకులకు ఏకంగా రంగంలోకి



హైదరాబాద్

ఈసారి పురపోరు బీజేపీకి ప్రతిష్టాత్మకంగా మారనుంది. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అంతంత మాత్రంగానే సీట్లు దక్కించుకున్న బీజేపీకి ఈ ఎన్నికలు అగ్నిపరీక్ష కానున్నాయి. అధికారంలోని కాంగ్రెస్ పార్టీకి తామే ప్రత్యామ్నాయమని చెప్పుకునే కమలం పార్టీ ఇప్పు డు ఆశలన్నీ మున్సిపల్‌పైనే పెట్టుకుంది. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఎదగాలంటే ప్రతి ఎన్నికల్లోనూ బీజేపీ గెలవాల్సిన పరిస్థితి. ఈ ఫలితాలను బట్టే ప్రజల్లోకి పాజిటివ్ సంకేతాలు వెళ్తాయి.మొదటి నుంచి తమకు అర్బ న్ (పట్టణ) ప్రాంతాల్లోనే బలం ఉందని చెప్పు కుంటున్న బీజేపీ ఈ ఎన్నికల్లో అత్యధికంగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, వార్డులను కైవసం - మిగతా3లో



## మహారాష్ట్ర డిప్యూటీ సీఎంగా పవార్ భార్య

- ఎన్సీపీ కొత్త బాస్ ఆయనేనా..!
- 'సునేత్రను రాష్ట్ర మంత్రివర్గంలోకి తీసుకోవాలని ప్రజులు కోరుకుంటున్నారు
- అజిత్ దాదా వారసత్వాన్ని కొనసాగించేందుకు సునేత్రనే సరైన వ్యక్తి
- రాబోయే మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో కలిసి పోటీ చేసేలా ఎన్సీపీ(ఎస్పీ)తో అజిత్ పవార్ సంప్రదింపులు

## వనం వీడి జనంలోకి సమ్మక్క

- గౌరవసూచకంగా గాల్లోకి ఎస్పీ కాల్పులు
- సమ్మక్క తల్లికి ఘనస్వాగతం పలికిన మంత్రులు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్
- సమ్మక్కకు జై అంటూ భక్తులు నినాదాలు
- భక్తుల జయజయధ్వానాలతో కాసేపట్లో గద్దెలపైకి సమ్మక్క



## మౌలిక సదుపాయాల్లో దూసుకెళుతున్న భారత్

- ఆర్థిక సర్వే 2026లో కీలక విషయాలు
- మౌలిక రంగంలో భారత్ దూకుడును వెల్లడించిన ఆర్థిక సర్వే 2025-26
- పదేళ్లలో మూడు రెట్లు పెరిగిన పునరుత్పాదక ఇంధన సామర్థ్యం
- 2014 నుంచి రెట్టింపునకు పైగా పెరిగిన విమానాశ్రయాల సంఖ్య
- జాతీయ రహదారుల నెట్‌వర్క్‌లో 60 శాతం వృద్ధి
- ప్రభుత్వ మూలధన వ్యయం 4.2 రెట్లు పెరిగిందని వెల్లడి




## సంపాదకీయం

# ఆనందం కాదు.. ఆలోచనే పని

మెదడన్నది మనకున్నది?అన్నాడు మహాకవి. మనసు గతి ఇంతే అని పాడాడు ఇంకో కవి. మెదడూ మనసూ ఒకటేనని వివరిస్తారు డాక్టర్లు. ఆ చర్చ అలా వుంచితే నాకేమీ సంతోషంగా లేదు. బాలేదు, దిగులుగా వుంది, బరువుగా వుందని వాపోతుంటారు చాలా మంది. ఈ విషయంలోనూ వైద్యశాస్త్రం క్లియర్‌గానే చెబుతున్నది. ముప్పై మూడేళ్ల పాటు న్యూరో సర్జన్‌గా అంటే మెదడు డాక్టర్‌గా పనిచేసిన డా.ప్రశాంత కట్కోలా ఈ విషయమై మాట్లాడుతూ అసలు మెదడు పనే అది కదా అంటున్నారు. మీ మెదడనేది చాలా సంక్లిష్టమైన అవయవం. అది మీ జ్ఞాపకాలనూ ఆవేశాలనూ స్పర్శనూ చలనాలనూ శ్వాసనూ నియంత్రిస్తుంటుంది. ఆకలి, కోరికలూ ఏవైనా సరే దాని ద్వారానే జరుగుతాయి గనక నిస్సందేహంగా అదే మన శరీరంలో అతి ముఖ్యమైన భాగం. అయితే మెదడు కీలక బాధ్యత మిమ్మల్ను ఆనందంగా వుంచడమేం కాదు. మీ మనుగడను కాపాడ్డమే దాని పని. కనుక మనసో మెదడో దిగులుగా వుందని దిగులు పడకుండా వుండాలంటే మీరు మూడు సూత్రాలు అర్థం చేసుకోవాలంటాడాయన. మొదటిది-పొరబాట్లు నేర్చుకోవడంలో భాగంగా జరుగుతుంటాయి తప్ప వాటిని వైఫల్యాలుగా భావించకూడదు. మీరు అభివృద్ధి చెందుతున్నారనే అర్థం చేసుకోవాలి. రెండు-అసంపూర్ణత అనేది శాశ్వతంగా వుంటుంది. మీరు ఒకటి పొందాలంటే ఒకటి కోల్పోతుంటారు. ఈ రాకపోకలలోనే సమతుల్యత వస్తుంది, మూడు-ఏదీ ఎప్పుడూ ఒకేలా వుండదు. మీరు నేర్చుకుంటూ మార్చుకుంటూ వుంటారు. ఇందులో ఏదీ లోపం కాదని గ్రహించాలంటాడు. అసలు అన్ని రకాల అభద్రతలనూ అధిగమించడమెలాగన్నదే మెదడు చెప్పే సందేశం, దాంతో ఆనందం కూడా వస్తుందని సారాంశం. భావం సరైందైతే చాలదు, భాషలో వ్యక్తీకరణ కూడా సక్రమంగా వుండాలి. ఒక మంచి మాట చెప్పడానికి మరో పొరబాటు భావం చేరవేయకూడదు. ఈ మధ్య మెగాస్టార్ చిరంజీవి అలాంటి సమస్యలోనే చిక్కుకుపోయారు. తను వెంకటేష్‌తో కలసి నటించిన తాజా చిత్రం 'మన శంకర వరప్రసాద్' విజయోత్సాహంలో మునిగి తేలుతున్నాడాయన. ఈ వేడుకలోనే ఆయన మాట్లాడుతూ అమ్మాయిలు చిత్ర పరిశ్రమలోకి నిస్సంకోచంగా రావాలని, ధైర్యంగా నిలబడాలని ఆహ్వానించారు. ఈ చిత్రానికి ఒక నిర్మాత ఆయన పెద్ద కుమార్తె గనక ఈ ప్రస్తావన వచ్చిందన్నమాట. మంచిదే. గతంలో హీరో కృష్ణ కూతురు లేదా మరో హీరో చెల్లెలు సినిమాల్లోకి వస్తామంటే వారి అభిమానులనే పేరిట గగ్గోలు పెట్టి ఆపేశారు. వచ్చిన వారిపై ఎలాంటి మాటలంటున్నారో మొన్ననే డ్రస్సింగ్ డిబేట్‌లో చూశాం. అలా గాకుండా అగ్ర హీరో అమ్మాయిలను ఆహ్వానించడం ఓకే, అంతటితో ఆగని చిరంజీవి సినిమా రంగంలో క్యాస్టింగ్ కౌచ్ వుంటుందనేది నిజం కాదని కొట్టిపారేశారు. ప్రభుత్వాలు నియమించిన కమిషన్లే నిర్ధారించిన నిజం కదా క్యాస్టింగ్ కౌచ్? కోర్టులు కూడా కొన్నిసార్లు ఆదేశాలు జారీచేశాయి. మీ టూ వంటి ఉద్యమాలు, నినాదాలు పుట్టాయి. ఇవన్నీ చిరంజీవికి తెలియవా? గతంలోనూ ఆయన తన ఇంట్లో ఆడపిల్లలు ఎక్కువని తను లేడీస్ హాస్టల్ వార్డెన్‌లా వుంటానని వ్యాఖ్యానించి నాలుక్కరుచుకున్నారు. అసమానతలు, అత్యాచారాల పురుషాధిక్య సమాజంలో, అందులోనూ రంగుల రంగమైన సినిమా లోకంలో ఈ సమస్యలు సత్యమేనని అందరికీ తెలుసు. అనుభవాలతో సహా ఎందరో అభినేత్రులు చెప్పారు కూడా. ఎవరైనా తప్పుగా ప్రవర్తిస్తే ధైర్యంగా ఎదుర్కొంటూ ముందుకు పొమ్మని చెప్పడం వేరు, అసలు సమస్యే లేదని చెప్పడం వేరు కదా. సహజంగానే చిరంజీవిపై నటీమణులు నిరసన చెప్పాల్సి వచ్చింది. మరి ఏమైనా వివరణో సవరణో ఇస్తారో లేదో చూడాలిక. ఎ.ఆర్.రెహమాన్ అనగానే మనకు ఆస్కార్ తెచ్చిపెట్టిన జయహో గీతం, కొత్త బాణీతో వందేమాతరం స్వర కల్పన గుర్తుకు వస్తాయి. కాశ్మీర్ ఉగ్రవాదం నేపథ్యంలో తీసిన 'రోజా' నుంచి వరుసగా గొప్ప చిత్రాలు మదిలో మెదులుతాయి. బ్రిటన్‌లో మకాం వేసి ప్రపంచ సంగీత వేదికపై సగర్వంగా భారత పతాకం ఎగరేస్తున్న సంగీత దిగ్గజం తను. అసలు మన దరిదాపులకు రాని ఆస్కార్లు రెండుసార్లు తెచ్చిపెట్టిన ముద్దుబిడ్డ. అలాంటి అరుదైన అంతర్జాతీయ ప్రతిభాశాలిని కూడా సంఘ పరివార్ మత రాజకీయం వదలిపెట్టడం లేదు. రెహమాన్ ఎక్కడో మాట్లాడుతూ భారత దేశంలో అధికార రాజకీయం మారాక తనకు అవకాశాలు కొంత తగ్గాయనే అభిప్రాయం యథాలాపంగా చెప్పారు. ఇందులో మత కోణం కూడా వుంటే వుండవచ్చన్నారు. దేశంలో పరిస్థితులు గమనిస్తున్న వారెవరికైనా ఈ మాటలు అర్థమవుతాయి. ఒక దశలో తమకు సరైన ఇల్లు అద్దెకు దొరకలేదని షబానా అజ్మీ వంటి నటీమణి చెప్పడం ఎవరికి తెలియదు? కానీ రెహమాన్ ఈ మాట అనడం దేశానికి ద్రోహమైనట్టు విరుచుకు పడ్డారు హిందూత్వ వాదులు. రకరకాల రూపాల్లో దాడి చేశారు. ఎందుకైనా మంచిదని ఆయన కూడా ఒకడుగు తగ్గి తాను ఎవరినీ అనడం లేదనీ, కొన్నిసార్లు తన మాటలు అపార్థం చేసుకోవచ్చని వివరణ కూడా ఇచ్చారు. అయినా ఈ దాడి మాత్రం తగ్గలేదు. రెహమాన్ వివరణ తర్వాత బిజెపి కి సన్నిహితంగా వుండే పరేష్ రావల్ వంటి నటులు సమర్థిస్తూ ప్రకటన చేశారు. కానీ హిందూత్వ ప్రతినిధులు మాత్రం కారాలు, మిరియాలు నూరుతూనే వున్నారు. వారికి తెలిసింది అదొక్కటే మరి. కానీ ఈ దాడి మాత్రం కొనసాగుతూనే వుంది. ఏమంటే రెహమాన్‌ను తప్పు పట్టడం ద్వారా తమ దేశభక్తి నిరూపించుకోవాలని కొందరి హడావుడి. రేపు ఈ పెద్ద మనుషులను కూడా పరివార్ ఏదో ఒక పాయింట్‌పై పట్టి పీడించకపోదు. మనం చూడకపోము! తన జీవితంలో ఎదురైన దాన్ని అతడు చెప్పాడే గాని ఎవరినీ అవమానించలేదు. 'సర్' తతంగంలో భాగంగా బెంగాల్‌లో నోబెల్ గ్రహీత అమర్త్యసేన్‌కు నోటీసు ఇవ్వడం కన్నా ఇదేమన్నా ఎక్కువా,


# మహాత్ముని హత్యకు నేపథ్యం



భారత జాతిపిత మహాత్మాగాంధీ దేశ స్వాతంత్ర్య సాధన కోసం ఎన్నో సార్లు నిరాహార దీక్షలు చేపట్టారు. అయితే గాంధీజీ స్వతంత్రం వచ్చిన తరువాత నిరాహారదీక్ష కూడా చేసారు. ఆ నిరాహార దీక్షనే మహాత్ముని హత్యకు కారణం అవుతుందని ఎవరూ ఊహించి ఉండరు. స్వాతంత్ర్యానంతరం గాంధీ ప్రయత్నాలు హిందూ - ముస్లిం విద్వేషాలను నివారించడానికి పరిమిత మయ్యాయి. ముస్లిం నాయకుడైన మహమ్మద్ ఆలీ జిన్నాను ప్రధాని మంత్రిగా చేసైనా దేశ విభజనను ఆపాలని గాంధీ భావించారు. ఇది హిందూ - ముస్లింల మధ్య మరింత చిచ్చురాజేసింది. నెహ్రూ, సర్దార్ వల్లబాయ్ పటేల్‌లు గాంధీ విధానాన్ని వ్యతిరేకించారు. విభజన జరిగితేనే అల్లర్లు సమసి పోతాయని వారు భావించారు. దేశ విభజనో..అంతర్గత యుద్ధమో తేల్చుకోండని జిన్నా పిలుపు నివ్వడం గాంధీని ఇరకాటంలో పడేసింది. 1947 ఆగస్టు 15న దేశమంతా సంబరాలు జరుపుకుంటుంటే...గాంధీ మాత్రం కలకత్తాలోని ఒక హరిజనవాడను శుభ్రం చేస్తూ గడపడం విశేషం. దేశ విభజన ప్రతిపాదన, దానికి వ్యతిరేకంగా చెలరేగిన అల్లర్లు, అవి దారితీసిన ఉద్రిక్తతలు, మత ఘర్షణల ఫలితంగా అనూహ్యమైన రీతిలో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. ప్రభుత్వం పరిస్థితిని అదుపు చేయలేని అసహాయ స్థితిలో పడింది. మొత్తం పోలీసు బలగాలు దేశ పశ్చిమ ప్రాంతానికి పంప బడ్డాయి. తూర్పు ప్రాంతంలో కల్లోలాలను అదుపు చేసే భారం గాంధీ పై పడింది. దేశ విభజనతో ముఖ్యంగా పంజాబు, బెంగాలులలో పెద్దఎత్తున సంభవించిన వలసల వల్ల మత కలహాలు, మారణ కాండలు ప్రజ్వరిల్లాయి. 1947లో కాశ్మీరు విషయమై భారత్ - పాకిస్తాన్ యుద్ధం తరువాత ఇంటా, బయటా పరిస్థితి మరింత క్షీణించింది. ముస్లిము లందరినీ పాకిస్తాను పంపాలనీ, కలసి బ్రతకడం అసాధ్యమనీ వాదనలు నాయకుల స్థాయిలోనే వినిపించ సాగాయి. ఈ పరిస్థితి గాంధీకి మింగుడు పడని అంశంగా మారింది. దీనికి తోడు విభజన ఒప్పందం ప్రకారము పాకిస్తానుకు ఇవ్వవలసిని 55 కోట్లు రూపాయలను ఇవ్వడానికి భారత ప్రభుత్వం నిరాకరించింది. ఆ డబ్బు భారతదేశంపై పాకిస్తాన్ యుద్ధం చేస్తే యుద్ధానికి ఉపయోగ పడుతుందని సర్దార్ పటేల్ వంటి నాయకుల అభిప్రాయం. కాని అలా కాకుంటే పాకిస్తాన్ మరింత ఆందోళన చెందుతుందనీ, దేశాల మధ్య విరోధాలు ప్రబలి మత విద్వేషాలు సరిహద్దులు దాటుతాయనీ, అంతర్యుద్ధానికి దారితీస్తుందనీ గాంధీజీ అభిప్రాయం. జనవరి 12, 1948. ఆ రోజు సాయంత్రం తన రోజువారీ ప్రార్థన సమావేశంలో, మరుసటి రోజు ఉదయం నుండి ఆమరణ ఉపవాసం కూర్చుంటానని గాంధీ ప్రకటించారు. 1948 జనవరి 13న మధ్యాహ్నం సుమారు 12 గంటలకు గాంధీజీ రెండు డిమాండ్లతో నిరాహార దీక్షలో కూర్చున్నారు. మొదటి డిమాండ్ పాకిస్తాన్‌కు భారత్ విభజన ఒప్పందంకు సంబంధించిన మిగిలిన రూ.55 కోట్లు ఇవ్వాలి. రెండోది దిల్లీలో ముస్లింలపై జరుగుతున్న దాడులు ఆగాలి. దీనికి ముందు గాంధీ తన రోజువారీ పనులను పూర్తి చేశారు. నెహ్రూ, పటేల్, ఆజాద్‌లతో ఆయన సుదీర్ఘ చర్చలు జరిపారు. కొంతమంది బిర్లా హౌస్ పచ్చిక బయళ్లలో గుమిగూడారు. 'వైష్ణవ జన్‌తో తేనె కహియే తోపాటు, ఆయనకు ఎంతో ప్రియమైన భజన్లను, శ్లోకాలను పాడారు. తర్వాత ఖురాన్ మరియు గురు గ్రంథ్ సాహిబ్ నుండి శ్లోకాలు పఠించ బడ్డాయి. అలా ఆయన ఢిల్లీలో తన జీవితంలో చివరి ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించారు. ఎవరెంతగా ప్రాధేయపడినా ఆయన తన దీక్ష మానలేదు. చివరకు భారత ప్రభుత్వం దిగివచ్చి పాకిస్తానుకు 55 కోట్ల డబ్బు ఇవ్వడానికి అంగీకరించింది. 1948 జనవరి 18న ఒక శాంతి కమిటీ ఏర్పాటైంది. ముస్లింలు దిల్లీలోని తమ ఇళ్లలోకి వెళ్లవచ్చని, హిందువులు, సిక్కుల ఆక్రమణ నుంచి మసీదులను విడిపిస్తామని, అక్రమ కబ్జాల నుంచి ముస్లింల ప్రాంతాలను విడిపిస్తామని, ఇళ్ల నుంచి భయపడి వెళ్లిపోయిన ముస్లింలు తిరిగి రావడానికి హిందువుల నుంచి ఎలాంటి అభ్యంతరం ఉండదని ఆ కమిటీ మహాత్మా గాంధీకి హామీ ఇచ్చింది. హిందూ, ముస్లిమ్, సిక్కు వర్గాల నాయకులు సఖ్యంగా ఉండటానికి కట్టుబడి ఉన్నామని ఆయనవద్ద ప్రమాణం కూడా చేశారు. జనవరి 18న మధ్యాహ్నం 12.45కు మౌలానా ఆజాద్ ఇచ్చిన నారింజ రసం తాగిన మహాత్మా గాంధీ తన నిరాహార దీక్షను విరమించారు. కాని ఈ మొత్తం వ్యవహారంలో గాంధీ పట్ల మతోన్మాదుల ద్వేషం బలపడింది. మత ప్రాతిపదికన పాకిస్తాన్ ప్రత్యేక దేశం ఏర్పాటుకు గాంధీ వ్యతిరేకిస్తున్నారని ముస్లింలు భావించగా, ముస్లింల వేధింపులపై ప్రతీకారం తీర్చుకునేందుకు గాంధీ తమకు అడ్డుపడుతున్నాడని హిందు తీవ్రవాదులు భావించారు. ఈ నేపథ్యంలో గాంధీ హత్యకు దారితీసింది హిందు- ముస్లింల మధ్య నెలకొన్న కలహాలే అనే వాదన బలంగా ఉంది. ఈ క్రమంలోనే నాథూరామ్ గాడ్సే పథకం ప్రకారం 1948 సంవత్సరం జనవరి 30వ తేదీ నాడు బిర్లా మందిర్ ప్రార్థన మందిరం మైదానంలో హత్య చేయడం జరిగిందని స్పష్టమయింది. "గాంధీ సమ్మతితో కాంగ్రెస్‌లోని అగ్రనేతలు అంతా కలిసి దేశాన్ని చీలికలు-పేలికలుగా మార్చారని, దేశవిభజనకు సమ్మతి తెలిపి పెద్ద కుమారుడు వంటి గాంధీ భారత దేశానికి ద్రోహం చేయడం ద్వారా ఆయన తన ధర్మాన్ని నెరవేర్చడంలో ఘోరంగా విఫలం అయ్యాడని, అన్ని అంశాలు పరిగణనలోకి తీసుకున్న తర్వాతనే నేను తుది నిర్ణయానికి వచ్చానని, అందుకే తానే గాంధీని కాల్చి చంపానని" గాడ్సే కోర్టులో వివరించాడు. స్వతంత్ర భారతదేశంలో ఉరితీయబడిన మొదటి వ్యక్తిగా గాంధీని చంపిన నాధురాం వినాయక్ గాడ్సే చరిత్రలో నిలిచిపోయాడు.

## సైన్య ఆధునీకరణలో

# కృష్ణారావుది చెరగని ముద్ర



జనరల్ కృష్ణారావు భారత ప్రసిద్ధ సైనిక అధికారులలో ఒకరు. ఆయ న దూరదృష్టి గలవారు. 1971లో పాకిస్తాన్ తో జరిగిన యుద్ధంలో పాల్గొని అపూర్వ ధైర్యసాహసాలు ప్రదర్శించారు. బంగ్లాదేశ్ విముక్తి సమయంలో ఆయన చేసిన సేవలు అసమానాలు. 1980 దశక ప్రారం భంలో భారత సైన్యాన్ని ఆధునీక రించడం ప్రారంభించారు. ఒక తరం సైనికులను ప్రేరేపించారు. జనరల్ కె.వి. కృష్ణారావుగా ఖ్యాతి నందిన కొటికల పూడి వెంకట కృష్ణా రావు, జూలై 16 1923న విజయ వాడలో కె.ఎస్. నారాయణ రావు, లక్ష్మీరావు దంపతులకు జన్మిం చారు. ఆయన ఆగష్టు 9, 1942 న ఇండియన్ ఆర్మీలో చేరారు. 1947 లో విభజన వరకు, యువ అధికారి గా ఉన్నపుడే రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో నార్త్ వెస్ట్ ఫ్రాంటియర్, బెలూచిస్తాన్ లలో ఆయన పని చేశారు. దేశ విభజన సమయంలో తూర్పు, పశ్చిమ పంజాబ్‌లలో విధులు నిర్వర్తిం చారు. భారత సైనిక దళాల మాజీ ఛీఫ్ ఆయ్యాక, జమ్మూ కాశ్మీర్, నాగాలాండ్, మణిపూర్, త్రిపుర రాష్ట్రాలకు గవర్నరుగా పని చేసా రు. ఆయన జమ్మూ కాశ్మీరు గవర్న రుగా మొదటిసారి 1989 జూలై 11 నుండి 1990 జనవరి 19, రెండవ సారి 1993 మార్చి 13 నుండి 1998 మే 2 వరకు పనిచేసి చెరగని ముద్ర వేశారు. 1947 లో విభజన వరకు విస్తృతమైన పంజాబ్ అవాంతరాల సమయంలో, తూర్పు మరియు పశ్చిమ పంజాబ్ లలో పనిచేశారు. 1947 - 48లో జరిగిన భారత్-పాక్ యుద్ధంలో పాల్గొన్నారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ వ్యవస్థాపక శిక్షకు లలో కృష్ణారావు ఒకరు. 1949 -51 మధ్య ఆయన డిఫెన్స్ అకాడమీలో పని చేశారు. 1965 - 66లో లడఖ్ లో ఒక దళానికి, 1969 - 70లో జమ్మూ ప్రాంతంలో ఇన్‌ఫాంట్రీ విభాగానికి కమాండర్‌గా వ్యవహ రించారు. 1970 - 72 మధ్య నాగాలాండ్, మణిపూర్‌లలో తిరుగుబాట్ల అణచివేత దళాలకు నేతృత్వం వహించారు. 1971 యుద్ధంలో రావు అందించిన సహకా రం, దేశం యొక్క ఐక్యత, సమగ్రతను కాపాడుకోవడం కోసం చేసిన కృషి ఎల్లప్పుడూ గుర్తుండి పోతుంది. ఆ కాలంలో, ఆయన విభాగం 1971లో భారత - పాకిస్తా న్ యుద్ధంలో కూడా పాల్గొంది. సిల్హెట్ ప్రాంతాన్ని స్వాధీనం చేసు కోవడంలో, ఈశాన్య బంగ్లాదేశ్ విముక్తికి కీలక పాత్ర పోషించారు. ఆ యుద్ధంలో కృష్ణారావు చూపిన ధైర్యం, సాహసోపేత నిర్ణయాలు, నాయకత్వ ప్రతిభను గుర్తించిన ప్రభుత్వం పరమ విశిష్ట సేవా పత కంతో సత్కరించింది. 1975 - 76 మధ్యకాలంలో, దేశ భవిష్యత్ రక్షణ కోసం పునర్వ్య వస్థీకరణ, ఆధునీకరణపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ ఛైర్మన్‌గా కూడా ఉన్నారు. ఆయన 1978-79 మధ్య ఆర్మీ ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ గా పని చేశారు. తదనం తరం, పదోన్నతి పొందారు. 1979 - 81 మధ్య కాలంలో వెస్టర్న్ కమాం డ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్- ఇన్ - చీఫ్ గా పని చేశారు. కృష్ణా రావు జూన్ 1, 1981 న ఆర్మీ స్టాఫ్ చీఫ్ గా నియమితులై, జూలై 1983 వరకు సమర్థ వంతంగా పని చేశారు. మార్చి 1982 నుండి జూలై 1983 వరకు సర్వీసులలో అత్యు న్నత నియామకం అయిన చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ ఛైర్మన్ కూడా అయ్యారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో బర్మా, బెలూచిస్తాన్ లలో పని చేశారు. దేశ విభజన సమయంలో తూర్పు, పశ్చిమ పంజాబ్‌ల్లో విధులు నిర్వర్తించారు. ఆయన ఆర్మీ ఛీఫ్ గా 1983 లో పదవీ విరమణ చేసారు. కృష్ణా రావు సేవలను గుర్తించిన కేంద్రం ఆర్మీ చీఫ్‌గా రిటైరైన అనంతరం ఆయనకు గవర్నర్‌గా అవకాశం కల్పించింది. 1984-89 మధ్య నాగాలాండ్, మణిపూర్, త్రిపుర గవర్నర్‌గా ఆయన పని చేశారు. మధ్యలో 1988లో కొంతకాలం పాటు మిజోరం గవర్నర్‌గా అదనపు బాధ్యతలను నిర్వర్తిం చారు. 1989 - 90 మధ్య, తర్వాత జమ్మూ కాశ్మీర్‌లో ప్రాక్సీ యుద్ధం గరిష్ట స్థాయికి చేరుకున్న ప్పుడు, 1993 - 1998 మధ్య జమ్మూకశ్మీర్ గవర్నర్‌గా తిరిగి పని చేశారు. ఉగ్ర వాదం, తిరుగు బాట్లతో అట్టుడికిన కశ్మీర్‌లో తిరిగి శాంతి నెలకొనేం దుకు కృషి చేశారు. ఆయన జనవరి 30 2016 న న్యూఢిల్లీలో మరణించారు.

## మానవతామూర్తి మహాత్మ గాంధీ

20వ శతాబ్దపు ప్రపంచ మేటి ఘనుల్లో ప్రముఖమైన మహాశక్తిగా నేటికీ నిలుస్తున్నారు మహాత్మాగాంధీ. భారతీయులకే కాకుండా నెల్సన్ మండేలా, లూథర్ కింగ్ జూనియర్ లాంటి అనేక విశ్వ విఖ్యాత నాయకులకు సహితం ప్రేరణగా నిలిచిన మోహన్‌దాస్ కమర్‌చంద్ గాంధీ జీవితం నేటికీ మానవాళికి దారి దీపంగా నిలుస్తున్నది. భారతీయ లాయర్, రాజకీయ నాయకులు, భారత స్వాతంత్ర్య ఉద్యమ నాయకులు, సామాజిక కార్యకర్త, సాహితీవేత్త, అతి సాధారణ జీవనశైలిని పరిచయం చేసిన మహా నేత అయిన గాంధీ అహింస అనే పదునైన ఆయుధాన్ని ప్రయోగించి బ్రిటీష్ పాలకుల గుండెల్లో దడ పుట్టించి భరతమాతకు స్వేచ్ఛను ప్రదానం చేశారు. భారత్‌కు స్వాతంత్ర్యం సిద్ధించిందనే సంతోషంతో పాటు దేశ విభజన గాయాలనతో బాధ పడుతున్న వేళ 30 జనవరి 1948న హిందుత్వవాది నాథురామ్ వినాయక్ గాడ్సె తూటాలకు తుది శ్వాస విడిచారు. మహాత్మాగాంధీ వర్ధంతి 30 జనవరి రోజున దేశవ్యాప్తంగా "అమర వీరుల దినం (మార్టిర్స్ డే)" లేదా "గాంధీ పుణ్య తిథి" లేదా "షహీది దివస్"గా పాటించడం ఆనవాయితీగా మారింది. గాంధీ పట్ల అభిమానంతో రవీంద్రనాథ్ టాగూర్ తొలిసారి "మహాత్మా" అని పిలవడంతో వారి పేరు మహాత్మాగాంధీ అని, "జాతి పిత"అని, ప్రేమతో "బాపు" అని నోరారా పిలుచుకునే గాంధీ జీవితం భరతమాత సేవకు అర్పించారు. అహింస, ఏకత, మానవీయత లాంటి సమోన్నత విలువలను మానవాళికి పరిచయం చేసిన అసమాన మానవతీమూర్తి మన బాపు. గుజరాత్ రాష్ట్ర పోర్బందర్ పట్టణంలో 02 అక్టోబర్ 1869న జన్మించిన మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ లండన్‌లో బారిస్టర్ పట్టాను పొంది 21 ఏండ్ల పాటు దక్షిణ ఆఫ్రికాలో గడిపారు. అక్కడ నెలకొన్న జాతి వివక్ష, అసమానతలను చూసిన చలించారు. దక్షిణ ఆఫ్రికా నుంచి 1915లో భారత్‌కు తిరిగి వచ్చి భారత స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొంటూ ఆ ఉద్యమ స్వరూపాన్ని ఆసాంతం మార్చి వేసి బ్రిటీష్ తెల్ల దొరల గుండెల్లో ధడ పుట్టించారు. అహింస అనే అత్యంత పదునైన ఆయుధాన్ని ప్రయోగించి ఉద్యమాన్ని కొనసాగిస్తూనే, వలస పాలకులతో చర్చలు జరుపుతూ, చివరకు బ్రిటీష్ పాలనకు అంతం చూపగలిగారు. సత్యం, అహింస, క్షమాగుణం, నిస్వార్థ సేవ, సానుకూల భావనలు, మానసిక దృఢత్వం, త్యాగం, సత్యాగ్రహాలను పునాదులుగా చేసుకొని ఉద్యమాగ్నికి ఆజ్యం పోశారు. తన జీవిత చరిత్రను "మై ఎక్స్‌పరిమెంట్స్ విత్ ట్రుథ్" అనే ఆత్మకథను రాసి భవిష్యత్తు తరాలకు సన్మార్గం చూపుతున్నారు. విదేశీ వస్తు బహిష్కరణ, స్వదేశీ వస్తు వినియోగం, ఖాళీ ఉద్యమం, సహాయనిరాకరణ ఉద్యమం, క్విట్ ఇండియా, దండి మార్చ్ లాంటి అనేక రకాలైన ఉద్యమాలను నడిపి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టారు. క్రమశిక్షణ, శాంతి, సమానత్వం, నైతికత, మానవీయ విలువలను శాశ్వత ఆభరణాలు ధరించి జీవితాన్ని కొనసాగించిన గాంధీ మనకు నిత్య ప్రేరణగా నిలుస్తున్నారు. వారి ఆదర్శాల తరంగాలు భారత్‌లో మాత్రమే కాకుండా ప్రపంచమంతటా వ్యాపించడం వాస్తవం, అనుసరణీయం.

ధర్మఘంట

# మహారాష్ట్ర డిప్యూటీ సీఎంగా పవార్ భార్య

మహారాష్ట్ర రాజకీయాల్లో చెరగని ముద్రవేసిన అజిత్ పవార్ దుర్మరణంతో తదుపరి డిప్యూటీ సీఎం ఎవరు? నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నడిపించేది ఎవరు? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నేతలు కొందరు పవార్ స్థానాన్ని ఆశిస్తున్నారు. అయితే.. కొందరు సీనియర్ నాయకులు మాత్రం ఆయన భార్య సునేత్ర పవార్ పేరును ప్రతిపాదిస్తున్నారు. అజిత్ దాదా వారసత్వాన్ని కొనసాగించేందుకు సునేత్రనే సరైన వ్యక్తి అని, అందుకని ఆమెను ఉపముఖ్యమంత్రిగా చూడాలని వారందరూ ఆశపడుతున్నారు.





జడ్జీ ఎన్నికల ప్రచారానికి వెళ్తుండగా బారామతిలో విమానం కుప్పకూలడంతో డిప్యూటీ సీఎం అజిత్ పవార్ దుర్మరణం చెందారు. రాజకీయ చతురుడిగా పేరున్న అజిత్ మరణంతో ఎన్సీపీ నుంచి ఉప ముఖ్యమంత్రి పదవి కోసం పలువురు అశావహులు పోటీలో ఉన్నారు. కానీ, సీనియర్లు అజిత్ భార్య సునేత్ర వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం రాజ్యసభ సభ్యురాలిగా కొనసాగుతున్న ఆమెను డిప్యూటీ సీఎం చేయాలనుకుంటున్నారు. ఎన్సీపీ నాయకుడు, మంత్రి నరహరి జిర్వాల్ గురువారం పీటీఐతో మాట్లాడుతూ.. 'సునేత్రను రాష్ట్ర మంత్రివర్గంలోకి తీసుకోవాలని ప్రజులు కోరుకుంటున్నార'ని తెలిపాడు.

ఇప్పటికే సీనియర్లు ప్రఫుల్ పటేల్, ఛగన్ భుజ్‌బల్, ధనంజయ్ ముండు, సునీల్ తట్కరేలు సునేత్రను పరామర్శించి భవిష్యత్ ప్రణాళికలపై మంతనాలు జరిపారు. అజిత్ పవార్ మరణంతో ఉప ఎన్నిక అనివార్యమైన బారామతి నియోజకవర్గం నుంచి సునేత్రను బరిలో ఉంచాలని.. ఆపై ఆమెకు డిప్యూటీ సీఎం పదవిని కట్టబెట్టాలని వారు భావిస్తున్నారు. ఎన్సీపీ సీనియర్లు త్వరలోనే ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను కలిసి ఆయనతో ఇదే విషయమై చర్చించేందుకు సిద్ధముతున్నారు.

**పార్టీ అధ్యక్షుడిగా ప్రఫుల్?**

రాబోయే మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో కలిసి పోటీ చేసేలా ఎన్సీపీ(ఎస్పీ)తో అజిత్ పవార్ సంప్రదింపులు జరిపారు. ఇప్పుడు ఆయన మరణంతో ఏర్పడిన శూన్యతను భర్తీ చేసే నాయకుడి అవసరం ఎన్సీపీకి ఎంతో ఉంది. దాంతో ప్రస్తుతం ఎన్సీపీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సేవలందిస్తున్న ప్రఫుల్ పటేల్ పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకొనే అవకాశముంది.

జనవరి 28న జరిగిన ఘోర విమాన ప్రమాదంలో అజిత్ పవార్ సహా ఇద్దరు పైలట్లు, ఫ్లైట్ సహాయకురాలు, పవార్ వ్యక్తిగత సహాకుడు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. గురువారం అధికారిక లాంఛనాలతో బారమతిలో అజిత్ పవార్ అంత్యక్రియలు నిర్వహించారు.

# 'దాదా'కు కన్నీటి వీడ్కోలు

విమాన ప్రమాదంలో దుర్మరణం చెందిన మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య జరిగాయి. గురువారం బారామతిలోని విద్యా ప్రతిష్ఠాన్ మైదానంలో ప్రభుత్వ లాంఛనాలతో అజిత్‌కు అంతిమ సంస్కారాలు నిర్వహించారు కుటుంబసభ్యులు కేంద్ర మంత్రులు అమిత్ షా, నితిన్ గడ్కరీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిందే, ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్, తదితర రాజకీయ ప్రముఖులు అంతక్రియల్లో పాల్గొన్నారు. గురువారం ఉదయం అజిత్ పవార్ పార్థివదేహాన్ని బారామతిలోని అహల్యాదేవి ఆసుపత్రి నుంచి ఆయన స్వగ్రామం కాటేవాడికి తరలించారు. ఆ తర్వాత అంబులెన్స్‌లో జేడీ మాడ్గుల్కర్ ఆడిటోరియానికి అజిత్‌పవార్ భౌతికకాయాన్ని తరలించారు. అక్కడి నుంచి విద్యా ప్రతిష్ఠాన్ మైదానం వరకు అజిత్ పవార్ అంతిమయాత్ర సాగింది. తమ అభిమాన నేత దాదాకు తుది వీడ్కోలు పలికేందుకు వేలాది మంది అంత్యక్రియలు జరిగే ప్రాంతానికి తరలివచ్చారు. మరత్వాడా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలతో విద్యా ప్రతిష్టాన్ పరిసరాలు కిక్కిరిసిపోయాయి.




**ప్రమాదం ఎలా జరిగిందంటే?**

బుధవారం ఉదయం బారామతి విమానాశ్రయం సమీపంలో జరిగిన ప్రమాదంలో అజిత్ పవార్ దుర్మరణం చెందారు. విమానం రన్‌వేపై దిగేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో కుప్పకూలి మంటల్లో చిక్కుకుంది. బుధవారం ఉదయం వీఎస్ఆర్ వెంచర్స్ ప్రైవేటు లిమిటెడ్‌కు చెందిన లీర్‌జెట్ 45 విమానం అజిత్ పవార్‌ను తీసుకుని ముంబయి నుంచి బయలుదేరింది. అది బారామతికి చేరుకున్నాక ల్యాండింగ్‌కు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) నుంచి అనుమతి లభించింది. అయితే దృశ్య స్పష్టత లేని కారణంగా రన్‌వే దగ్గరకు వచ్చిన విమానాన్ని పైలట్ మళ్లీ గాల్లోకి లేపారు. విమానాశ్రయం చుట్టూ కొంతసేపు తిరిగాక మరోసారి దిగేందుకు ఏటీసీ అనుమతించింది. దీనికి పైలట్ నుంచి ఎటువంటి తిరుగు సమాధానం (రీడ్ బ్యాక్) రాలేదు. ఆ వెంటనే రన్‌వే చివరన కూలిన విమానం మంటల్లో చిక్కుకుంది. దీంతో అజిత్ పవార్‌తో పాటు మరో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. జిల్లా పరిషత్ ఎన్నికల ప్రచారం నిమిత్తం బారామతికి వస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. పవార్‌కు భార్య సునేత్ర పవార్ (రాజ్యసభ సభ్యురాలు), ఇద్దరు కుమారులు పార్థ్, జే ఉన్నారు.

**శరద్ పవార్‌కు సరైన రాజకీయ వారసుడు అజితే**

1959, జులై 22న ఆశా, అనంత్‌రావ్ పవార్ దంపతులకు అజిత్ పవార్ జన్మించారు. మరాత్వాడా రాజకీయ దిగ్గజం శరద్‌పవార్ ఆయనకు స్వయానా చిన్నాన్న. బాబాయి అడుగుజాడల్లో నడుస్తూ అజిత్ రాజకీయ రంగ ప్రవేశం చేశారు. 1982లో ఒక చక్కెర కర్మాగారం పరిపాలనా బోర్డు సభ్యునిగా ఎన్నికయ్యారు. 1991లో బారామతి నియోజ కవర్గం నుంచి లోక్‌సభకు ఎన్నికైనప్పటికీ తదనంతరం ఆ స్థానాన్ని తన బాబాయి కోసం త్యజించారు. నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) వ్యవస్థాపకుడైన శరద్ పవార్‌కు సరైన రాజకీయ వారసుడు అజితే అని భావించేంతగా పార్టీ క్షేత్రస్థాయి కార్యకర్తలతో గట్టి అనుబంధాన్ని ఏర్పరచుకు న్నారు. కాలక్రమంలో సొంత బలం కలిగిన నేతగా, వ్యూహకర్తగా ఎదిగారు. నిర్విరామంగా శ్రమించే వ్యక్తిగా గుర్తింపుపొందారు. ఎన్ని వివాదాలు చుట్టుముట్టినా ప్రతి సంక్షోభం నుంచి విజేతగా బయటికి వచ్చారు. రూ.70 వేల కోట్ల నీటిపారుదల కుంభకోణం కానీ, తన కుమారుడు పార్థ్‌తో సంబంధం ఉన్న పుణె భూ వివాదం కానీ అజిత్‌ను ఏమీ చేయలేకపోయాయి. కాంగ్రెస్, శివసేన, బీజేపీ ప్రభుత్వాల్లో ఆయన ఉపముఖ్యమంత్రిగా పనిచేయడం విశేషం.

**పోటీ చేయనని మళ్లీ చేసి విజయం**

పవార్ కుటుంబానికి కంచుకోటగా ఉన్న బారామతిలో కొన్నేళ్లుగా అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. గత లోక్‌సభ ఎన్నికల్లో అజిత్ పవార్ తన సతీమణి సునేత్రను అభ్యర్థిగా నిలబెట్టగా, శరద్ పవార్ కుమార్తె సుప్రియా సూలే పోటీకి దిగి విజయం సాధించారు. దీంతో బారామతి ప్రజలపై అలక వహించిన అజిత్, ఇంకోసారి ఇక్కడి నుంచి పోటీ చేయనని ప్రకటించారు. ఆ తర్వాత మనసు మార్చుకుని 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారు.

# యూజీసీ కొత్త రూల్స్‌పై సుప్రీం కోర్టు స్టే..

# తిరోగమనం వైపు వెళ్తున్నామా అని ప్రశ్న

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఇటీవల విడుదల చేసిన కొత్త రూల్స్‌పై సుప్రీంకోర్టు గురువారం స్టే విధించింది. 'ఈక్విటీ రెగ్యులేషన్స్' పేరుతో యూజీసీ ఈ నెల 13న విడుదల చేసిన కొత్త నిబంధనలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఈ సందర్భంగా రూల్స్ అమలుపై స్టే విధిస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆధ్వర్యంలోని బెంచ్ కేంద్ర ప్రభుత్వంతో పాటు యూజీసీకి నోటీసులు జారీ చేసింది. తాజా రూల్స్ స్పష్టంగా లేవని, ఇవి సమాజాన్ని విడదీసేలా లేదా సమాజంలో అలజడి సృష్టించే ప్రమాదం ఉందని కోర్టు వ్యాఖ్యానించింది. "75 ఏళ్ల స్వతంత్ర భారతంలో మనం వర్గాలులేని సమాజాన్ని నిర్మించామా.. లేక సమాజాన్ని మళ్లీ తిరోగమనం వైపు తీసుకెళ్తున్నామా..? తమ సంస్కృతిని పాటిస్తున్న దక్షిణాది వారిపై, ఈశాన్య రాష్ట్రాల విద్యార్థులపై ఇంకా ర్యాగింగ్ చేస్తున్నాం. వారిపై కామెంట్ చేస్తున్నాం. ఇంకా మీరు ప్రత్యేక హాస్టళ్ల గురించి అడుతున్నారు. అదృష్టవశాత్తు మన దేశంలో కులాంతర వివాహాలు జరుగుతున్నాయి. హాస్టళ్లలో అందరూ కలిసే ఉంటున్నారు. అమెరికాలోలాగా నల్లజాతీయులకు, శ్వేత జాతీయులకు వేర్వేరు పాఠశాలలున్నట్లు.. మనం విభజన కలిగిన పాఠశాలలవైపు వెళ్లడం లేదు" అని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో కొత్త రూల్స్ అమలు నిలిపివేసింది. తదుపరి ఆదేశాలిచ్చే వరకు 2012 నాటి పాత మార్గదర్శకాలే కొనసాగుతాయని స్పష్టం చేసింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా యూజీసీ న్యూ రూల్స్‌కు వ్యతిరేకంగా జనరల్ కేటగిరి విద్యార్థులు, పౌరులు ఉద్యమం చేస్తున్న సంగతి తెలిసిందే. రోహిత్ వేముల, పాయల్ తద్వి వంటి బలహీనవర్గాల విద్యార్థుల ఆత్మహత్యల నేపథ్యంలో.. యూనివర్సిటీ క్యాంపస్‌లలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ,మహిళల రక్షణ కోసం యూజీసీ 'ఈక్విటీ రెగ్యులేషన్స్ 2026' పేరుతో కొత్త రూల్స్ తీసుకొచ్చింది. దీనిలో భాగంగా ప్రత్యేక కమిటీలు ఏర్పాటై.. వాటిలో ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ సభ్యులు తప్పనిసరిగా ఉంటారు. అలాగే ఈ నిబంధనలు పాటించని యూనివర్సిటీలు, విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేస్తారు. అయితే, ఈ నిబంధనల వల్ల తమకు అన్యాయం జరుగుతుందని జనరల్ కేటగిరి విద్యార్థులు మండిపడుతున్నారు. దేశవ్యాప్తంగా ఆందోళనలకు దిగుతున్నారు. మరోవైపు ఈ రూల్స్‌ను ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు చెందిన వారు సమర్థిస్తున్నారు.



## మౌలిక సదుపాయాల్లో దూసుకెళుతున్న భారత్..

భారతదేశ వృద్ధి వ్యూహంలో మౌలిక సదుపాయాల రంగం కేంద్ర స్థానంలో ఉందని, ఈ రంగంలో ప్రభుత్వ మూలధన వ్యయం స్థిరంగా పెరుగుతోందని ఆర్థిక సర్వే 2025-26 స్పష్టం చేసింది. ఇవాళ విడుదల చేసిన ఈ సర్వే ప్రకారం, ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడంలో భారత్ ప్రపంచంలోనే అగ్రగామి దేశాల్లో ఒకటిగా నిలిచింది. తక్కువ, మధ్య ఆదాయ ఆర్థిక వ్యవస్థలలో మౌలిక సదుపాయాల కల్పనలో ప్రైవేట్ పెట్టుబడుల విషయంలో ప్రపంచ బ్యాంకు ర్యాంకింగ్స్‌లో భారత్ టాప్-5 దేశాల్లో ఒకటిగా నిలిచింది. పీఎం గతిశక్తి, జాతీయ లాజిస్టిక్స్ పాలసీ వంటివి ఈ వృద్ధికి దోహదపడ్డాయని సర్వే పేర్కొంది. దీనివల్ల లావాదేవీల ఖర్చులు, ప్రాజెక్టుల అమలులో రిస్కులు తగ్గాయి. ప్రభుత్వ మూలధన వ్యయం ఎఫ్‌వై18లో రూ. 2.63 లక్షల కోట్ల నుంచి ఎఫ్‌వై26 నాటికి రూ. 11.21 లక్షల కోట్లకు, అంటే దాదాపు 4.2 రెట్లు పెరిగింది. జాతీయ రహదారుల నెట్‌వర్క్ 2014లో 91,287 కిలోమీటర్ల నుంచి 2026 డిసెంబర్ నాటికి 1,46,572 కిలోమీటర్లకు విస్తరించింది. విమానయాన రంగంలో విమానాశ్రయాల సంఖ్య 2014లో 74 నుంచి 2025 నాటికి 164కు పెరిగింది. రైల్వే నెట్‌వర్క్‌లో 99.1 శాతం విద్యుదీకరణ పూర్తయింది. 'మారిటైమ్ ఇండియా విజన్' వంటి పథకాలతో భారత పోర్టుల పనితీరు మెరుగుపడి, 7 పోర్టులు ప్రపంచ బ్యాంకు టాప్ 100 జాబితాలో స్థానం దక్కించుకున్నాయి. విద్యుత్ రంగంలోనూ భారీ విస్తరణ జరిగింది. మొత్తం స్థాపిత సామర్థ్యం 509.74 గిగావాట్లకు చేరగా, ఇందులో పునరుత్పాదక ఇంధన వాటా దాదాపు 49.83 శాతంగా ఉంది. గత దశాబ్ద కాలంలో పునరుత్పాదక ఇంధన సామర్థ్యం మూడు రెట్లకు పైగా పెరిగి 253.96 గిగావాట్లకు చేరుకుందని సర్వే తెలిపింది. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలో మూడో స్థానంలో ఉంది.

## ఈయూ ఒప్పదంతో లక్ష్యాలు సాకారం




**న్యూఢిల్లీ:** భారతదేశం ప్రపంచ వేదికపై తనదైన ముద్రను మరింత బలోపేతం చేసుకుంటోంది. ఐరోపా సమాఖ్య (ఈయూ)తో కుదుర్చుకోబోయే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)కేవలం ఒక ఒప్పందం మాత్రమే కాదని, ఇది నవ భారతపు ప్రతిష్ఠాత్మక లక్ష్యాలకు నిదర్శనమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. గురువారం పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల ప్రారంభానికి ముందు మీడియాను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రధాని.. కొత్తగా తెరుచుకుంటున్న అంతర్జాతీయ మార్కెట్లను అందిపుచ్చుకోవాలని దేశీయ తయారీదారులకు పిలుపునిచ్చారు. మంగళవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేసిన ప్రసంగంపై ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. అది కేవలం అధికారిక ప్రసంగం మాత్రమే కాదని, 140 కోట్ల భారతీయుల నమ్మకానికి, సామర్థ్యానికి ముఖ్యంగా యువత ఆకాంక్షలకు అద్దం పడుతోందని అన్నారు. దేశ భవిష్యత్తుపై రాష్ట్రపతి గీసిన ఒక స్పష్టమైన రోడ్ మ్యాప్ మాదిరిగా ఆ ప్రసంగం ఉందని మోదీ అభివర్ణించారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా పార్లమెంటు సభ్యులకు (ఎంపీలు) రాష్ట్రపతి చేసిన సూచనలను ప్రధాని గుర్తు చేశారు. 2026 కొత్త ఏడాది ఆరంభంలో పార్లమెంటు సభ్యులంతా అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తారని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులంతా రాష్ట్రపతి వెలిబుచ్చిన అంచనాలను దృష్టిలో ఉంచుకుని, సభా కాలాన్ని సద్వినియోగం చేసుకుంటూ, అర్థవంతమైన చర్చల్లో పాల్గొంటారని తాను నమ్ముతున్నట్లు ప్రధాని పేర్కొన్నారు. మారుతున్న ప్రపంచ ఆర్థిక పరిణామాల నేపథ్యంలో భారత తయారీదారులు అంతర్జాతీయ స్థాయి నాణ్యతతో పోటీ పడాలని ప్రధాని సూచించారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ద్వారా లభించే అవకాశాలను వినియోగించుకుని, భారత్‌లో తయారైన ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్లను ఏలాలని ఆయన ఆకాంక్షించారు. ఈ బడ్జెట్ సమావేశాల ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను మరింత పటిష్టం చేసే కీలక నిర్ణయాలు వెలువడనున్నాయని మోదీ తెలిపారు. రాష్ట్రపతి ప్రసంగం 140 కోట్ల భారతీయుల ఆత్మవిశ్వాసానికి ప్రతిబింబమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. 21వ శతాబ్దం రెండో క్వార్టర్‌కు తొలి బడ్జెట్ ఇది ఒక చారిత్రక ఘట్టమని, అలాగే 2047 'వికసిత భారత్' లక్ష్యానికి కీలకమైన 25 ఏళ్ల ప్రారంభమన్నారు. వరుసగా 9వసారి మహిళగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెడుతున్నారని అన్నారు. భారత్ నేడు ప్రపంచానికి ఆశాకిరణంగా, ఆకర్షణ కేంద్రంగా ఉందని, భారత్‌ఈయూ ఫ్రీ ట్రేడ్ ఒప్పందం యువతకు, పరిశ్రమలకు పెద్ద అవకాశమని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

దేశీయ తయారీదారులు నాణ్యతపై దృష్టి పెట్టాలని, 27 ఈయూ దేశాల మార్కెట్లు భారత్‌కు పూర్తిగా తలుపులు తెరుచుకున్నాయని ప్రధాని తెలిపారు. రైతులు, మత్స్యకారులు, సేవారంగానికి ఫ్రీ ట్రేడ్‌తో లాభాలు ఉంటాయన్నారు. రిఫార్మ్, పెర్ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్' మార్గంలో ప్రభుత్వం పయనిస్తోందని, పూర్తి వేగంతో 'రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్' సాగుతోందన్నారు. దీర్ఘకాలిక సమస్యలకు దీర్ఘకాలిక పరిష్కారాల దిశగా భారత్ ముందుకు సాగుతోందని, హ్యూమన్ సెంట్రిక్ అభివృద్ధే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. లాస్ట్ మైల్ డెలివరీపై ప్రత్యేక దృష్టి పెట్టామని, ఇది అడ్డంకుల కాలం కాదని, పరిష్కారాల కాలమని ప్రధాని పేర్కొన్నారు.

## దేశంలో వీధికుక్కల సమస్య...

## తీర్పు రిజర్వ్ చేసిన సుప్రీంకోర్టు



దేశవ్యాప్తంగా వీధి కుక్కల నిర్వహణ, ప్రజల భద్రతకు సంబంధించిన సుమోటో కేసులో సుప్రీంకోర్టు తన తీర్పును రిజర్వ్ చేసింది. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రం, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ భారత జంతు సంక్షేమ బోర్డు సహా అన్ని వర్గాల వాదనలను సుదీర్ఘంగా విన్న తర్వాత జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి. అంజారియాలతో కూడిన ధర్మాసనం గురువారం ఈ నిర్ణయం తీసుకుంది. వారం రోజుల్లోగా తమ లిఖితపూర్వక వాదనలను సమర్పించేందుకు అన్ని పక్షాలకు సమయం ఇచ్చింది. విచారణ సందర్భంగా, వీధి కుక్కల స్టెరిలైజేషన్ కేంద్రాల లెక్కల్లో భారీ వ్యత్యాసాలు ఉన్నాయని జంతు సంక్షేమ బోర్డు కోర్టు దృష్టికి తెచ్చింది. దేశవ్యాప్తంగా గుర్తింపు పొందినవి 76 కేంద్రాలు మాత్రమే ఉండగా, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం 883 ఉన్నాయని నివేదికలు సమర్పించాయని తెలిపింది. ఈ లెక్కల్లోని తేడాలపై, నిధుల వినియోగంపై ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. గుర్తింపు కోసం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటినీ నిర్దేశిత సమయంలోగా పరిష్కరించాలని జంతు సంక్షేమ బోర్డును ఆదేశించింది. ఈ సుమోటో విచారణలో భాగంగా కుక్కల ప్రేమికులు, కుక్కకాటు బాధితులు, జంతు హక్కుల కార్యకర్తల వాదనలను కూడా కోర్టు పరిగణనలోకి తీసుకుంది. యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) నిబంధనల అమలు, ప్రజల భద్రత, కుక్కల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించడం వంటి అంశాలపై ఈ కేసు దృష్టి సారించింది. గతంలో, 2025 ఆగస్టులో జస్టిస్ జె.బి. పార్దివాలా నేతృత్వంలోని మరో ధర్మాసనం ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో వీధి కుక్కలన్నింటినీ వెంటనే పట్టుకుని షెల్టర్లకు తరలించాలని కఠిన ఆదేశాలు జారీ చేసింది. అయితే, ఆ తీర్పుపై తీవ్ర వ్యతిరేకత రావడంతో ప్రస్తుత త్రిసభ్య ధర్మాసనం ఆ ఉత్తర్వులను సవరించింది. కుక్కలను తరలించే బదులు, ఏబీసీ నిబంధనల ప్రకారం వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేసి తిరిగి అవే ప్రాంతాల్లో వదిలిపెట్టాలని స్పష్టం చేసింది. తాజాగా వాదనలు ముగియడంతో తుది తీర్పుపై ఉత్కంఠ నెలకొంది.

ధర్మఘంట

# బోగస్ కార్డుల ఏరివేత?

-మొదటిపేజీ తరువాయి

తెలుపు రేషన్ కార్డుకు ఎవరు అనర్హులంటే? :
కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల్లో ఉద్యోగం చేస్తున్నవారు
నాలుగు ఎకరాల పైబడి పొలం ఉన్నవారు
రూ. 8లక్షల ఆదాయం మించి ఉన్నవారు

**ఇన్‌కం ట్యాక్స్‌ను చెల్లిస్తున్నవారు**

పైన వివరించిన కేటగిరీల వారు రేషన్ పొందేందుకు అనర్హులు. అయితే ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న వారిలో అధికశాతం మంది తెల్ల రేషన్ కార్డును కలిగి ఉన్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా దాదాపు 50 వేలకుపైగా బోగస్ కార్డులున్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించినట్లుగా సమాచారం. మృతుల పేర్లతోపాటు పెళ్లి చేసుకొని వెళ్లినవారివి రెండు చోట్ల రేషన్ కార్డులు ఉంటున్నాయి. దీంతో నెలనెలా వందలాది కిలోల బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతోందని అధికారుల విచారణలో తేటతెల్లమైంది. సన్న బియ్యాన్ని కూడా అక్రమ వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాలకు తరలించి అమ్ముకుంటున్నారనేటువంటి ఆరోపణలున్నాయి. బోగస్ కార్డులతో వైద్య సేవలతోపాటు పింఛన్లను పొందుతున్నట్లు అధికారులు గుర్తించారు. జిల్లాల్లోని అనర్హులను గుర్తించి, ఓ జాబితాను రూపొందించాలని ఉమ్మడి కరీంనగర్ అన్ని రేషన్ దుకాణాల డీలర్లకు ఇప్పటికే ఆదేశాలందాయి. రాష్ట్ర పౌరసరఫరాశాఖ అధికారులు గుర్తించిన పేర్ల జాబితాను అన్ని జిల్లాలకు పంపించారు. మండల రెవెన్యూ కార్యాలయాల(తహసీల్దార్) నుంచి చౌకధరల దుకాణాల డీలర్లకు జాబితా అందించారు. జాబితాలో ఉన్నవారి పేర్లు అర్హులా, అనర్హులా అనే విషయాన్ని గుర్తించాల్సి ఉంది. ఇటీవల కొత్తగా రేషన్ కార్డులు పొందిన వారిలోనూ అనర్హులు ఉన్నట్లుగా తెలుస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొత్తం 3048 రేషన్ దుకాణాలుండగా 11,11,270 రేషన్ కార్డులున్నాయి.

**పరిశీలనలో తేలినవారివి తీసేస్తాం**

బోగస్ రేషన్ కార్డుల ఏరివేత ప్రక్రియ ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు జరుగుతుందని రెవెన్యూ ఉన్నతాధికారులు వివరించారు. జాబితాలో పేర్లు ఉన్నంత మాత్రాన ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పరిశీలనలో తేలినవారిని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని వివరించారు. అన్ని మండలాల్లో జాబితాలు పరిశీలిస్తున్నట్లుగా పేర్కొన్నారు.

**ఈకేవైసీ చేయించుకున్నారా**

రాష్ట్రంలో ఇటీవల కొత్త రేషన్‌కార్డులను పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. నూతనంగా రేషన్‌కార్డులు తీసుకున్న వారంతా ఈ-కేవైసీ ప్రక్రియ చేసుకోవాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు. కార్డులో పేర్లున్న కుటుంబ సభ్యులందరూ దగ్గరలోని రేషన్ దుకాణానికి వెళ్లి ఈ-పాస్ యంత్రంలో బయోమెట్రిక్ వేలిముద్రలు అప్‌డేట్ చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఈ-కేవైసీ నమోదు చేయుంచుకోవాలని గత రెండేళ్ల నుంచి ప్రభుత్వం పలుమార్లు విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ కొంతమంది పెడచెవిన పెడుతున్నారు. అయితే ఇప్పటికే పలుమార్లు గడువు పెంచుకుంటూ వెళ్తోంది.

**బియ్యం నిలిపివేస్తామని పలుమార్లు హెచ్చరించినా**

ఈ-కేవైసీ చేయించుకొని వారికి రేషన్ సరఫరా నిలిపివేస్తామని ప్రభుత్వం గతంలో పలుమార్లు హెచ్చరించింది. అయినప్పటికీ కొంతమంది ఇంకా ఆలస్యం చేస్తూనే ఉన్నారు. అయితే ఈ హెచ్చరికకు కారణం ఆధార్‌కు ఈ-పాస్ మిషన్‌కు అనుసంధానం చేయడంతో బినామీ పేర్లమీద బియ్యం తీసుకోకుండా అడ్డుకట్ట వేయడం సులభం అవుతుంది. దీంతో రేషన్ షాప్‌లలో బియ్యం పంపిణీ మరింత సమర్థ వంతంగా అమలు చేయవచ్చు. ఈ కారణాల వల్ల ఈ-కేవైసీ నిబంధన తప్పనిసరి విధానంగా చేశారు. ఈకేవైసీ అమలు చేయడం వల్ల బోగస్ కార్డులను ఏరివేసేందుకు అవకాశం ఉంటుంది.

# మొక్కు తీర్చుకునేందుకు ఎడ్లబండ్లే



**వరంగల్ :** మేడారం సమ్మక్క సారలమ్మ జాతర అత్యంత వైభంగా జరుగుతోంది. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వరకూ మాత్రమేకాదు, తెలుగు రాష్ట్రాలు, దూరప్రాంతాల నుంచి రోజూ లక్షలాదిగా భక్తులు మేడారం జతరకు తరలివెళుతున్నారు.మేడారం సమ్మక్కా ,సారలమ్మ జాతర దర్శించుకోవడానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని వివిధ ప్రాంతాల నుంచి కాలినడకన వచ్చేవారు. ఆ తరువాత కాలంలో ఎడ్ల బండ్లపై రావడం ఆనవాయితీగా మారింది. వ్యవసాయ ఆధారిత గ్రామాలు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచి ఎడ్లబండ్లపై అమ్మవారి జాతరకు ఓ నాలుగు రోజుల ముందే కుటుంబ సమేతంగా బయలుదేరేవారు. ముఖ్యంగా తెలంగాణలో ప్రతీ గ్రామం నుంచి బండెనక బండి కట్టి, పదహారు బళ్లు కట్టి అన్నట్లుగా ఒక్కో ఊరు నుంచి వందల బళ్లు మేడారం జాతరకు కదిలేవి. ఈ ఏడాది కూడా ఎడ్ల బండి సెంటిమెంట్ విషయంలో ఎక్కడా తగ్గేదే లేదంటున్నారు మేడారం భక్తులు. ఏఐ యుగంలోకి ప్రవేశించినా ఎడ్ల బండ్లంటేనే అమ్మవారికి మహా ఇష్టమంటున్నారు. ఈ ఏడాది మేడారం జాతరకు తెలంగాణ ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేనంతగా అద్భుతంగా ఏర్పాట్లు చేసింది. మేడారం ప్రాంగణాన్ని వందల కోట్లతో కన్నుల పండుగగా అభివృద్ధి చేయడమేకాదు, దూర ప్రాంతాల నుండి మేడారం వెళ్లే భక్తుల కోసం వేలాదిగా ఆర్టీసి బస్సు సర్వీసులు నడపడమేకాదు, ఏకంగా తొలిసారి రెండు హెలికాప్టర్ల ను ఏర్పాటు చేసి గంటన్నరలో మేడారం దర్శనం చేసి తీసుకొచ్చేందుకు సర్వం సిద్ధం చేసింది. హనుమకొండలో మీరు అలా హెలికాప్టర్ ఎక్కితే కేవలం 35 నిమిషాల్లో మేడారం , 30నిమిషాల్లోపు మేడారం దర్శనం, మరో 35 నిమిషాల్లో తిరిగి హనుమకొండకు చేర్చేలా హెలికాప్ట్ సేవలు అందుబాటులోకి తెచ్చారు. ఒక్కో వ్యక్తికి 36వేలు టిక్కెట్ ఖర్చుతో మొత్తం మేడారం దర్శనం అనుభూతి కల్పిస్తున్నారు.కేవలం గంటన్నరలోనే దర్శనం పూర్తి చేసుకునే అవకాశంతోపాటు అందుబాటులో ఆర్టీసి బస్సులు, ప్రవేటు వాహనాలు ఇలా అనేక మార్గాల ద్వారా మేడారం చేరుకునే సదుపాయాలు ఉన్నా, నేటికీ తెలంగాణలోని అనేక గ్రామాల నుండి ఎడ్ల బండ్లపై భక్తులు భారీగా తరలిరావడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. మాకు మగ బిడ్డ పుడితే ఎడ్ల బండిపై మేడారం వస్తామని మొక్కుకున్నాం. అమ్మ అనుగ్రహించింది ,మగ బిడ్డ పుట్టాడు. అందుకే ప్రతీ ఏడాది ఎడ్ల బండిపైనే మేడారం గద్దెలను దర్శించుకుంటున్నామని జాతరకు వస్తున్న కొందరు భక్తులు చెబుతున్నారు. ఇలా కొందరు సంతానం కోసం, మరికొందరు అనుకున్నది సాధించడం కోసం.. ఇలా మొక్కులు తీరడంతో ఎడ్ల బండ్లపైనే ప్రతీ జాతరకు సుదూర ప్రాంతాల నుండి సైతం తరలివస్తున్నారు.ఒక్కో ఎడ్ల బండిపై ఒక్కో కుటుంబం , వారితోపాటు అమ్మవారికి మొక్కులు తీర్చుకోవడానికి మేకపోతు,నాటు కోడి, నాలుగు రోజులకు అవసరమైన మద్యం, ఎడ్లకు ఓ ఐదు రో?జులకు సరిపడా ఎండుగడ్డి, ఎడ్ల బండ్లు మధ్యలో ఆపి సేదతీరెందుకు , పొలామధ్యలో దారాలు వేసి రాత్రి సమయంలో నిద్రించేందుకు పరదాలు, వంటకు అవసరమైన రైస్, కూరగాయలు, ఉప్పు, పప్పు, కట్టెలు, ఇలా అన్నీ ఎడ్ల బండిపైన సర్దుకుని మేడారం జాతరకు కుటుంబ సమేతంగా బయలుదేరడం తరతరాలుగా లక్షలాది మంది భక్తులకు ఓ సెంటిమెంట్ గా వస్తోంది. తెల్లవారుజామున లేచి, ఆరోజుకు సరిపడా మూడుపూటల భోజనం సిద్ధం చేసుకుని ఇంటి వద్ద మొదలైన మేడారం ప్రయాణం, ప్రతీ పది లేదా పదిహేను కిలోమీటర్లకోసారి ఎడ్లను ఆపి, కాసేపు అందమైన పంటచేల మధ్యలో , ఆహ్లాదరకమైన అడవి మార్గంలో సేద తీరుతీరుతుంటారు. వాగులకు సమీపంలో భోజనం చేయడం, రాత్రి సమయంలో అక్కడే డేరాలు వేసుకుని నిద్రించడం, తిరిగి తెల్లవారుజామున మళ్లీ ప్రయాణం మొదలుపెట్టడం.. ఇలా మేడారం చేరుచుకునే మార్గమధ్యలో ఎడ్లబండి ప్రయాణం అంటే మాటల్లో చెప్పలేని సరికొత్త అనుభూతి అనడంలో ఏ మాత్రం సందేహంలేదు. అన్నదమ్ములు, ఆడపడుచులు, అక్క చెల్లెళ్లు , అత్త కోడళ్లు.. ఇలా అంతా తమ ఎడ్లబండ్లపై మేడారం సమీపంలో ఒకేచోటకు చేరుకుంటారు. అక్కడే ఎడ్లబండ్లకు డేరాలు కట్టి గుడారాలుగా మార్చుకుంటారు. అలా నాలుగు రోజులపాటు మేడారం పరిసర ప్రాంతాల్లో ఎన్నో కుటుంబాలు ఒక్కటై మేడారం గద్దెల వద్ద మొక్కులు తీర్చుకుంటారు. మందు ,ముక్క లేకుండా జాతర పూర్తవ్వదనే విషయం తెలిసిందే.. అలా సరదాగా గడపడం కోసం రెండేళ్ల కోసారి తెలంగాణలో రైతుల కుటుంబాలేకాదు, రైతులను నమ్ముకున్న ఎద్దులు సైతం ఎదురుస్తుంటాయట, ఓ ఏడాది జాతరకు వెళ్లిన ఎద్దులు, అదే మార్గం గుర్తుపెట్టుకుని రైతు చెప్పకుండానే మేడారం జాతర వద్దకు తీసుకెళ్లడం మరో విశేషంగా చెప్పవచ్చు.

# మేడారంలో భగ్గుంటున్న ధరలు

**వరంగల్ :** మేడారం జాతర ప్రారంభమైంది. వనదేవతల దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. అయితే, జాతర నేపథ్యంలో కొబ్బరికాయల నుంచి కోళ్లు, మేకల ధరలు, ఇళ్ల అద్దెల వరకు అన్నీ ఆకాశాన్నంటుతున్నాయి. స్థానికులు ఇళ్లలో కనీస వసతులు లేకున్నా అధిక మొత్తంలో అద్దెలు వసూలు చేస్తూ భక్తులను దోచుకుంటున్నారు. చెట్టు నీడకు కూడా కిరాయి వసూలు చేయడం గమనార్హం. ఈ మూడు రోజులు ధరలు మరింత పెరుగుతాయంటున్నారు. పెరిగిన ధరలతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు.తెలంగాణ కుంభమేళా మేడారం జాతర ప్రారంభమైంది. నేటి నుంచి నాలుగు రోజుల పాటు జరగనున్న వనదేవతల జాతరకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక, పక్క రాష్ట్రాల నుంచి కూడా భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. తెలంగాణ జాతరకు వెళ్లే భక్తుల కోసం టీజీఆర్టీసీ 4 వేల బస్సులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది.దిలా ఉంటే జాతర నేపథ్యంలో మేడారం పరిసర ప్రాంతాల్లో ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. కొబ్బరికాయ మొదలు అమ్మలకు సమర్పించే బంగారం (బెల్లం), కోళ్లు, మేకల ధరలతో పాటు, ఇళ్లు, ప్రత్యేక గదుల అద్దెలను భారీగా పెంచి భక్తులను దోచుకుంటున్నారు. ఆఖరికి చెట్టు నీడకు కూడా కిరాయి వసూలు చేస్తున్నారంటే జాతరలో దోపిడీ ఏ స్థాయిలో జరుగుతుందో ఊహించవచ్చు.మేడారం జాతరలో భాగంగా భక్తులు మొక్కులు చెల్లించుకోవడానికి బంగారం (బెల్లం)తో పాటు కోళ్లు, మేకలను సమర్పిస్తారు. ఇదే అదునుగా మేడారం జాతర వద్ద కోళ్లు, మేకల ధరలను భారీగా పెంచారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు వెంట తీసుకురాలేక, జాతరకు వచ్చాక అక్కడే కొనుగోలు చేస్తుంటారు. ఈ క్రమంలో వ్యాపారులు ధరలను రెట్టింపు చేశారు.మేకపోతు లైవ్ కిలో రూ. 420 ఉండగా, మేడారంలో మాత్రం రూ. 900 నుంచి రూ. 1000 వరకు అమ్ముతున్నారు. మటన్ ధర రూ. 1500 వరకు పలుకుతోంది. బయట రూ. 170-180 కి దొరికే కిలో కోడిని జాతర దగ్గర రూ. 300-350 వరకు అమ్ముతున్నారు. మొన్నటి వరకు కూడా కిలో రూ. 350-400 ఉన్న నాటుకోడిని ఇప్పుడు రూ. 700లకు అమ్ముతున్నారు. జాతర చివరి మూడు రోజుల్లో ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది.ఇళ్ల అద్దెలు కూడా భక్తులకు చుక్కలు చూపిస్తున్నాయి. కనీస వసతి సౌకర్యాలు లేకపోయినా సరే అద్దెలు ఆకాశాన్నంటాయి. ఆఖరికి చెట్ల నీడలో సేదతీరడానికి కూడా అద్దెలు వసూలు చేస్తున్నారు. పిల్లలు, వృద్ధులతో వచ్చిన భక్తులు ఉండటానికి ఇళ్లు వెతుకుతుండటంతో స్థానికులు భారీ మొత్తంలో అద్దెలు వసూలు చేస్తున్నారు. ఒక్క ఫ్యాన్ తప్ప మరే ఇతర సౌకర్యాలు లేని గదులకు కూడా రోజుకు రూ. 6 వేల వరకు వసూలు చేస్తున్నారు.గదులు దొరకని వారు చెట్ల నీడలో సేదతీరడానికి ప్రయత్నిస్తుండగా, తోట యజమానులు వాటికి కూడా అద్దెలు వసూలు చేస్తున్నారు. జాతరకు దగ్గరలో తోటలున్న స్థానికులు భక్తులకు చెట్లను అద్దెకు ఇస్తున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేయడానికి ఒక్కో చెట్టుకు రూ. 1000 చొప్పున వసూలు చేస్తున్నారు.



## ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక మలుపు

-మొదటిపేజీ తరువాయి

హరీశ్‌రావు, సంతోశ్ రావులను ప్రత్యేక దర్యాప్తు బృందం విచారించిన విషయం విధితమే. ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు వేగవంతం : రాష్ట్రంలో రాజకీయ ప్రకంపనలు సృష్టించిన ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో సిట్ దర్యాప్తును వేగవంతం చేసింది. ఇప్పటికే ఈ కేసులో నలుగురు పోలీసు అధికారులను అరెస్ట్ చేయగా, ప్రభాకర్ రావును సైతం పలుమార్లు ప్రత్యేక దర్యాప్తు బృందం విచారించింది. ఈ కేసులో చిన్న చిన్న గ్యాప్స్‌ను కూడా ఫిల్ చేస్తూ సీపీ సజ్జనార్ నేతృత్వంలో ఏర్పాటైన సిట్ ముందుకు వెళ్తోంది. ప్రధాన నిందితుడు ప్రభాకర్ రావు విచారణ కస్టోడియల్ విచారణ ఆధారంగా కీలక సమాచారాన్ని సేకరించింది. ఇప్పటికే ట్యాపింగ్ బాధితులుగా ఉన్న మొత్తం 618 మందిని దాదాపు అందరి స్టేట్మెంట్‌ను రికార్డ్ చేసిన సిట్ అధికారులు, ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణ తర్వాత మరికొంతమందిని పిలిచి విచారిస్తున్నారు.

**ఎస్ఐబీ ఏఎస్పీ ఇచ్చిన ఫిర్యాదుతో**

స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా 2024 మార్చి 10న పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫోన్ ట్యాపింగ్ కేసు నమోదైంది. అప్పటి నుంచి ఈ కేసు అనేక కీలక మలుపులు తిరుగుతూ, అక్రమ నిఘాకు సంబంధించిన తీవ్రమైన ఆరోపణలను వెలుగులోకి తెచ్చింది. వీసీ సజ్జనార్ నాయకత్వంలో మరో సిట్ ఏర్పాటు చేసిన తర్వాత దర్యాప్తు మరింత వేగవంతమైంది. దీని తర్వాత సిట్ ఇటీవల ఎమ్మెల్సీ నవీన్ రావు, మాజీ మంత్రి హరీశ్ రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ రాజ్యసభ సభ్యుడు సంతోష్ కుమార్‌లను విచారించింది. వారి వాంగ్మూలాలను నమోదు చేయడంతో పాటు, విచారణ ప్రక్రియ మొత్తాన్ని వీడియో తీశారు. అనేక వాంగ్మూలాల్లో కేసీఆర్ పేరు వెలుగులోకి రావడంతో, ఇప్పుడు ఆయనకు నోటీసులు జారీ చేయాలని సిట్ నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. రాధాకిషన్ రావు తన వాంగ్మూలంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేసీఆర్ పాత్ర గురించి ప్రస్తావించినట్లు ఆరోపణలు వచ్చాయి. భుజంగ రావు కూడా ప్రభాకర్ రావు నియామకం గురించి ప్రస్తావిస్తూ కేసీఆర్ పేరు చెప్పినట్లు సమాచారం. ఈ కేసులో పాలుపంచుకున్న సీనియర్ అధికారులు సంబంధిత కాలంలో మాజీ ముఖ్యమంత్రి అధికారిక నివాసమైన ప్రగతి భవన్‌ను తరచుగా సందర్శించారని భుజంగ రావు తన వాంగ్మూలంలో పేర్కొన్నారు. ఈ వాంగ్మూలాలు, వాటికి మద్దతుగా లభించిన ఆధారాల ఆధారంగా సిట్ తన దర్యాప్తును ముందుకు తీసుకెళ్తుందని భావిస్తున్నారు. కేసీఆర్‌కు నోటీసులు జారీ చేయడంతో దర్యాప్తు కీలక దశలోకి ప్రవేశించింది. రాబోయే రోజుల్లో ఇది మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది.

**ఇటీవలే కేటీఆర్‌ను లోతుగా విచారించిన సిట్**

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేటీఆర్‌ను ఇటీవల ప్రత్యేక దర్యాప్తు బృందం లోతుగా విచారించింది. ఆయనను పలు అంశాలపై అధికారులు ప్రశ్నించినట్టు తెలిసింది. పార్టీకి ఎలక్టోరల్ బాండ్లు, విరాళాలు సమకూర్చిన వారిలో పలువురు వ్యాపారుల మొబైల్స్ నిఘాలో ఉన్నట్లుగా సిట్‌కు ఆధారాలు లభించాయి. ఈ నేపథ్యంలోనే అధికారులు పలు ప్రశ్నలు అడిగినట్లుగా తెలిసింది. ఆయా ఫోన్ నెంబర్లతో ఉన్న జాబితాను కేటీఆర్ ముందు ఉంచి విచారించినట్లు సమాచారం. అలాగే ఫోన్ ట్యాపింగ్ ద్వారా తమను బెదిరించి బీఆర్ఎస్‌కు ఎలక్ట్రోరల్ బాండ్లు సమకూర్చే విధంగా చేశారంటూ కొంతమంది వ్యాపారులు ఇచ్చిన ఫిర్యాదులపై ప్రశ్నించగా, అలాంటిదేమీ లేదని కేటీఆర్ సమాధానం ఇచ్చారు. వ్యాపారులు తమకు స్వచ్ఛందంగానే విరాళాలను ఇచ్చారని చెప్పినట్లు సమాచారం.

## దేశంలోని అత్యంత ప్రమాదకరస్థితిలోని మూడు డ్యామ్‌లలో మేడిగడ్డ

-మొదటిపేజీ తరువాయి

50 ఏళ్లకు పైబడిన డ్యామ్‌లు 1,681 ఉన్నాయని జల్‌శక్తి శాఖ తెలిపింది. గత సంవత్సరం వర్షాకాలం కంటే ముందు 6,524 డ్యామ్‌లు తనిఖీ చేశామని కేంద్రం వెల్లడించింది. వర్షాకాలం అనంతరం మరో 6,553 డ్యామ్‌లు తనిఖీ చేసినట్లు తెలిపింది. ఈ తనిఖీలలో మూడు డ్యామ్‌లు అత్యంత ప్రమాదకరంగా ఉన్నట్లు వెల్లడైందని పేర్కొంది. వాటిలో తెలంగాణలోని మేడిగడ్డ, ఉత్తరప్రదేశ్‌లోని లోయర్ ఖజురి, ఝార్ఖండ్‌లోని బొకారో డ్యామ్‌లు ఉన్నట్లు వెల్లడించింది. మేడిగడ్డ డ్యామ్‌కు సంబంధించి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించినట్లు జల్‌శక్తి శాఖ తెలిపింది.

## వనం వీడి జనంలోకి సమ్మక్క

మేడారం జాతరలో కీలక ఘట్టం రానే వచ్చింది. వనం (చిలకలగుట్ట) వీడి జనంలోకి సమ్మక్క ఆగమనం ప్రారంభమైంది. సమ్మక్క తల్లికి గౌరవసూచకంగా గాల్లోకి ఎస్పీ రాంనాథ్ కేకన్ కాల్పులు జరిపారు. పోలీసులు సమ్మక్క తల్లికి గౌరవవందనం సమర్పించారు. ఆ తల్లికి మంత్రులు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ ఘనస్వాగతం పలికారు. భక్తులు సమ్మక్కకు జై అంటూ నినాదాలు చేశారు. భక్తుల జయజయధ్వానాలతో సమ్మక్క కాసేపట్లో గద్దెలపైన కొలువుదీరనుంది. బుధవారమే సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెలపై కొలువుదీరారు.

## కమలానికి పరీక్ష

-మొదటిపేజీ తరువాయి

చేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో భాగంగానే వరుసగా ఎన్నికల సన్నాహక సమావేశాలను నిర్వహిస్తూ నాయకులకు ఇన్‌చార్జీలు దిశానిర్దేశం చేస్తున్నారు. ఇప్పటికే జాతీయ నాయకత్వం ముగ్గురు ఎన్నికల ఇన్‌చార్జీలు, కో ఇన్‌చార్జీలను నియమించగా త్వర లోనే జాతీయ అధ్యక్షుడితోపాటు పలువురు జాతీయ నాయకులకు ఏకంగా రంగంలోకి దింపబోతోందిరాష్ట్రంలో ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలు, 2,996 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్ ప్రక్రియకు రేపటితో ఆఖరు గడువు. అయితే గత మున్సిపల్ ఎన్నికల్లో 322 కౌన్సిలర్లు, కార్పొరేటర్లను బీజేపీ గెలుచుకుంది. వీటితోపాటు ఐదు మున్సిపల్ చైర్మన్లను బీజేపీ తమ ఖాతాలో వేసుకుంది. మొన్న జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 5000 మందిని బరిలోకి దింపి 800 నుంచి 1000 వరకు పంచాయతీలను గెలుచుకుంది.గ్రామీణంలో తమకు పెద్దగా బలం లేదని, పట్టణమే తమ బలమని కమలం పార్టీ ముందు నుంచి అంటోంది. ప్రజల్లోనూ బీజేపీ అంటే అర్బన్ పార్టీ అనే ముద్రనే ఉంది. ఇప్పుడిదే బీజేపీకి అగ్నిపరీక్షగా మారింది. మరోవైపు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కూడా అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంటున్నాయి. రాజకీయ పార్టీల గుర్తుల మీద ఈ ఎన్నికలు జరుగనుండటంతో పురపోరులో ఏ పార్టీ బలమెంతో స్పష్టమవుతుంది. తమకున్న పేరును నిలుపుకోవాలన్నా...వచ్చే జీహెచ్ఎంసీ, అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించాలన్నా ఈ ఎన్నికల్లో కచ్చితంగా విజయబావుటా ఎగురవేయాల్సిందే.ఇందులో భాగంగానే బీజేపీ ఈసారి పెద్ద టార్గెట్‌ను పెట్టుకుంది. మొత్తం మున్సిపాలిటీల్లో 50 నుంచి 60 శాతం వరకు గెలవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అలాగే ఏడు కార్పొరేషన్లలో నాలుగు నుంచి ఐదు వరకు గెలుచుకునేలా వ్యూహాలను అమలు చేస్తోంది. వీటితోపాటు పార్టీ తన ఉనికిని చాటుకునేలా ఎక్కువ కార్పొరేటర్లు, కౌన్సిలర్లను గెలుచుకోవడమే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది.నూతనంగా ఎన్నికైన జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌తో వారం రోజుల క్రితం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు భేటీ అయ్యారు. ఢిల్లీ నుంచి ఆయన వచ్చిన వెంటనే అత్యవసరంగా పార్టీ పదాధికారుల మీటింగ్ నిర్వహించి నాయకులకు దిశానిర్దేశం చేశారు. జాతీయ నాయకత్వం ఇప్పటికే ముగ్గురిని రంగంలోకి దింపిందని, వారికి మున్సిల్ ఎన్నికల ఇన్‌చార్జీలుగా నియమిస్తూ.. మహారాష్ట్ర మంత్రి ఆశిష్ శెలార్‌కు, కోఇన్‌చార్జీలుగా రేఖా శర్మ, అశోక్‌కు బాధ్యతలను అప్పగించిందని పేర్కొన్నారువీరు ముఖ్యనాయకులతో వరుసగా ఎన్నికల సన్నాహాక సమావేశాలను నిర్వహిస్తూ ఎన్నికల వ్యూహాలను రచిస్తున్నారు. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలకు ఆయా జిల్లాలు, నియోజకవర్గాలు, పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఎన్నికల టాస్క్‌లను అప్పగించారు. వీటికితోడూ ఇప్పటికే జిల్లా, మున్సిపాలిటీల వారీగా మరికొంత మంది రాష్ట్ర నేతలను ఇన్‌చార్జీలుగా రాష్ట్ర నాయకత్వం నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా రెండు భారీ బహిరంగ సభలను నిర్వహించాలని పార్టీ నిర్ణయించినట్లు తెలుస్తోంది.ఫిబ్రవరి 7, 9వ తేదీల్లో వీటిని నిర్వహించాలని ప్లాన్ చేసినట్లు తెలిసింది. ఈ సభలను ఉత్తర తెలంగాణ, దక్షిణ తెలంగాణలో నిర్వహించాలని నిర్ణయించారు. తొలుత ఐదు సభలను నిర్వహించాలని అనుకున్న పార్టీ నేతలు దాన్ని రెండుకు కుదించినట్లుగా తెలిసింది. ఈ సభల ద్వారా ఓటర్లను ఆకర్షించేందుకు బీజేపీ జాతీయ స్థాయి దిగ్గజాలను రంగంలోకి దించుతోంది.పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సిన్హాతో పాటు కీలక నేత అమిత్‌షా హాజరుకానున్నట్లు తెలుస్తోంది. అయితే ఎన్నికలకు చాలా తక్కువ సమయం ఉండడంతో ఎన్ని సభలు నిర్వహిస్తారో...ఎంత మంది నేతలు వస్తారనేది ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలంటే కమలనాథులకు ఈ పురపోరు ఎన్నికలు మాత్రం పరీక్షే అని చెప్పాలి.

# తెలంగాణ కుంభమేళా గా.... సమ్మక్క సారలమ్మ జాతర

**గిరిజన సంప్రదాయాలు...జాతర పద్ధతులు**

**ప్రజలను చల్లంగా చూడలమ్మ.... అంటూ మొక్కులు చెల్లిస్తున్న భక్తులు**









సమ్మక్క సారక్క జాతర (మేడారం జాతర) ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగగా ప్రసిద్ధి చెందింది. ఇది తెలంగాణ రాష్ట్రంలోని ములుగు జిల్లా, తాడ్వాయి మండలంలోని మేడారం అటవీ ప్రాంతంలో ప్రతి రెండు ఏళ్లకోసారి జరుగుతుంది. 2026 సంవత్సరానికి గాను ఈ మహా జాతర జనవరి 28 నుంచి జనవరి 31 వరకు అత్యంత వైభవంగా జరుగుతోంది.జాతర విశిష్టత మరియు చరిత్ర

ఈ జాతర కేవలం ఒక పండుగ మాత్రమే కాదు, అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడిన వీర వనితల త్యాగానికి చిహ్నం.

**పోరాట నేపథ్యం:**

13వ శతాబ్దంలో కాకతీయ రాజులు గిరిజనులపై విధించిన అన్యాయమైన పన్నులకు వ్యతిరేకంగా సమ్మక్క మరియు ఆమె కుమార్తె సారలమ్మ వీరోచితంగా పోరాడి ప్రాణత్యాగం చేశారు.

**వన దేవతలు రూపం:**

ఈ జాతరలో దేవతలకు విగ్రహాలు ఉండవు. గద్దెలపై ప్రతిష్టించే కుంకుమ భరిణెలు, వెదురు కర్రలనే వన దేవతలుగా భక్తులు కొలుస్తారు.బంగారం మొక్కులు: భక్తులు తమ బరువుకు తూగే బెల్లాన్ని (దీనిని 'బంగారం' అని పిలుస్తారు) దేవతలకు సమర్పించుకుంటారు.

కుటుంబ నేపథ్యం(వీరిని కూడా జాతరలో స్మరిస్తారు)

**పగిడిద్ద రాజు:**

సమ్మక్క భర్త మరియు మేడారం ప్రాంతానికి అధిపతి. కాకతీయులతో జరిగిన పోరాటంలో ఈయన వీరమరణం పొందారు.

**జంపన్న:**

సమ్మక్క కుమారుడు. యుద్ధంలో గాయపడి సంపెంగ వాగులో ప్రాణాలు విడిచారు. ఆయన జ్ఞాపకార్థం ఆ వాగును జంపన్న వాగుగా పిలుస్తారు.

**గోవింద రాజు:**

సారలమ్మ భర్త (సమ్మక్క అల్లుడు). ఈయనను కూడా జాతరలో భాగంగా కొలుస్తారు.

నాగులమ్మ: సమ్మక్క మరో కుమార్తె.

మేడ రాజు: సమ్మక్క తండ్రి మరియు గిరిజన తెగకు నాయకుడు. ప్రధాన ప్రాముఖ్యతలు

**అన్యాయంపై పోరాట స్ఫూర్తి:**

13వ శతాబ్దంలో కరువు కాలంలో కూడా పన్నులు వసూలు చేసిన కాకతీయ రాజులపై గిరిజన మహిళలైన సమ్మక్క, సారక్క వీరోచితంగా పోరాడారు. ఈ జాతర వారి త్యాగానికి మరియు ధైర్యానికి నిదర్శనం.

**ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర:**

కుంభమేళా తర్వాత దేశంలో అత్యధికంగా భక్తులు తరలివచ్చే జాతర ఇదే. దీనిని 'తెలంగాణ కుంభమేళా' అని కూడా పిలుస్తారు.

**వన సంస్కృతి - ప్రకృతి ఆరాధన:**

ఇక్కడ విగ్రహాలు ఉండవు. దేవతలను వన దేవతలుగా భావిస్తూ కుంకుమ భరిణెలు మరియు వెదురు కర్రలను పూజిస్తారు. ఇది ప్రకృతికి మరియు మనిషికి ఉన్న అనుబంధాన్ని తెలియజేస్తుంది. కులమతాలకు అతీతమైన జాతర.ఐక్యత: గిరిజన పండుగగా ప్రారంభమైనా, నేడు కులమతాలకు అతీతంగా కోట్ల మంది ప్రజలు పాల్గొంటారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల నుండి భక్తులు వస్తారు. బంగారం మొక్కులు: భక్తులు తమ బరువుకు తూగే బెల్లాన్ని బంగారం గా భావించి సమర్పిస్తారు. ఇది భక్తుల నమ్మకానికి మరియు విశ్వాసానికి ప్రతీక.జంపన్న వాగు విశిష్టత: సమ్మక్క కుమారుడైన జంపన్న ఈ వాగులో యుద్ధం చేస్తూ ప్రాణాలర్పించాడని భక్తుల నమ్మకం. ఈ వాగులో స్నానం చేస్తే పాపాలు పోయి, ధైర్యం కలుగుతుందని విశ్వసిస్తారు.

**సమ్మక్క చరిత్ర:**

సుమారు 900 ఏళ్ల నాటి గిరిజన వీరగాథ. అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడి, గిరిజనుల ఆత్మగౌరవాన్ని కాపాడిన వీరవనితగా ఆమెను భక్తులు కొలుస్తారు. సమ్మక్క జననం మరియు బాల్యం గిరిజన కథనాల ప్రకారం, 13వ శతాబ్దంలో వేట కోసం అడవికి వెళ్లిన గిరిజన నాయకులకు చిలుకలగుట్ట సమీపంలో పులుల మధ్య ఆడుకుంటున్న ఒక పసిపాప కనిపించింది. ఆ పాప శరీరం నుండి విపరీతమైన కాంతి పుడుతుండటం చూసి, గిరిజన దొర మేడ రాజు ఆమెను దత్తత తీసుకుని సమ్మక్క అని పేరు పెట్టారు. చిన్నతనం నుంచే సమ్మక్క ధైర్యసాహసాలతో పాటు అద్భుతమైన వైద్య శక్తులను కలిగి ఉండేది.

**వివాహం మరియు కుటుంబం:**

మేడ రాజు తన మేనల్లుడైన మేడారం పాలకుడు పగిడిద్ద రాజుతో సమ్మక్కకు వివాహం జరిపించారు. ఈ దంపతులకు ముగ్గురు సంతానం కుమార్తెలు సారలమ్మ (సారక్క), నాగులమ్మ,

**కుమారుడు జంపన్న.**

సమ్మక్క అల్లుడు గోవింద రాజు (సారలమ్మ భర్త) కూడా యుద్ధంలో కీలక పాత్ర పోషించారు.

కాకతీయులతో యుద్ధం 14వ శతాబ్దంలో కాకతీయ రాజు ప్రతాపరుద్రుడి పాలనలో తీవ్రమైన కరువు వచ్చింది. కరువు వల్ల గిరిజనులు పన్నులు చెల్లించలేకపోయారు. ఆగ్రహించిన ప్రతాపరుద్రుడు మేడారంపై సైన్యాన్ని పంపాడు. ఈ యుద్ధంలో పగిడిద్ద రాజు, సారలమ్మ, నాగులమ్మ, గోవింద రాజులు వీరోచితంగా పోరాడి మరణించారు. తన వారు చనిపోవడం చూసి అవమాన భారంతో జంపన్న సంపెంగ వాగులో దూకి ప్రాణ త్యాగం చేశాడు. అప్పటి నుండి అది జంపన్న వాగుగా ప్రసిద్ధి చెందింది.

**సమ్మక్క అదృశ్యం**

కుటుంబమంతా కోల్పోయిన సమ్మక్క స్వయంగా యుద్ధ రంగంలోకి దిగి కాకతీయ సైన్యాన్ని గడగడలాడించింది. శత్రువుల చేతిలో గాయపడిన ఆమె, రక్తపు ధారలతోనే చిలుకలగుట్ట వైపు వెళ్తూ అదృశ్యమైంది. ఆమె కోసం వెతికిన గిరిజనులకు అక్కడ ఒక పుట్ట దగ్గర పసుపు, కుంకుమ భరిణెలు మరియు పులి అడుగు జాడలు కనిపించాయి. అప్పటి నుండి గిరిజనులు సమ్మక్కను దైవంగా భావించి పూజించడం ప్రారంభించారు. ప్రతాపరుద్రుడు కూడా సమ్మక్క ధైర్యానికి మెచ్చి, ప్రతి రెండేళ్లకోసారి ఆమె గౌరవార్థం జాతర జరపాలని ఆదేశించాడని చరిత్ర చెబుతోంది.

**సారలమ్మ చరిత్ర**

సమ్మక్క మరియు పగిడిద్ద రాజుల ముద్దుల కుమార్తె. తల్లి అడుగుజాడల్లో నడుస్తూ అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడిన వీర వనిత. సమ్మక్క కుమార్తెగా మేడారంలో జన్మించిన సారక్క, చిన్నతనం నుండే గిరిజన ఆచారాలు మరియు యుద్ధ విద్యల్లో శిక్షణ పొందింది. ఈమె వివాహం గిరిజన నాయకుడైన గోవింద రాజుతో జరిగింది. కాకతీయ సేనలు మేడారంపై దాడి చేసినప్పుడు, తన తండ్రి పగిడిద్ద రాజుతో కలిసి సారక్క యుద్ధరంగంలోకి దూకింది. కన్నెపల్లి ప్రాంతం నుండి ఆమె శత్రువులను ఎదుర్కొంటూ వీరోచితంగా పోరాడింది. యుద్ధంలో శత్రువుల చేతిలో తీవ్రంగా గాయపడి సారక్క ప్రాణత్యాగం చేసింది. ఆమె పవిత్ర ఆత్మ కన్నెపల్లి గద్దపైనే లీనమైందని భక్తుల నమ్మకం.

**జాతర గా మార్పు**

సమ్మక్క సారక్కల పోరాటం ఒక చిన్న గిరిజన ఆచారంగా మొదలై, నేడు కోట్ల మంది తరలివచ్చే మహా జాతరగా మారడం వెనుక ఒక గొప్ప పరిణామ క్రమం ఉంది.

**గిరిజన కృతజ్ఞత**

సమ్మక్క అదృశ్యమైన తర్వాత, ఆమె చూపిన ధైర్యానికి గుర్తుగా కోయ గిరిజనులు ప్రతి రెండేళ్లకోసారి తాము సేకరించిన మొదటి పంటను (ముఖ్యంగా బెల్లాన్ని) ఆమెకు మొక్కుగా సమర్పించడం ప్రారంభించారు. ప్రతాపరుద్రుడి గుర్తింపు జానపద కథల ప్రకారం, సమ్మక్క శక్తిని చూసి ఆశ్చర్యపోయిన కాకతీయ రాజు ప్రతాపరుద్రుడు, గిరిజనులు ఏటా ఈ పండుగను జరుపుకోవడానికి అనుమతినిచ్చి, అధికారిక గుర్తింపు కల్పించారు. కోయల నుండి అందరికీ మొదట్లో కేవలం కోయ తెగ వారు మాత్రమే జరుపుకునే ఈ పండుగ, 1940-50ల కాలం నుండి చుట్టుపక్కల ఉన్న ఇతర గ్రామాలు మరియు మైదాన ప్రాంత ప్రజలకు వ్యాపించింది.

ప్రభుత్వ గుర్తింపు (1996): ఈ జాతర ప్రాముఖ్యతను గుర్తించిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1996లో దీనిని రాష్ట్ర పండుగగా ప్రకటించింది. అప్పటి నుండి ప్రభుత్వం నిధులు కేటాయించి సౌకర్యాలు కల్పించడంతో ఇది భారీ స్థాయికి చేరుకుంది. కోరిన కోర్కెలు తీరుస్తారని, ముఖ్యంగా సంతానం లేని వారికి సంతానాన్ని, రోగాల నుండి విముక్తిని ప్రసాదిస్తారని నమ్మకం, విశ్వాసం పెరగడంతో భక్తుల సంఖ్య రద్దీ నుండి కోట్లకు చేరింది. మేడారం జాతరలో భక్తులను ఆశ్చర్యపరిచే మరికొన్ని అత్యంత ప్రత్యేకమైన అంశాలు

జంపన్న వాగు మహిమ భక్తులు ఈ వాగులో స్నానం చేస్తే చర్మ వ్యాధులు నయమవుతాయని, అమ్మవార్ల కృప లభిస్తుందని నమ్ముతారు. జంపన్న వీరమరణం పొందిన ఈ వాగు నీరు ఎరుపు రంగులో ఉంటుందని గిరిజనుల విశ్వాసం.

ఎదురు కోలు: అమ్మవార్లను గద్దెలపైకి తీసుకువచ్చే సమయంలో భక్తులు చూపే పూనకాలు వర్ణనాతీతం. వేలమంది శివసత్తులు ఒకేసారి పూనకంతో ఊగిపోవడం ఈ జాతరలో మాత్రమే కనిపించే అద్భుతం.

**బెల్లం తులాభారం:**

భక్తులు తమ బరువుకు సమానమైన బెల్లాన్ని (బంగారం) అమ్మవార్లకు సమర్పిస్తారు. ఈ సమయంలో మేడారం గద్దెల వద్ద బెల్లం కొండలు పేరుకుపోవడం ఒక వింతగా కనిపిస్తుంది.

**వన ప్రవేశం:**

జాతర చివరి రోజున దేవతలు తిరిగి అడవిలోకి వెళ్లే ఘట్టం చాలా భావోద్వేగంగా ఉంటుంది. భక్తులు కన్నీటితో అమ్మవార్లకు వీడ్కోలు పలుకుతారు.

**జాతరలో గిరిజనుల పాత్ర:**

సమ్మక్క సారక్క జాతరలో గిరిజనుల పాత్ర అత్యంత కీలకమైనది. ఈ జాతర గిరిజన ఆత్మగౌరవానికి, వారి అస్తిత్వానికి ప్రతీక. గిరిజనుల భాగస్వామ్యం లేకుండా ఈ జాతర సంపూర్ణం కాదు. దీనిలో గిరిజనుల పాత్రను ఈ కింది విధంగా అర్థం చేసుకోవచ్చు.

**కోయ పూజారుల సంప్రదాయం:** జాతరలోని అన్ని ప్రధాన పూజా కార్యక్రమాలను కోయ తెగకు చెందిన పూజారులే నిర్వహిస్తారు. వేద మంత్రాలు, బ్రాహ్మణ పురోహితులు లేకుండా, వారి గిరిజన సంప్రదాయాలు, మౌఖిక మంత్రాలతోనే అమ్మవార్లను ఆహ్వానిస్తారు. దేవతల ఆగమనం సమ్మక్కను చిలుకలగుట్ట నుండి, సారక్కను కన్నెపల్లి నుండి గిరిజన పూజారులు తమ భుజాలపై మోస్తూ గద్దెల వద్దకు తీసుకువస్తారు. ఈ సమయంలో వారు పాటించే కఠినమైన నియమాలు మరియు ఆచారాలు గిరిజన సంస్కృతికి అద్దం పడతాయి. వన సంస్కృతి రక్షణ గిరిజనులు ప్రకృతిని దైవంగా భావిస్తారు. జాతరలో విగ్రహాలకు బదులుగా వెదురు కర్రలు, కుంకుమ భరిణెలను వన దేవతలుగా ఆరాధించడం వారి విశిష్టమైన విశ్వాసానికి నిదర్శనం. సాంప్రదాయ నృత్యాలు మరియు వాయిద్యాలు జాతరలో గిరిజనులు తమ సంప్రదాయ డప్పు వాయిద్యాలు, కొమ్ము బూరలు ఊదుతూ చేసే నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. గిరిజన శివసత్తుల పూనకాలు జాతరలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపుతాయి. సామాజిక ఐక్యత తెలంగాణతో పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా వంటి రాష్ట్రాల నుండి వివిధ గిరిజన తెగలు (కోయ, గోండ్, నాయకపోడు వంటివి) ఇక్కడకు చేరుకుని తమ సాంస్కృతిక వారసత్వాన్ని చాటుకుంటారు. ప్రకృతి వైద్యం. జాతర సమయంలో కోయ గిరిజనులు అడవిలో లభించే మూలికలు, వేర్లతో చేసే వైద్యంపై కూడా భక్తులకు అమితమైన నమ్మకం ఉంటుంది.

**ప్రభుత్వాల పాత్ర**

సమ్మక్క సారక్క జాతర నిర్వహణలో అటు రాష్ట్ర ప్రభుత్వం, ఇటు కేంద్ర ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తున్నాయి. 2026 లో జాతర సందర్భంగా ఎన్నో రకాల చర్యలు చేపట్టారు.

**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పాత్ర**

ప్రభుత్వం ఈ జాతరను 1996లో రాష్ట్ర పండుగగా గుర్తించింది. 2026 జాతర కోసం సుమారు ₹251 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. మౌలిక సదుపాయాలు మేడారం పరిసరాల్లో శాశ్వత గెస్ట్ హౌస్‌లు, రోడ్లు, తాగునీరు మరియు విద్యుత్ సౌకర్యాల కోసం ₹150 కోట్లు, దేవతల గద్దెల పునర్నిర్మాణం కోసం ₹101 కోట్లు వెచ్చించారు. రవాణా భద్రత భక్తుల సౌకర్యార్థం 4,000 ప్రత్యేక ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసి, సుమారు 50 వేల పైగా ట్రిప్పులను నడుపుతున్నారు. హన్మకొండ నుండి మేడారానికి హెలికాప్టర్ సర్వీసులను కూడా అందుబాటులోకి తెచ్చారు. భక్తుల ఆరోగ్యం & భద్రత కోసం 30 వైద్య శిబిరాలు, 40 బైక్ అంబులెన్సులు, మరియు 5,000 మందికి పైగా వైద్య సిబ్బందిని నియమించారు. జంపన్న వాగు వద్ద భక్తుల రక్షణ కోసం 210 మంది గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. జాతరను 8 జోన్లు, 42 సెక్టార్లుగా విభజించి, 21 విభాగాలకు చెందిన సుమారు వేల మంది మంది సిబ్బందిని విధుల్లో ఉంచారు.

**కేంద్ర ప్రభుత్వ పాత్ర**

జాతీయ గుర్తింపు కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ జాతరను ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన పండుగగా గుర్తించి, దీనికి అంతర్జాతీయ ప్రచారం కల్పిస్తోంది. సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ని ములుగులో సమ్మక్క సారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వం గిరిజన సంస్కృతికి మరియు విద్యకు పెద్దపీట వేసింది. ఇది ఇప్పటికే తన విద్యా కార్యక్రమాలను ప్రారంభించింది.ఈ విధంగా ఉభయ ప్రభుత్వాలు సమన్వయంతో మేడారం జాతరను తెలంగాణ కుంభమేళా' గా ఘనంగా పేరుగాంచింది. తెలంగాణ రాష్ట్రంలో ఇంతటి పేరు గాంచి, ధైర్యసాహసాల మారుపేరుగా చెప్పుకునే సమ్మక్క సారలమ్మ జాతర శుభాకాంక్షలతో.....

**బత్తుల గణేష్**
**జర్నలిస్టు (9177108128)**

## నాగార్జునసాగర్ నియోజకవర్గంలో మున్సిపోల్ వేడి

నల్గొండ జిల్లాలోని నాగార్జునసాగర్ నియోజకవర్గం మున్సిపల్ ఎన్నికలు రాజకీయ రంగస్థలంగా మారుతున్నాయి.2026లో తెలంగాణలో జరుగుతున్న రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా,నల్గొండ జిల్లాలో 8 మున్సిపాలిటీలు మరియు నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు సిద్ధమవుతున్నాయి. నామినేషన్ల గడువు జనవరి 30తో ముగియనున్న నేపథ్యంలో,రాజకీయ ఉత్కంఠ తారాస్థాయికి చేరుకుంది.ప్రధాన పార్టీలు ఇంకా అభ్యర్థులను ఖరారు చేయకపోవడం వల్ల పార్టీ శ్రేణుల్లో ఆందోళన మొదలైంది మరియు ఆశావహులు అధిష్టానాల చుట్టూ తిరుగుతూ టికెట్ల కోసం బొజ్జగింపులు కొనసాగిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) 2025 డిసెంబర్ 29న ఎలక్టోరల్ రోల్స్ ప్రిపరేషన్ నోటిఫికేషన్ జారీ చేసింది,ఇందులో మున్సిపాలిటీలు మరియు మున్సిపల్ కార్పొరేషన్లకు సంబంధించిన రీఅరేంజ్‌మెంట్ షెడ్యూల్ ఉంది.2026 జనవరి 15న ప్రభుత్వం వార్డులు మరియు చైర్‌పర్సన్/మేయర్ పదవులకు రిజర్వేషన్లను ఫైనలైజ్ చేసింది.ఇది ఎన్నికలకు మార్గం సుగమం చేసింది.నాగార్జునసాగర్ నియోజకవర్గం,నల్గొండ జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో ఒకటి, ఇక్కడ మున్సిపాలిటీలలో మొత్తం వార్డుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో పోటీ తీవ్రంగా మారింది. ఫిబ్రవరి 11న పోలింగ్, ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు జరగనున్నాయి.జిల్లాలోని మున్సిపాలిటీలు మరియు కార్పొరేషన్లలో రాజకీయ పార్టీలు గెలుపు గుర్రాలకే టికెట్లు ఇవ్వాలనే వ్యూహాలతో కసరత్తు చేస్తున్నాయి.బీఆర్ఎస్, కాంగ్రెస్,బీజేపీ వంటి ప్రధాన పార్టీలు స్థానిక సమస్యలు (నీటి సమస్యలు,మౌలిక వసతులు,ఉపాధి)పై దృష్టి పెట్టి అభ్యర్థులను ఎంపిక చేస్తున్నాయి.

**నామినేషన్ల ఉత్కంఠ మరియు పార్టీల ఆందోళనలు**

నామినేషన్ల ప్రక్రియ జనవరి 28 నుంచి ప్రారంభమైంది, మరియు గడువు రేపటితో (జనవరి 30) ముగియనుండడంతో చివరి నిమిషం వరకు డ్రామా కొనసాగుతోంది.ఇప్పటివరకు ప్రధాన పార్టీలు అభ్యర్థుల జాబితాలను అధికారికంగా ప్రకటించకపోవడం వల్ల పార్టీ కార్యకర్తలు మరియు ఆశావహులలో ఆందోళన పెరిగింది.ప్రతి వార్డులో 5-10 మంది ఆశావహులు ఉండటంతో,టికెట్ దక్కడం కష్టమవుతోంది.ఆశావహులు హైదరాబాద్‌లోని పార్టీ అధిష్టానాల చుట్టూ తిరుగుతూ,లాబీయింగ్ చేస్తున్నారు.కొందరు స్థానిక నాయకులు,మరికొందరు సామాజిక వర్గాల ప్రాతినిధ్యం ఆధారంగా టికెట్ కోరుతున్నారు. రిజర్వేషన్లు(ఎస్సీ,ఎస్టీ,బీసీ,మహిళలు) ఫైనలైజ్ అయిన తర్వాత కూడా ఆలస్యం జరగడం వల్ల పోటీ మరింత తీవ్రమైంది.నాగార్జునసాగర్ మున్సిపాలిటీలోని కొన్ని వార్డుల్లో బీసీ రిజర్వేషన్ వల్ల ఆశావహుల సంఖ్య పెరిగింది.పార్టీలు సర్వేలు, గత ఎన్నికల డేటా ఆధారంగా గెలుపు అవకాశాలున్న అభ్యర్థులను మాత్రమే ఎంపిక చేస్తున్నాయి,ఇది అసంతృప్తిని పెంచుతోంది.

**రెబల్స్ భయం మరియు రాజకీయ వ్యూహాలు**

టికెట్ దక్కని ఆశావహులు రెబల్ అభ్యర్థులుగా మారి, స్వతంత్రంగా పోటీ చేసే అవకాశం ఉందన్న భయం పార్టీ నేతలను వెంటాడుతోంది.గత ఎన్నికల్లో (2023 అసెంబ్లీ ఎన్నికలు)నాగార్జునసాగర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి భగత్ ఓటమికి రెబల్స్ ప్రభావం చూపించారు.ఇప్పుడు మున్సిపల్ స్థాయిలో ఇలాంటి సమస్యలు పెరిగితే పార్టీలకు నష్టం జరగవచ్చు. దీన్ని నివారించడానికి అన్ని పార్టీలు అసంతృప్తులను బుజ్జగించడానికి ప్రయత్నిస్తున్నాయి.కొందరికి ఇతర పదవులు ఆఫర్ చేస్తూ,మరికొందరిని పొత్తుల్లో అడ్జస్ట్ చేస్తున్నాయి.కాంగ్రెస్ పార్టీ స్థానిక సమస్యలపై ఫోకస్ చేసి,బీఆర్ఎస్ ను లేకుండా చేయాలని చూస్తోంది.బీజేపీ స్థానిక సమస్యలతో పాటు జాతీయ అంశాలను, హిందుత్వను మిక్స్ చేసి ప్రచారం చేయాలని ప్లాన్ చేస్తోంది.ఇండిపెండెంట్ అభ్యర్థులు కూడా పెరుగుతున్నారు.ఇది పోటీని మరింత రసవత్తరంగా చేస్తోంది.

**చివరి నిమిషం డ్రామా తప్పదు**

మొత్తానికి నాగార్జునసాగర్ మున్సిపాలిటీల్లో చివరి నిమిషం వరకు రాజకీయ ఉత్కంఠ తప్పదు. నామినేషన్ల స్క్రూటినీ జనవరి 31న,ఉపసంహరణ ఫిబ్రవరి 3 వరకు ఉండటంతో మరిన్ని మలుపులు తిరిగే అవకాశం ఉంది.ఓటర్లు స్థానిక అభివృద్ధి,సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టి ఓటు వేయాలని రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు. ఈ ఎన్నికలు నియోజకవర్గంలో రాజకీయ బలాబలాలను మార్చే అవకాశం ఉంది.

## ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం ఉన్న పార్టీ బిజెపి



**రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో మన ఇందూరు మన మేయర్ నినాదంతో ముందుకెళ్దాం**

**నిజామాబాద్ జనవరి 29 ధర్మ ఘంట:**

నరేంద్ర మోడీ వరుసగా గత మూడు ధపాలుగా ప్రధానిగా దేశాన్ని పరిపాలిస్తూ ఏమాత్రం అవినీతి లేని దేశంగా భారతదేశాన్ని ప్రపంచంలోనే నెంబర్ వన్ గా తీర్చిదిద్దుతున్నారని ఇందూరు ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. గురువారం బిజెపి జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులచారి అధ్యక్షతన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ సమక్షంలో నగరంలోని 22వ డివిజన్ నుండి మాజీ కార్పొరేటర్ పోతుల పురుషోత్తం మరియు అదే డివిజన్ నుండి తాటికొండ రాము, ఆకుల శ్రీనివాస్, రాజ్ కుమార్, గౌత ఆనంద్, కుందన్ శ్రీనివాస్ లతో పాటు సుమారు 200 మంది డివిజన్ వాసులు బిజెపి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మన ఇందూర్ మన మేయర్ అనే నినాదంతో బిజెపి శ్రేణులు ప్రతి డివిజన్ లో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. బిజెపి పార్టీ అంటేనే అభివృద్ధి అని అభివృద్ధి అంటేనే బిజెపి పార్టీ అని ఆయన కొనియాడారు. ముఖ్యంగా ఎంపీ అరవింద్ జిల్లాలో చేస్తున్న విస్తృత అభివృద్ధి పనులకు ఆకర్షితులై, మున్సిపల్ ఎన్నికలకు ముందు బిజెపి పార్టీలో చేరడం శుభపరిణామం అని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఉజ్వల్ యోజన కింద గ్యాస్ సిలిండర్లు తక్కువ ధరకే అందివ్వడం, అలాగే చిరు వ్యాపారులకు ముద్ర లోన్ పథకం కింద లక్ష రూపాయల వరకు రుణ సదుపాయాలు అందివ్వడం, వాటి ద్వారా చిన్న, మధ్య తరగతి ప్రజలు స్వతహాగా వ్యాపారాలు నిర్వహించుకునేందుకు ఈ రుణాలు ఎంతగానో దోహదపడుతున్నాయని ఆయన అన్నారు. అదేవిధంగా కేవలం 14 రూపాయలతో దేశ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోడీ రెండు లక్షల జీవిత బీమా కల్పించడం ప్రపంచంలో ఎక్కడా లేదని ఎమ్మెల్యే గారు స్పష్టం చేశారు. ఇక రాబోయే రోజుల్లో కచ్చితంగా మున్సిపల్ కార్పొరేషన్ పై బిజెపి జెండా ఎగరవేయడం ఖాయమని ఈ చేరికల ద్వారా తనకు పూర్తి నమ్మకం కలుగుతుందని ఆయన దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 22వ డివిజన్ నుండి సుమారు 200 మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బిజెపి పార్టీలో చేరారు. ఇదిలా ఉండగా 22వ డివిజన్ మహిళా మణులు రాబోయే రోజుల్లో బిజెపి వైపే



# భద్రతా నిబంధనల ఉల్లంఘనలపై హైడ్రా ఉక్కుపాదం

**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో అగ్నిమాపక భద్రతా నిబంధనల ఉల్లంఘనలపై హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ఉక్కుపాదం మోపింది. ఇటీవల నాంపల్లిలో జరిగిన ఘోర అగ్నిప్రమాదం నేపథ్యంలో తనిఖీలు ముమ్మరం చేసిన అధికారులు.. గురువారం జూబ్లీహిల్స్లోని ప్రముఖ వస్త్ర దుకాణం 'నీరూస్' తో పాటు నాంపల్లిలోని మరో ఫర్నిచర్ షోరూంను సీజ్ చేశారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నేతృత్వంలో హైడ్రా, జీహెచ్ఎంసీ, ఫైర్, విద్యుత్ శాఖల అధికారులు సంయుక్తంగా ఈ తనిఖీలు చేపట్టారు. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 36లోని నీరూస్ షోరూంలో తనిఖీ చేయగా తీవ్రమైన ఉల్లంఘనలు బయటపడ్డాయి. మూడు సెల్లార్లు, నాలుగు అంతస్తులతో పాటు, అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన రూఫ్ షెడ్లో కూడా భారీగా వస్త్రాలను నిల్వ ఉంచడాన్ని అధికారులు గుర్తించారు. ఫైర్ సేఫ్టీ ఎన్వోసీ లేకపోవడం, మంటలను ఆర్పే పరికరాలు సరిగా లేకపోవడంతో కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భవనం పై అంతస్తులను గోదాముగా, వస్త్రాల తయారీ కేంద్రంగా మార్చడంపై తీవ్ర అభ్యంతరం తెలిపారు. వెంటనే షోరూంను సీజ్ చేయాలని ఆదేశించారు. తరువాత అధికారులు నాంపల్లి స్టేషన్ రోడ్డులోని రహీమ్, మన్నన్ ఎస్టేట్స్ స్టాండర్డ్ ఫర్నిచర్ దుకాణాన్ని తనిఖీ చేశారు. ఇటీవల ఐదుగురి మృతికి కారణమైన ప్రమాదం జరిగిన రోడ్డులోనే ఉన్నప్పటికీ ఈ షోరూంలో ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోకపోవడాన్ని కమిషనర్ తీవ్రంగా పరిగణించారు. ఆరు అంతస్తుల భవనంలో మెట్ల మార్గాన్ని కూడా మూసివేసి ఫర్నిచర్ నిల్వ ఉంచడం, కనీసం ఫైర్ ఎక్స్టింగ్విషర్లు కూడా లేకపోవడంతో ఈ షోరూంను కూడా సీజ్ చేయాలని ఆదేశించారు. ఈ రెండు షోరూంల వద్ద 'ఫైర్ అన్ సేఫ్' బోర్డులను ఏర్పాటు చేసి, హైడ్రా ఫెన్సింగ్ వేశారు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. నగరంలో ఎక్కడైనా ఫైర్ సేఫ్టీ నిబంధనలను ఉల్లంఘిస్తే, తమ దృష్టికి తీసుకురావాలని కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రజలను కోరారు. హైడ్రా కంట్రోల్ రూమ్ నంబర్ 9000113667 లేదా తన వాట్సాప్ నంబర్ 7207923085కు ఫొటోలు, వీడియోలతో సహా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.



# నిబంధనల ప్రకారం నామినేషన్ ప్రక్రియ

## జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్ :** ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు తూచా తప్పకుండా పాటిస్తూ నామినేషన్ ప్రక్రియ పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఎన్నికల అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయితో కలిసి పరిశీలించారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలలో సదుపాయాలు పరిశీలించారు. నామినేషన్ పత్రాల స్వీకరణకు సంబంధించి పలు సూచనలు చేశారు. హెల్ప్ డెస్క్, పోలీస్ బందోబస్తు తదితర అంశాలను పరిశీలిస్తూ, సపోర్టింగ్ స్టాఫ్ వివరాలు ఆరా తీశారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని, నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను రిజిస్టర్ లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. ఆయా డివిజన్ స్థానాలకు దాఖలైన నామినేషన్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి టీ పోల్ యాప్ లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేం దుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఎన్నికల సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు.కమాండ్ కంట్రోల్ సెంటర్ పరిశీలన: కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. నామినేషన్ కేంద్రాలు, హెల్ప్ డెస్క్, మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ద్వారా ఎన్నికల సిబ్బంది విధులను పర్యవేక్షించారు. కమాండ్ కంట్రోల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, షిఫ్టుల వారీగా 24 గంటలు విధులు నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేయాలని అన్నారు.చొప్పదండి నామినేషన్ కేంద్రాల పరిశీలన:చొప్పదండి మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా చొప్పదండి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. హెల్ప్ డెస్క్ సిబ్బంది అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేయాలని, ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు స్పష్టంగా వివరించాలని తెలిపారు. చొప్పదండి వార్డు స్థానాలకు అప్పటివరకు దాఖలైన నామినేషన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలు నామినేషన్ పత్రాలను పరిశీలించారు. దాఖలైన నామినేషన్లకు సంబంధించి జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టులు పంపించాలని అన్నారు. నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, విధుల్లో ఉన్న ప్రభుత్వ సిబ్బంది నామపత్రాలు దాఖలు చేసే విషయంలో అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా, ఉన్నతాధికారులను సంప్రదించాలని సూచించారు. కలెక్టర్ వెంట చొప్పదండి మున్సిపల్ కమిషనర్ మనోహర్ ఉన్నారు.

# ఎన్నికల నియమవళి పక్కాగా అమలు చేయాలి

## కోరుట్ల,మెట్ పెల్లి నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్

**కోరుట్ల :** ఎన్నికల నియమవళి పక్కాగా అమలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్ అన్నారు.కోరుట్ల,మెట్పల్లి మున్సిపాలిటీల్లో జరుగుతున్న నామినేషన్ల ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా జరుగుతున్న నామినేషన్ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చిన అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. నామినేషన్ కేంద్రాల వద్ద అన్నిరకాల ఫామ్స్ అందుబాటులో ఉండేల చూసుకోవాలని ప్రతి నామినేషన్ కేంద్రం వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని, శాంతియుత వాతావరణంలో నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల మున్సిపల్ కమిషనర్ రవీందర్, మెట్పల్లి మున్సిపల్ కమిషనర్ మోహన్,కోరుట్ల ఎమ్మార్వో కృష్ణ చైతన్య , రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




# నామినేషన్ ప్రక్రియ పగడ్బంధీగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్**

**నామినేషన్ల కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్**

**జగిత్యాల :** నామినేషన్ ప్రక్రియ పగడ్బంధీ గా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆన్నారు.మున్సిపల్ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో గురువారం జగిత్యాల మున్సిపల్ పరిధిలో ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు.ఈ సందర్భనీగా నామినేషన్ స్వీకరణకు చేసిన ఏర్పాట్లు గమనించి పలు సూచనలు చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నామినేషన్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నోటిఫికేషన్ ప్రక్రియలో భాగంగా నోటీస్ బోర్డుపై ప్రదర్శించిన విధానాన్ని పరిశీలించారు. నామినేషన్ స్వీకరణ సమయంలో ఆర్వో, ఏఆర్వో ల విధులను క్షుణ్ణంగా వివరించారు. అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు.ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా పై అధికారులను సంప్రదించాలని సూచించారు. అధికారులు అందరిని సమన్వయం చేసుకుంటూ తమ విధులు జాగ్రత్తగా నిర్వహించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, డిపివో మదన్ మోహన్, మున్సిపల్ కమిషనర్ స్పందన, తహసీల్దార్ రాం మోహన్ రావు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్

**– మహబూబ్ నగర్ టూ టౌన్ పోలీస్**

**మహబూబ్నగర్ :** మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతలకు ఎలాంటి భంగం కలగకుండా ముందస్తు చర్యలలో భాగంగా మహబూబ్నగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించినట్లు టూ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ యజాజుద్దీన్ తెలిపారు. టూ టౌన్ పోలీస్ స్టేషన్కు రౌడీషీటర్లను పిలిపించి, ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా స్పష్టమైన సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ యజాజుద్దీన్ మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో రౌడీషీటర్లు గానీ, ఇతర వ్యక్తులు గానీ శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడితే వారి మీద కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. అలాగే ప్రజల ప్రశాంతతకు విఘాతం కలిగించే ఎవరికైనా ఇదే విధమైన చట్టపరమైన చర్యలు అమలు చేయబడతాయని తెలిపారు. ముందస్తు భద్రతా చర్యలలో భాగంగా సంబంధిత రౌడీషీటర్ల నుంచి ప్రతి ఒక్కరి వద్ద నుంచి రూ. 1,00,000 (లక్ష రూపాయలు) విలువైన బాండ్ను సంబంధిత అధికారుల ఎదుట బంధపత్రంగా తీసుకోవడం జరిగిందని ఇన్స్పెక్టర్ యజాజుద్దీన్ వెల్లడించారు. మహబూబ్నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు శాంతియుతంగా, సజావుగా నిర్వహించడమే పోలీసు శాఖ లక్ష్యమని, అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని టూ టౌన్ ఇన్స్పెక్టర్ యజాజుద్దీన్ ప్రజలను కోరారు..

## కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం అంటే..

**తెలంగాణ ప్రజలకు ఇవ్వటమే..!**

**ఖబర్దార్ కాంగ్రెస్.. రేవంత్ రెడ్డి.**

**ఓయూ సీఎం రేవంత్ దిష్టి బొమ్మను దహనం చేసిన బీఆర్ఎస్వీ**

**హైదరాబాద్ :** బీఆర్ఎస్వీ కార్యకర్తలు గురువారం నాడు ఓయూ లో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు సిట్ నోటీసులు ఇవ్వడంపై మండిపడ్డారు. తెలంగాణ కోసం తన ప్రాణాలను సైతం లెక్క చేయని వ్యక్తి కేసీఆర్. అలాంటి వ్యక్తిని మీ రాజకీయ లబ్ధి కోసం, చిల్లర ప్రయోజనాల కోసం ఆయన వ్యక్తిత్వాన్ని ఆయన స్థాయిని పలుచన చేస్తాం అంటే మీ తరం కాదు.. ఆయన పేరు, ఆయన కీర్తి, ఆయన చేసిన అభివృద్ధి తెలంగాణ ప్రజల గుండెల్లో చెరగని ముద్రలా ఉంటదని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కడారి స్వామి యాదవ్, పడాల సతీష్, చటారి దశరత్, జంగయ్య, నాగారం ప్రశాంత్, మిథున్ ప్రసాద్, శ్రీకాంత్ ముదిరాజ్, నాగేందర్, అవినాష్,సాయి గౌడ్,బోయపల్లి నాగరాజు, మేడి పవన్, రాకేష్, తదితర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

## వర్ధన్నపేటలో బీఆర్ఎస్ నిరసన

**వరంగల్ :** కేసీఆర్ కి సిట్ నోటీసులు ఇవ్వటం పట్ల ఆగ్రహించిన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు వర్ధన్నపేట మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించి రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ దహనం చేసారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ పరిపాలన విధివిధానాలు తెలియని వాళ్ళు పాలకులుగా ఉండటం దురదృష్టకరం. పాలన చేతకాక, కేవలం రాజకీయ కక్షతోనే సిట్ పేరిట బీఆర్ఎస్ నాయకులను వేధిస్తున్నది కాంగ్రెస్ సర్కార్. రేవంత్ దుర్మార్గపు పాలనకు ప్రజలే అడ్డుకట్ట వేస్తారు. కేసీఆర్ అమలు చేసిన పథకాలు అమలు చేయలేకనే ఈ దద్దమ్మ ప్రభుత్వం ఇలా డ్రామాలకి తెరలేపారని విమర్శించారు.

## మాజీ ఎంపిటిసి పాడెను మోసినమాజీ ఎమ్మెల్యే జరదొడ్డి

**కోడుమూరు :** కోడుమూరు పట్టణంలో మాజీ ఎంపిటీసీ డ్రైవర్ మునిస్వామి మరణించాడనే విషయాన్ని కార్యకర్తల ద్వారా సమాచారం తెలుసుకొన్న కోడుమూరు మాజీ ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్ కోడుమూరు పట్టణాన్ని చేరుకుని కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని నింపి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం డ్రైవర్ మునిస్వామి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతిమయాత్రలో పాల్గొని మునిస్వామి పాడె ను కూడా మోశారు. మట్టిని పూడ్చే కార్యక్రమం చివరి వరకు వారి కుటుంబ సభ్యులతోనే ఉంటూ కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్‌పై కేసులు నమోదు

**కోదాడ :** కోదాడ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ పై పోలీసులు పలు సెక్షన్ లలో కేసు నమోదు చేసారు. సూర్యాపేట జిల్లా కోదాడలో దళిత యువకుడు కర్ల రాజేష్ లాకప్ డెత్ ఘటనపై ఈనెల 24న నిరసనకు మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. దాంతో, పోలీస్ యాక్ట్ అమలులో ఉందని బొల్లం మల్లయ్య యాదవ్ పై కోదాడ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసారు. ఈ నేపథ్యంలో బొల్లం బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి ర్యాలీగా పోలీస్ స్టేషన్కు చేరుకున్నారు. అక్రమంగా నాయకులపై, కార్యకర్తలపై కేసులు నమోదు చేస్తున్నారంటూ బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనకు దిగారు.

## బైక్‌పై ప్రయాణించి ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు

**ధర్మపురి :** వనదేవతలు కొలువైన మేడారంలో సమ్మక్క–సారలమ్మ జాతర ఏర్పాట్లను పరిశీలించేందుకు మంత్రులు సరికొత్త పంథాను ఎంచుకున్నారు. కారు దిగి బైక్ ఎక్కారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్,మంత్రి పొంగులేటి శ్రీనివాస్ జిల్లా కలెక్టర్ లతో కలిసి స్వయంగా బైక్ నడుపుతూ గల్లీ గల్లీని చుట్టేశారు. ప్రోటోకాల్ గోడలు బద్దలు కొట్టి, సామాన్యుడిలా భక్తుల చెంతకు చేరారు.జంపన్న వాగు వద్ద భక్తులకు అందుతున్న సౌకర్యాలను క్షేత్రస్థాయిలో అడిగి తెలుసుకున్నారు.టీ ముచ్చటప్రజా గొంతుక కోసం.. టీ కొట్టు వద్ద ఆగారు.హడావిడి పర్యటన కాదిది.. ఒక టీ కొట్టు వద్ద ఆగి, చాయ్ తాగుతూ అక్కడున్న భక్తులతో ముచ్చటించారు. ఛాయ్ వాలాతో చమత్కరించారు. "ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? సౌకర్యాలు ఎలా ఉన్నాయి ?" అంటూ ఆరా తీశారు.అంతేగాకఏ ఒక్క భక్తుడికి అసౌకర్యం కలగకూడదనే ఉద్దేశంతో అధికారులకు అక్కడికక్కడే దిశానిర్దేశం చేశారు.కేంద్ర మంత్రులు ఘన స్వాగతం వనదేవతలు కొలువైన మేడారం సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా అమ్మవార్లను దర్శించుకోవడానికి మేడారం విచ్చేసిన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి ,జువల్ ఓరం లకు రాష్ట్ర మంత్రిలు అడ్లూరి లక్ష్మణ్ కుమార్,పొంగులేటి శ్రీనివాస్ ,మంత్రి సీతక్క ఘన స్వాగతం పలికారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విచారణ పేరిట అధికార దుర్వినియోగం

**జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత–**

**జగిత్యాల :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విచారణ పేరిట అధికార దుర్వినియోగం చేస్తున్నారని దుర్వినియోగం పైన ఉన్న శ్రద్ధ ఆరు గ్యారెంటీ ల అమలులో లేదని జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత విమర్శించారు.....తెలంగాణ రాష్ట్ర సాధకుడు తెలంగాణ జాతి పిత కేసీఆర్ కి సీట్ నోటీసులు ఇవ్వాడని జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత –సురేష్ తీవ్రంగా ఖండించారు.స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసి, దశాబ్దకాలం పాటు తెలంగాణ ను దేశంలోనే అగ్రగామిగా నిలిపిన నాయకుడు కేసీఆర్ ఆనిఅలాంటి చరిత్రాత్మక నాయకుడి పై బురద చల్లాలనే ప్రయత్నంలోనే కెసిఆర్ కి సిట్ నోటీసులు ఇచ్చారని అన్నారు. డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ మున్సిపల్ ఎలక్షన్లో లబ్ధి చేకూరాలని రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని అన్నారు. కెసిఆర్ ప్రతిష్ట దిగజార్చాలని చూస్తే ఆయన ప్రతిష్ట అంతకంతకు పెరుగుతుందని అన్నారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని యావత్ తెలంగాణ రాష్ట్రమంతా కేసీఆర్ వైపు ఉందని రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు త్వరలోనే తగిన బుద్ధి చెబుతారని వసంత అన్నారు.

బిజినెస్

## మరోసారి రిలయన్స్ గ్రూప్ ఆస్తులను జప్తు చేసిన ఈడీ

ప్రముఖ వ్యాపారవేత్త అనిల్ అంబానికి చెందిన రిలయన్స్ గ్రూప్, దాని కంపెనీలపై జరుగుతున్న మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా తాజాగా ఈడీ 1,885 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసినట్లు బుధవారం ప్రకటాలో వెల్లడించింది. తాజా చర్యలతో, ఈ కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ జప్తు చేసిన మొత్తం ఆస్తుల విలువ ఇప్పుడు సుమారు రూ. 12,000 కోట్లకు చేరింది. ఈ వ్యవహారంలో మనీలాండరింగ్ నివారణ చట్టం (పీఎంఎల్ఏ) కింద నాలుగు వేర్వేరు తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసినట్లు ఈడీ ఓ ప్రకటనలో తెలిపింది. జప్తు చేసిన ఆస్తులలో బ్యాంక్ బ్యాలెన్స్, రిసీవబుల్స్, అన్‌క్యూటెడ్ ఇన్వెస్ట్‌మెంట్స్ వాటా, ఇతర స్థిరాస్తులు ఉన్నాయి. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్,




రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్, యెస్ బ్యాంక్ మోసంతో పాటు రిలయన్స్ కమ్యూనికేషన్ లిమిటెడ్‌కు సంబంధించిన ఆరోపణల కేసులలో ఈ జప్తులు జరిగాయి. తాజా జప్తులో బీఎస్ఈఎస్ యమునా పవర్, బీఎస్ఈఎస్ రాజధాని పవర్, ముంబై మెట్రో వన్ ప్రైవేట్‌లో రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు ఉన్న వాటాలు కూడా ఉన్నాయని ఈడీ తెలిపింది. అలాగే, వాల్యూ కార్ప్ ఫైనాన్స్ అండ్ సెక్యూరిటీస్ లిమిటెడ్ వద్ద ఉన్న రూ. 148 కోట్ల బ్యాంకు డిపాజిట్లు, రూ. 143 కోట్ల వసూలు చేయాల్సిన మొత్తం, కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అంగరై సేతురామన్ పేరు మీద ఉన్న ఒక నివాస గృహం, మరో సీనియర్ ఉద్యోగి పునీత్ గార్గ్ భార్యకు చెందిన షేర్లు, మ్యూచువల్ ఫండ్‌లను కూడా జప్తు చేసినట్లు ఈడీ పేర్కొంది.

### ఆల్‌టైమ్ కనిష్ఠానికి రూపాయి విలువ




అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితి, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ ప్రభావంతో భారత కరెన్సీ రూపాయి విలువ ఆల్‌టైమ్ కనిష్ట స్థాయికి పడిపోయింది. ఇవాళ ఇంట్రాడే ట్రేడింగ్‌లో అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 92 స్థాయిని తాకి చరిత్రలోనే సరికొత్త రికార్డు పతనాన్ని నమోదు చేసింది. భారత స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తమ నిధులను భారీగా వెనక్కి తీసుకుంటున్నారు. కేవలం ఈ నెలలోనే రూ.వేల కోట్ల విలువైన షేర్లను విక్రయించడంతో రూపాయిపై ఒత్తిడి పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడాయిల్ ధరలు బ్యారెల్‌కు 65-67 డాలర్ల వద్ద కొనసాగుతున్నాయి. చమురు దిగుమతుల కోసం భారత్ ఎక్కువ డాలర్లను ఖర్చు చేయాల్సి రావడంతో రూపాయి విలువ పడిపోతోంది. దిగుమతిదారులు, బ్యాంకుల నుంచి డాలర్లకు డిమాండ్ పెరగడం, అంతర్జాతీయంగా డాలర్ ఇండెక్స్ బలోపేతం కావడం రూపాయి పతనానికి కారణం అయ్యాయి. రూపాయి పతనం కేవలం సామాన్యులపై కూడా ప్రభావం చూపనుంది. మొబైల్ ఫోన్లు, లాప్‌టాప్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, విదేశీ యంత్రాల ధరలు పెరిగే అవకాశం ఉంది. ఇంధన ధరలపై ప్రభావంతో రవాణా ఖర్చులు పెరిగి ద్రవ్యోల్బణానికి దారితీసే అవకాశం ఉంది. అదేవిధంగా విదేశాల్లో చదువుకునే విద్యార్థులు చెల్లించే ఫీజులు భారం కానున్నాయి. అలాగే విదేశీ పర్యటనలు ప్లాన్ చేసే వారికి ఖర్చులు పెరగనున్నాయి.

### యూఎస్ ఫెడ్ కీలక నిర్ణయం





ప్రపంచవ్యాప్తంగా ఇన్వెస్టర్లు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్న అమెరికా ఫెడరల్ రిజర్వ్ పాలసీ సమావేశం ముగిసింది. 2026 సంవత్సరానికి సంబంధించి కీలక వడ్డీ రేట్లను మార్చకుండా యథాతథంగా కొనసాగించాలని ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ నిర్ణయించింది. గతేడాది చివరలో వరుసగా మూడు సార్లు రేట్లను తగ్గించిన ఫెడ్, ప్రస్తుతం బెంచ్‌మార్క్ వడ్డీ రేటును 3.50 శాతం నుంచి నుండి 3.75 శాతంతో స్థిరంగా కొనసాగించింది. మెజారిటీ సభ్యులు ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా వడ్డీ రేట్లలో మార్పులు చేయకూడదని ఓటు వేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్ మాట్లాడుతూ.. ఫెడ్ నిర్దేశించుకున్న 2 శాతం ద్రవ్యోల్బణ లక్ష్యం కంటే ప్రస్తుత గణాంకాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. ఇది పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు వేచి చూడాలని ఫెడ్ నిర్ణయించిందని అన్నారు. అమెరికా ఫెడ్ నిర్ణయం భారత ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపనుంది. రేట్ల తగ్గింపు లేకపోవడంతో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లులు భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల నుంచి నిధులను విత్‌డ్రా చేసుకునే అవకాశం ఉంటుంది. దీంతో సెన్సెక్స్, నిఫ్టీలపై ఒత్తిడి పడనుంది. ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గించకపోవడంతో అమెరికా కంపెనీలు తమ టెక్నాలజీ ఖర్చులను నియంత్రిండంతో మన ఐటీ కంపెనీల ఆదాయంపై ప్రభావం చూపనుంది. ఇక బంగారం ధరలు స్థిరంగా కొనసాగే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు.

### భారతీయ వాహనాలపై 50 శాతం సుంకం విధించే యోచనలో దక్షిణాఫ్రికా




భారత్, చైనా నుంచి దిగుమతి చేసుకునే వాహనాలపై 50 శాతం వరకు సుంకాలను విధించే అంశాన్ని దక్షిణాఫ్రికా పరిశీలిస్తున్నట్లు సమాచారం. పెరుగుతున్న వాహనాల దిగుమతుల వల్ల స్థానిక ఆటో తయారీ పరిశ్రమపై పడుతున్న ప్రభావాన్ని నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ నిర్ణయం ఆ దేశ ట్రేడ్, ఇండస్ట్రీ, కాంపిటీషన్ డిపార్ట్‌మెంట్ సమీక్ష పరిధిలో ఉంది. బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం, కీలక ఎగుమతి మార్కెట్లుగా ఉన్న భారత్, చైనా నుంచి వాహనాలను నిలువరించేలా మార్గాలను గుర్తించేందుకు ఒక అంతర్గత సమీక్ష జరిగింది. ఈ రెండు దేశాల నుంచి జరిగే దిగుమతులు దక్షిణాఫ్రికా వాహన పరిశ్రమ పోటీతత్వాన్ని దెబ్బతీస్తున్నాయని అక్కడి అధికారులు భావిస్తున్నారు. డిపార్ట్‌మెంట్ అధికారులు అత్యంత ప్రాధాన్యత కలిగిన దేశాలైన భారత్, చైనాకు సంబంధించి ప్రపంచ వాణిజ్య సంస్థ మార్గదర్శకాలకు అనుగుణంగా దిగుమతి సుంకాలను పరిశీలిస్తోంది. ఇటీవలి డేటా ప్రకారం, భారత్, చైనా దక్షిణాఫ్రికాకు రెండు అతిపెద్ద వాహన ఎగుమతిదారులుగా అవతరించాయి. 2024లో మొత్తం వాహన దిగుమతులలో భారత్ 53 శాతం, చైనా 22 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ఈ స్థాయి దిగుమతుల వల్ల స్థానిక వాహన పరిశ్రమకు నష్టాలు ఎదురవుతాయని దక్షిణాఫ్రిక అభిప్రాయపడింది. అంతేకాకుండా, గత నాలుగేళ్ల కాలంలో చైనా నుండి ఆ దేశానికి ఎగుమతులు 368 శాతం, భారత్ నుంచి 135 శాతం పెరిగాయి. ఇది ఆ దేశ వాహన పరిశ్రమలో ఎంట్రీ-లెవెల్ విభాగంలో అత్యధిక పోటీ ఏర్పడింది. అందుకే పన్నుల ద్వారా భారత్, చైనా వాహనాల దిగుమతులని నియంత్రించి, స్థానిక పరిశ్రమను కాపాడుకోవాలని దక్షిణాఫ్రికా వెల్లడించింది.

### బడ్జెట్‌లో దీర్ఘకాలిక ప్రణాళికపై దృష్టి పెట్టాలి



ప్రపంచం 'అత్యంత ప్రమాదకరమైన సందర్భం'లో ఉన్నందున, రాబోయే బడ్జెట్ భారత ఆర్థికవ్యవస్థను మరింత పటిష్టంగా, స్వయం సమృద్ధిగా మార్చేలా ఉండాలని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో వృద్ధిని వేగవంతం చేయడానికి దీర్ఘకాలిక ప్రణాళికతో అనుసంధానం చేయాలని రాజన్ సూచించారు. బుధవారం పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన.. గతంలో దేశానికి పంచవర్ష ప్రణాళికలు ఉండేవి, అయినప్పటికీ దేశ బడ్జెట్ వాటితో సరిగ్గా అనుసంధానం కాలేదు. కాబట్టి ఈసారి 2026-27 కేంద్ర బడ్జెట్‌ను దీర్ఘకాలిక దార్శనికత, ప్రణాళికతో అనుసంధానం చేయాలని నేను భావిస్తున్నాను. ఒక ఆర్థికవ్యవస్థగా మరింత పటిష్టంగా, స్వయం సమృద్ధిగా మారాలి, అదే సమయంలో వేగంగా వృద్ధి చెందాలి, దానివల్ల ఇతర దేశాలన్నీ భారత్‌తో స్నేహం చేయాలనుకుంటాయి. దీనికి చాలా కృషి చేయాల్సి ఉంది, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టబోయే తదుపరి బడ్జెట్ మనల్ని ఆ దిశగా తీసుకువెళ్తుందని నేను ఆశిస్తున్నానని ఆయన వివరించారు. ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈసారి అస్థిరంగా మారిన భౌగోళిక రాజకీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆర్థిక వృద్ధిని బలోపేతం చేయడానికి సంస్కరణ చర్యలు ఉంటాయని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో రఘురామ్ రాజన్ పైవ్యాఖ్యలు చేశారు. ప్రపంచంతో పాటు భారత ఆర్థిక వ్యవస్థ రెండింటికీ ఇది 'అత్యంత ప్రమాదకరమైన సమయం' అని రాజన్ అన్నారు.

## ఆస్ట్రేలియా కెప్టెన్‌గా ట్రవిస్ హెడ్.. ముగ్గురి అరంగేట్రం




టీ20 ప్రపంచకప్-2026 టోర్నీ ఆరంభానికి ముందు ఆస్ట్రేలియా పాకిస్తాన్ పర్యటనకు వెళ్లింది. వరల్డ్‌కప్ ఈవెంట్‌కు సన్నాహకంగా ఆతిథ్య జట్టుతో మూడు టీ20లు ఆడేందుకు షెడ్యూల్ ఖరారైంది. ఇందులో భాగంగా ఆసీస్-పాక్ మధ్య లాహోర్ వేదికగా గురువారం తొలి టీ20తో సిరీస్ మొదలైంది.

**ఆస్ట్రేలియా కెప్టెన్‌గా ట్రవిస్ హెడ్**

గడాఫీ స్టేడియంలో టాస్ గెలిచిన పాకిస్తాన్ తొలుత బ్యాటింగ్ ఎంచుకోగా.. కంగారూలు బౌలింగ్ అటాక్ మొదలుపెట్టారు. ఇక పాక్‌తో తొలి టీ20 నేపథ్యంలో ఆస్ట్రేలియా తుదిజట్టులో కీలక మార్పు కనిపించింది. రెగ్యులర్ కెప్టెన్ మిచెల్ మార్ష్ దూరం కాగా.. అతడి స్థానంలో విధ్వంసకర ఓపెనర్ ట్రవిస్ హెడ్ సారథిగా వ్యవహరిస్తున్నాడు.

**ముగ్గురి అరంగేట్రం**

అంతేకాదు.. ఈ మ్యాచ్‌లో ఆసీస్ భారీ ప్రయోగానికి తెరతీసింది. ఏకంగా ముగ్గురు ఆటగాళ్లను అరంగేట్రం చేయించింది. మహ్లి బియర్డ్‌మాన్, జాక్ ఎడ్వర్డ్స్, మ్యాట్ రెన్షా అంతర్జాతీయ టీ20లలో అడుగుపెట్టారు. ఇటీవల ముగిసిన బిగ్‌బాష్ లీగ్‌లో అత్యుత్తమ ప్రదర్శన కారణంగా యాజమాన్యం వీరికి అవకాశం కల్పించింది. అయితే, ఈ ముగ్గురిలో ఒక్కరు కూడా టీ20 ప్రపంచకప్-2026 జట్టులో లేకపోవడం గమనార్హం. ఇక మార్ష్‌తో పాటు గ్లెన్ మాక్స్‌వెల్, టిమ్ డేవిడ్, నాథన్ ఎల్లిస్ వంటి స్టార్లు కూడా ఈ మ్యాచ్‌కు దూరంగా ఉన్నారు.

పాకిస్తాన్ వర్సెస్ ఆస్ట్రేలియా తొలి టీ20 తుదిజట్లు

ఆస్ట్రేలియా ట్రవిస్ హెడ్(కెప్టెన్), మాథ్యూ షార్ట్, కామెరాన్ గ్రీన్, మ్యాట్ రెన్షా, కూపర్ కొన్నోలీ, మిచెల్ ఓవెన్, జోష్ ఫిలిప్(వికెట్ కీపర్), జాక్ ఎడ్వర్డ్స్, జేవియర్ బార్ట్‌లెట్, ఆడమ్ జంపా, మహ్లి బియర్డ్‌మాన్

పాకిస్తాన్ సాహిబ్జాదా ఫర్హాన్, సయిమ్ ఆయుబ్, బాబర్ ఆజం, సల్మాన్ ఆఘా (కెప్టెన్), ఫఖర్ జమాన్, ఉస్మాన్ ఖాన్(వికెట్ కీపర్), షాదాబ్ ఖాన్, మొహమ్మద్ నవాజ్, షాహీన్ అఫ్రిది, సల్మాన్ మీర్జా, అబ్రార్ అహ్మద్.

### వరల్డ్‌కప్‌కు సంబంధించి బిగ్ అప్‌డేట్




త్వరలో భారత్, శ్రీలంక వేదికలుగా జరుగనున్న టీ20 వరల్డ్‌కప్‌కు సంబంధించి ఓ ముఖ్య సమాచారం అందుతోంది. ఈ మెగా టోర్నీ ఓపెనింగ్ సెర్మనీ ఖరారు కావడంతో పాటు వేడుక జరిగే తేదీ మరియు సమయాన్ని ప్రకటించారు. టోర్నీ ప్రారంభమయ్యే ఫిబ్రవరి 7వ తేదీనే ముంబైలోని వాంఖడే స్టేడియంలో ప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా జరుగనున్నాయి. ఆ రోజు వేర్వేరు వేదికల్లో మొత్తం మూడు మ్యాచ్‌లు జరుగనుండగా.. మూడో మ్యాచ్‌కు ముందు ప్రారంభోత్సవ వేడుకలు జరుగుతాయి. మూడో మ్యాచ్‌లో భారత్, యూఎస్ఏ జట్లు ముంబైలోని వాంఖడే మైదానంలో తలపడనున్నాయి. ఈ మ్యాచ్ రాత్రి 7 గంటలకు ప్రారంభమవుతుంది. దీనికి ముందే ఓపెనింగ్ సెర్మనీ జరుగుతుంది. అదే రోజు టోర్నీ ఓపెనర్‌లో పాకిస్తాన్, నెదర్లాండ్స్ తలపడనున్నాయి. ఈ మ్యాచ్ కొలంబో వేదికగా ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుంది. రెండో మ్యాచ్ వెస్టిండీస్, స్కాట్లాండ్ మధ్య కోల్‌కతా వేదికగా మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమవుతుంది.

కాగా, టీ20 ప్రపంచకప్ 2026 భారత్, శ్రీలంక వేదికలుగా ఫిబ్రవరి 7 నుంచి 20వ తేదీ వరకు జరుగనుంది. ఈ టోర్నీలో మొత్తం 20 జట్లు పాల్గొంటున్నాయి. ఈ జట్లలన్నీ గ్రూప్‌కు ఐదు జట్ల చొప్పున నాలుగు గ్రూప్‌లుగా విడిపోయాయి.

గ్రూప్-సి నుంచి బంగ్లాదేశ్ తప్పుకోవడంతో స్కాట్లాండ్ వైల్డ్‌కార్డ్ ఎంట్రీ ఇచ్చింది. భారత్, పాక్ గ్రూప్-ఏలో పోటీపడనున్నాయి. పాక్ తమ మ్యాచ్‌లన్నీ (భారత్ మ్యాచ్‌తో సహా) శ్రీలంకలో ఆడనుంది. భారత్-పాక్ మ్యాచ్ ఫిబ్రవరి 15న కొలంబోని ప్రేమదాస స్టేడియంలో రాత్రి 7 గంటలకు ప్రారంభమవుతుంది. గ్రూప్ దశలో మొదటి రెండు స్థానాల్లో నిలిచే జట్లు సూపర్-8కు అర్హత సాధిస్తాయి. ఈ దశలో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచే జట్లు సెమీస్‌కు.. సెమీస్‌లో గెలిచే జట్లు ఫైనల్‌కు చేరుకుంటాయి. గత ఎడిషన్‌లో విజేతగా నిలిచిన భారత్.. ఈసారి డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో బరిలోకి దిగుతుంది.

స్పోర్ట్స్

### డబ్ల్యూపీఎల్‌తో యువపేసర్ దశ తిరిగింది.. ఆస్ట్రేలియా కెప్టెన్‌గా మొలినెక్స్!




మహిళల ప్రీమియర్ లీగ్‌తో యువ క్రికెటర్ల సుడి తిరుగుతోంది. ఈ మెగా టోర్నీలో సంచలన ప్రదర్శనతో వరుసగా జాతీయ జట్టుకు ఎంపికవుతున్నారు. గుజరాత్ జెయింట్స్ హిట్టర్ భారతి ఫుల్‌మావి టీమిండియా జెర్సీ వేసుకోనుంది. ఇప్పుడు 19 ఏళ్ల లూసీ హామిల్టన్ ఆస్ట్రేలియా జట్టుకు ఎంపికైంది. త్వరలోనే స్వదేశంలో భారత జట్టుతో జరుగనున్న ఏకైక టెస్టుకు ఈ లెఫ్ట్ ఆర్మ్ పేసర్‌ను స్క్వాడ్‌లోకి తీసుకున్నారు సెలెక్టర్లు. డబ్ల్యూపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న హామిల్టన్ ఈ మ్యాచ్‌తో సుదీర్ఘ ఫార్మాట్‌లో అరంగేట్రం చేయనుంది. ఫిబ్రవరిలో భారత జట్టుతో మూడు ఫార్మాట్ల సిరీస్ కోసం క్రికెట్ ఆస్ట్రేలియా స్క్వాడ్‌ను ప్రకటించింది. స్వదేశంలో ఈ సిరీస్‌తో వీడ్కోలు పలుకనున్న అలీసా హీలీ వన్డే, టెస్టులకు సారథిగా.. సోఫీ మొలినెక్స్ టీ20లకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. అండర్ -19 వరల్డ్‌కప్‌లో, మహిళల బిగ్‌బాష్ లీగ్‌లోఅదరగొట్టిన లూసీ హామిల్టన్.. మహిళల ప్రీమియర్ లీగ్‌లో రాణించడంతో టెస్టులకు తీసుకున్నారు. ముంబై ఇండియన్స్ తరఫున ఆల్‌రౌండ్ షోతో ఆకట్టుకుంటున్న నికోలా కారీ కూడా వన్డే, టీ20ల స్క్వాడ్‌లో చోటు దక్కించుకుంది.

ఆస్ట్రేలియా టీ20 స్క్వాడ్ : డార్సీ బ్రౌన్, నికోలా కారీ, అష్లే గార్డ్‌నర్, కిమ్ గార్త్, గ్రేస్ హ్యారిస్, ఫొబె లిచ్‌ఫీల్డ్, తహ్లియా మెక్‌గ్రాత్, సోఫీ మొలినెక్స్(కెప్టెన్), బేత్ మూనీ, ఎలీసా పెర్రీ, మేగన్ షట్, అనాబెల్ సథర్‌లాండ్, జార్జియా వోల్, జార్జియా వరేహం.

**ఆస్ట్రేలియా వన్డే స్క్వాడ్ :** డార్సీ బ్రౌన్, నికోలా కారీ, అష్లే గార్డ్‌నర్, కిమ్ గార్త్, అలీసా హీలీ(కెప్టెన్), అలనా కింగ్, ఫొబె లిచ్‌ఫీల్డ్, తహ్లియా మెక్‌గ్రాత్, సోఫీ మొలినెక్స్, బేత్ మూనీ, ఎలీసా పెర్రీ, అనాబెల్ సథర్‌లాండ్, జార్జియా వోల్, జార్జియా వరేహం.

ఆస్ట్రేలియా టెస్టు స్క్వాడ్ : డార్సీ బ్రౌన్, అష్లీ గార్డ్‌నర్, కిమ్ గార్త్, లూసీ హామిల్టన్, అలీసా హీలీ(కెప్టెన్), అలనా కింగ్, ఫొబె లిచ్‌ఫీల్డ్, తహ్లియా మెక్‌గ్రాత్, సోఫీ మొలినెక్స్, ఎలీసా పెర్రీ, అనాబెల్ సథర్‌లాండ్, జార్జియా వోల్, జార్జియా వరేహం.

**ఫిబ్రవరి 15న టీ20**


క్రికెట్ ఆస్ట్రేలియా చైర్మన్ మైక్ బియర్డ్ మాట్లడుతూ 'సోఫీ మొలినెక్స్ ప్రతిభగల క్రికెటర్. అనుభవంతో పాటు నాయకత్వ లక్షణాలు ఉన్నందున ఆమెకు కెప్టెన్సీ ఇచ్చాం. ఆస్ట్రేలియా జట్టును ఆమె నడిపించడం చూసేందుకు అందరం ఎదురుచూస్తున్నాం. హీలీ వీడ్కోలు అనంతరం మొలినెక్స్ వన్డే, టెస్టు పగ్గాలు కూడా చేపట్టనుంది' అని వెల్లడించాడు. ఫిబ్రవరి 15న టీ20 సిరీస్ మొదలవ్వనుంది. అనంతరం ఫిబ్రవరి 24, 27, మార్చి 1న వన్డే సిరీస్ జరుగుతుంది. మార్చి 6వ తేదీ నుంచి పెర్త్ వేదికగా ఏకైక టెస్టు మ్యాచ్‌లో ఆతిథ్య జట్టుతో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా తలపడనుంది.

ధర్మఘంట




## వారణాసిలో వెలిసిన భారీ హోర్డింగ్స్..
# మహేష్ బాబు సినిమాకి సంబంధించినవేనా?

సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా, హాలీవుడ్ స్టార్ ప్రియాంకా చోప్రా జోనస్, మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రల్లో నటిస్తున్న భారీ పాన్ వరల్డ్ సినిమా 'వారణాసి' పై అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. గ్లోబల్ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ ప్రాజెక్ట్ ఇప్పటికే ఇండియన్ సినిమాల స్థాయిని కొత్త ఎత్తులకు తీసుకెళ్లబోతోందనే అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. ఈ చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకులు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. ఈ సినిమాను 2027 వేసవిలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ముందుగానే ప్రకటించారు. అయితే ఖచ్చితమైన విడుదల తేదీపై మాత్రం ఇప్పటివరకు అధికారిక ప్రకటన రాలేదు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో తరచుగా పలు ఊహాగానాలు, అనధికారిక తేదీలు చక్కర్లు కొడుతున్నాయి. తాజాగా అలాంటి ఊహలకు మరింత ఊపొచ్చేలా ఒక కొత్త తేదీ ప్రచారంలోకి వచ్చింది. సినీ వర్గాల్లో వినిపిస్తున్న తాజా సమాచారం ప్రకారం, 'వారణాసి' సినిమాను 2027 ఏప్రిల్ 7న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నారనే ప్రచారం మొదలైంది. ఈ తేదీకి సంబంధించిన చర్చలు ఒక్కసారిగా సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. రాజమౌళిమహేష్ బాబు కలయిక ఎన్నో ఏళ్లుగా అభిమానుల కలగా ఉన్న సంగతి తెలిసిందే. ఆ కల ఇప్పుడు పాన్ వరల్డ్ స్థాయిలో సాకారం అవుతుండటంతో, ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రతి చిన్న అప్‌డేట్ కూడా హాట్ టాపిక్‌గా మారుతోంది. ఈ తేదీ చర్చకు మరింత ఆసక్తిని జోడించిన విషయం ఏమిటంటే, వారణాసి నగరంలో కనిపించిన కొన్ని హోర్డింగ్ విజువల్స్. ప్రపంచవ్యాప్తంగా పవిత్ర నగరంగా పేరొందిన వారణాసి నుంచే, అదే పేరుతో తెరకెక్కుతున్న సినిమా విడుదల తేదీ బయటకు వచ్చినట్లుగా ప్రచారం జరగడం అభిమానుల్లో ఉత్కంఠను రెట్టింపు చేసింది.



## బిగ్‌బాస్ అమర్‌దీప్ సుమతీ శతకం.. ట్రైలర్ వచ్చేసింది

బిగ్‌బాస్ అమర్‌దీప్, సైలీ జంటగా నటించిన తాజా చిత్రం 'సుమతీ శతకం'. ఈ మూవీకి ఎమ్ఎమ్ నాయుడు దర్శకత్వం వహించరు. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో సాయి సుధాకర్ నిర్మించారు. ఇటీవలే ఈ మూవీ నుంచి 'నా కుట్టీ కుట్టీ సుమతీ.. నా చిట్టీ చిట్టీ సుమతీ' అంటూ సాగే లవ్ సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ పాటకు ఆడియన్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ట్రైలర్ చూస్తుంటే ఓ మిడిల్ క్లాస్ అబ్బాయి ప్రేమకథగా తెరకెక్కించినట్లు తెలుస్తోంది. స్కూల్ టీచర్‌లో ప్రేమాయణం నడిపించిన యువకుడి స్టోరీలా ట్రైలర్‌లో కనిపిస్తోంది. కాగా.. ఈ సినిమా మైత్రీ మూవీస్ డిస్ట్రిబ్యూటర్స్ సంస్థ ద్వారా ఫిబ్రవరి 6న థియేటర్లలోకి రానుంది. ఈ చిత్రంలో టేస్టీ తేజ, మహేష్ విట్టా, జెడివి ప్రసాద్, మిర్చి కిరణ్ కీలక పాత్రల్లో నటించారు.

# 'పొగరెక్కిన పోటుగాడు కంచె దాటినాడే'



చిరంజీవి నటించిన సూపర్ హిట్ సినిమా 'మన శంకరవరప్రసాద్ గారు'నుంచి తాజాగా వీడియో సాంగ్‌ను విడుదల చేశారు. మూవీలో చాలా ఫన్నీగా సాగిన ఈ గీతాన్ని చిరంజీవినే పాడటం విశేషం. 'ఆ పెద్దిరెడ్డి వీధి మొదలు పెద్ద వదిన గారు' అంటూ సాగే ఈ పాటకు బాగానే విజిల్స్ పడ్డాయి.

పొగరెక్కిన పోటుగాడు కంచెదాటినాడే అనే చరణం నుంచి చిరు తన గొంతు కలుపుతారు. అందుకే ప్రత్యేకంగా యూట్యూబ్‌లో ఈ సాంగ్‌ను విడుదల చేశారు. దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కించిన ఈ మూవీ సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదలైంది. బాక్సాఫీస్ వద్ద ఇప్పటికే రూ. 350 కోట్లకు పైగానే కలెక్షన్స్ రాబట్టింది. ఇందులో వెంకటేశ్ వెంకీ గౌడగా అతిథి పాత్రలో కనిపించి నవ్వులతో మెప్పించగా నయనతార తనదైన రీతిలో మంచి నటనతో ఆకట్టుకుంది.

# అందరినీ మెప్పించే ప్రేమ కడలి.. రిలీజ్ ఎప్పుడంటే?



టాలీవుడ్ మూవీ ప్రేమ కడలి ట్రైలర్ లాంఛ్ ఈవెంట్ గ్రాండ్‌గా జరిగింది. ఈ సినిమాలో యాక్ట్ చేసిన సుబ్బారెడ్డి, సుజాత, మోహన్ బాబు ప్రధాన పాత్రల్లో నటించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తయిన ఈ సినిమా జనవరి 30న థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మూవీ మేకర్స్ ట్రైలర్ లాంఛ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ నాని పిల్లిబోయిన మాట్లాడుతూ... 'గల్ఫ్‌లో ఉంటూ సినిమా తీయాలనే ప్యాషన్‌తో ఎంతో కష్టపడి తీశాం. ఈ సినిమా తీయడానికి నాకు 2 సంవత్సరాలు పట్టింది.నాకు ఎంతో సపోర్ట్ చేసిన నా భార్య అయినా రాధకి,తన మిత్రులకి ధన్యవాదాలు. ఈ మూవీకి అందరూ సపోర్ట్ చేయాలి. అలాగే ఈ సినిమా కచ్చితంగా అందరికి నచ్చుతుంది' అని అన్నారు. సంగీత దర్శకుడు లలిత్ కిరణ్ మాట్లాడుతూ..'ఈ సినిమాకి మంచి సంగీతం అందించినందుకు చాలా సంతోషంగా ఉంది' అని తెలిపారు. ఈ చిత్రానికి పాటలు అందించినందుకు చాలా ఆనందంగా ఉందని లిరిక్స్ అందించిన జయసూర్య అన్నారు.



# సిగరెట్ తాగుతూ కనిపించిన శ్రుతి హాసన్

వెర్సటైల్ హీరో దుల్కర్ సల్మాన్ 'ఆకాశంలో ఒక తార' సినిమా నుంచి ఈ మధ్య కొత్త హీరోయిన్ సాత్విక వీరవల్లిని ఇంట్రడ్యూజ్ చేశారు మేకర్స్. కాగా తాజాగా శృతి హాసన్ ఇందులో నటిస్తున్నట్లు అఫిషియల్‌గా ప్రకటించారు. ఆమె బర్త్ డే సందర్భంగా ట్రయల్‌బ్లేజర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు .. అంటూ ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. కళ్ళకు అద్దాలు పెట్టుకుని ఇంటెన్స్ లుక్‌లో కనిపించడం ఆకట్టుకుంది. పెదవులపై ఉన్న సిగరెట్, దాని నుంచి ఎగిసిపడుతున్న పొగ ఆమె పాత్రకు రఫ్, గ్రిట్టీ టచ్‌ను జోడిస్తోంది. కథలో శ్రుతి హాసన్ పాత్ర కీలక మలుపుగా నిలవనుంది. ఆమె ప్రజెన్స్ పవర్ ఫుల్‌గా ఉండబోతోంది. విలక్షణ కథలతో ఆకట్టుకునే పవన్ సాదినేని ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ప్రతిష్టాత్మక గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా సమర్పణలో, ఈ చిత్రాన్ని సందీప్ గున్నం, రమ్య గున్నం నిర్మిస్తున్నారు.

# షూటింగ్ పూర్తి చేసుకున్న 'హ్రీం'




తెలుగు భీజాక్షరాల్లో 'హ్రీం' అనే అక్షరానికి ఎంతో ఉన్నతమైన విలువలతో కూడిన అర్థం ఉంది. 'హ్రీం' అంటే దర్మార్థ కామ మోక్షాలు కలగలిసిన భీజాక్షరం. ఇదే అక్షరాన్ని టైటిల్‌గా తీసుకుని.. ఇప్పటి వరకు ఎక్కడా చెప్పని ఒక యదార్ధ గాధను ఆధారంగా తీసుకుని ఈ చిత్రాన్ని తెరకెక్కించారు డైరెక్టర్ రావూరి రాజేష్. శివమ్ మీడియా పతాకంపై శివ మల్లాల నిర్మిస్తున్న సినిమాలో నూతన నటీనటులు పవన్ తాత, డాక్టర్ చమిందా వర్మ జంటగా నటించారు. హారర్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం వరంగల్, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ పూర్తి చేసుకుంది. శ్రీమతి సుజాత మల్లాల సమర్పిస్తున్న ఈ చిత్రం వరంగల్ దగ్గరలోని పెద్ద పెండ్యాల గ్రామంలో తొలి షెడ్యూల్, హైదరాబాద్ హెచ్‌యంటీ కాలనీలోని ఫారెస్ట్ లొకేషన్స్‌లో సెకండ్ షెడ్యూల్‌ని పూర్తి చేసుకుంది. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన నిర్మాణానంతర కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి.

# ఫిబ్రవరి 6న 'శ్రీ చిదంబరం గారు' విడుదల



శ్రీమతి. చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీ చక్రాస్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్‌పై చింతా వినీష రెడ్డి, చింతా గోపాల కృష్ణా రెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'శ్రీ చిదంబరం గారు'. వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ట జంటగా నటించిన ఈ చిత్రం ట్రైలర్‌ను ప్రముఖ దర్శకుడు బచ్చిబాబు సానా విడుదల చేశారు. ఫిబ్రవరి 6న చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుండగా.. ఆల్ ది బెస్ట్ చెప్పారు. ట్రైలర్‌ను గమనిస్తే.. మూవీ ఓ ఫీల్‌గుడ్ ఎమోషనల్ లవ్‌స్టోరీలా అనిపిస్తుంది. ఈ కథలో కమర్షియల్ మేసేజ్‌తో పాటు ఓ బ్యూటిఫుల్ మేసేజ్ కూడా ఉన్నట్లు తెలుస్తుంది. ప్రతి సన్నివేశం ఎంతో నేచురల్‌గా ఉంది. నిర్మాత మాట్లాడుతూ.. 'అంతా కొత్తవాళ్లతో తీసిన బ్యూటిఫుల్ సినిమా ఇది. చాలా మెచ్యూర్డ్ అండ్ ఇన్‌స్పిరేషన్ స్టోరీతో రాబోతున్న సినిమా. నేటి సమాజానికి ఎంతో అవసరమైన కథ. చాలా మంది యువత చిన్న చిన్న ప్రాబ్లమ్స్‌కే సూసైడ్ వరకు వెళ్లిపోతున్నారు. అలాంటి వారికి ఎంతో ఇన్‌స్పయిర్ అయ్యే కథ. మీలో లోపం మీకు బలం అవ్వాలి అని చెప్పే కథ ఇది. తప్పకుండా ఈ సినిమా అందర్ని అలరిస్తుందనే నమ్మకం ఉంది' అన్నారు.

# ఆటోబయోగ్రఫీ రాస్తున్న సూపర్ స్టార్ రజినీ



సూపర్ స్టార్ రజనీకాంత్ తన స్వీయ జీవిత చరిత్ర రాస్తున్నట్టు ఆయన కుమార్తె సౌందర్య వెల్లడించారు. రజినీకాంత్ ఆటోబయోగ్రఫీ బుక్ విడుదలయ్యాక వరల్డ్ సెన్సేషన్ అవుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ బుక్‌ను తెలుగు, తమిళం, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో తీసుకురాబోతున్నట్టు సమాచారం. ఈ పుస్తకంలో ఆయన బాల్యం నుంచి మొదలుకుని బస్ కండక్టర్‌గా చేసిన ఉద్యోగం, సినిమాల్లోకి రావడం, తొలి చిత్రాలు, సూపర్‌స్టార్‌గా ఎదగడానికి ఎదురైన కష్టాలు, పోరాటాలు అన్నీ ఉంటాయని సమాచారం. అలాగే ఆయన కుటుంబ జీవితం, భార్య లతా గారు, పిల్లల గురించి, రాజకీయాల్లోకి రావాలని అనుకున్న సందర్భాలు, ఆధ్యాత్మిక జీవితం, గురువులు, రామకృష్ణ మఠం ప్రభావం వంటి విషయాలూ ఇందులో ఉండనున్నాయి. ఈ పుస్తకాన్ని రజనీకాంత్ స్వయంగా రాస్తుండగా, కొంత భాగం ఇంగ్లీష్ రచయిత సహాయంతో సిద్ధం అవుతుందని తెలుస్తోంది. ప్రస్తుతం రచన దశలో ఉన్న ఈ ఆటోబయోగ్రఫీ 2026 చివర్లో లేదా 2027లో విడుదలయ్యే అవకాశం ఉందని అంచనా. కాగా సూపర్ స్టార్ ఆటోబయోగ్రఫీ కోసం ఆయన ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

Printed, Published, Owned by & Editor: MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, Published From SPOORTHI PUBLICATIONS,
# : 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Telangana - 508001, # : F-7, Cherukuri Mini Towers, Road No.4, Jadges colony, Vanasthalipuram, Hyderabad-500070.
epaper.dharmaganta.com, www.dharmaganta.com, dharmagantasp@gmail.com, +919440994108, +919885826108, +919440828108

# నిరుపేదలకు సేవలందించే అవకాశం లభించడం అదృష్టంగా భావించాలి

**వైద్యారోగ్య శాఖ పనితీరుపై సమీక్షలో కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**నిజామాబాద్, జనవరి 29 ధర్మ ఘంట :**

నిరుపేద ప్రజలకు వైద్య సేవలు అందించే అవకాశం లభించడాన్ని అదృష్టంగా భావిస్తూ అంకిత భావంతో మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి వైద్యాధికారులకు, సిబ్బందికి హితవు పలికారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పనితీరుపై కలెక్టర్ గురువారం సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, పీ.హెచ్.సీలు, ఆరోగ్య ఉప కేంద్రాల నిర్వహణ తీరుతెన్నుల గురించి అడిగి తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయి నుండి మొదలుకొని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వరకు వివిధ దశల్లో చేపట్టాల్సిన పనులను అంకితభావంతో సక్రమంగా నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. పీ హెచ్ సి స్థాయిలో మెడికల్ ఆఫీసర్, సూపర్వైజర్, సిబ్బంది, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని, తమ ఉద్యోగాన్ని దైవంతో సమానంగా భావించాలని అన్నారు. వైద్యారోగ్య శాఖ పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తామని, విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిని ఉపేక్షించబోమని హెచ్చరించారు.





అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించకపోయినా చర్యలు కఠినంగానే ఉంటాయన్నారు. వైద్య ఆరోగ్య శాఖ పనితీరు సక్రమంగా లేకపోతే, అది ప్రజా జీవనంపై పెను ప్రభావం చూపుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని సమిష్టిగా, సమన్వయంతో పని చేస్తూ సత్ఫలితాలు సాధించాలని సూచించారు. ప్రతి పి.హెచ్.సి, సబ్ సెంటర్లలో అన్ని రకాల ఔషధాలు, కనీస సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రైవేటు, కార్పొరేటు హాస్పిటల్లకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అన్ని విధాలుగా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. మాతా శిశు మరణాలు జరగకుండా ముందు నుండే గర్భిణీలకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, అవసరమైన చికిత్సలు అందించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ప్రైవేటు నర్సింగ్ హోం లలో కూడా సాధారణ ప్రసవాలు జరిగేలా పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు. వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని అన్నారు. సమీక్షా సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ, డిప్యూటీ డీఎంహెచ్ఓలు, మెడికల్ ఆఫీసర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సూర్యాపేటలో రెండవ రోజు భారీగా నామినేషన్లు

**ధర్మఘంట జనవరి 29 సూర్యాపేట జిల్లా ప్రతినిధి**

:తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల హడావిడి రెండవ రోజుకు చేరుకుంది.నామినేషన్ల పర్వం భారీగా ఊపందుకుంటోంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) జనవరి 27న మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన తర్వాత, జనవరి 28 (బుధవారం) నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైన విషయం తెలిసిందే.రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు మరియు 7 కార్పొరేషన్లు (కరీంనగర్,రామగుండం, నిజామాబాద్,మహబూబ్‌నగర్,మంచిర్యాల,భద్రాద్రి కొత్తగూడెం,నల్గొండ)లో ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 2,996 వార్డులు ఉన్నాయి.మొదటి రోజు రాష్ట్రవ్యాప్తంగా 902 నామినేషన్లు దాఖలయ్యాయి.ఇందులో కాంగ్రెస్ 382,బీఆర్ఎస్ 258,బీజేపీ 169 మరియు ఇతరులు మిగిలినవి దాఖలు చేశారు.ఇది ఎన్నికల ఉత్సాహాన్ని సూచిస్తోంది.ఇక సూర్యాపేట మున్సిపాలిటీ విషయానికి వస్తే మొదటి రోజు తక్కువ సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి.కేవలం 13 మంది అభ్యర్థులు మాత్రమే నామినేషన్లు సమర్పించారు.తొలి రోజు కావడం,పార్టీలు అభ్యర్థుల ఖరారుపై ఇంకా చర్చలు జరుగుతున్నందున జరిగిన సహజమైన పరిణామంగా కనిపించింది.కానీ,రెండవ రోజు జనవరి 29న సూర్యాపేట మున్సిపాలిటీ నామినేషన్ల పరిస్థితి పూర్తిగా మారిపోయింది.మున్సిపల్ వార్డులకు సంబంధించిన అభ్యర్థులు భారీగా తరలివచ్చారు.ఒక్కరోజే 243 నామినేషన్లు దాఖలయ్యాయి.ఇది మొదటి రోజు కంటే చాలా ఎక్కువ మొత్తంగా అధికారులు భావిస్తున్నారు. ఇదే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా కూడా నామినేషన్ల తాకిడి పెరిగింది.నామినేషన్ల దాఖలుకు గడువు జనవరి 30 (శుక్రవారం)తో ముగియనుండడంతో, పార్టీలు తమ అభ్యర్థులను ఖరారు చేసి,మూడవ రోజు జనవరి 30 న మరింత భారీగా నామినేషన్లు దాఖలు చేసే అవకాశం కనిపిస్తుంది.నామినేషన్ల





స్వీకరణకు సూర్యాపేటలో ఎన్నికల అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ కేంద్రాలు తెరిచి ఉంటాయి.జిలా ఎస్పీ కె.నరసింహ నామినేషన్ కేంద్రాలను పరిశీలించి, ఎన్నికల నియమావళి పటిష్టంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల ఎంపికలో తీవ్ర మేధోమధనంలో ఉన్నాయి. కొన్ని చోట్ల పొత్తులు,కొన్ని చోట్ల స్వతంత్ర అభ్యర్థులు, కొన్ని చోట్ల బలమైన అభ్యర్థులపై ఫోకస్ చేస్తున్నాయి.ఫిబ్రవరి 11న పోలింగ్,ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు జరగనుంది. నామినేషన్ల స్క్రూటినీ జనవరి 31న, ఉపసంహరణకు ఫిబ్రవరి 3 వరకు గడువు ఉంది.పేటలో ఈ రెండవ రోజు నామినేషన్ల జోరు చూస్తే,మున్సిపల్ ఎన్నికలు రాష్ట్రవ్యాప్తంగా ఉద్వేగభరితంగా సాగుతున్నాయని స్పష్టమవుతోంది.మూడవ రోజు మరింత భారీగా నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉంది. సూర్యాపేటలోని 48 వార్డులకు సంబంధించిన పోటీ హోరాహోరిగా ఉండే అవకాశాలు మెండుగా ఉన్నాయి.అభ్యర్థుల భవితవ్యం స్థానిక సమస్యలు,పార్టీల బలాబలాలపై ఆధారపడి ఉంటుంది.పేటలో అప్పుడే ఎన్నికల వాతావరణం వేడెక్కుతోంది

# విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి







కార్పొరేట్ కళాశాలలకు దీటుగా శ్రీ లక్ష్మి వెంకట సాయి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఉన్నత విద్య

**ఘనంగా శ్రీ లక్ష్మి వెంకట సాయి వోకేషనల్ జూనియర్ కళాశాల 7వ వార్షికోత్సవ వేడుకలు**

**ఆడి పాడి సందడి చేసిన విద్యార్థిని విద్యార్థులు**

**ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు 30 వేల పారితో అందించిన కళాశాల యాజమాన్యం**

**ధర్మ ఘంట జనవరి 29,సూర్యాపేట జిల్లా ప్రతినిధి :**

విద్యార్థులు జీవితంలో ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని కష్టపడి చదివి లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి భాను నాయక్ అన్నారు. గురువారం స్థానిక జీవివి గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన శ్రీ లక్ష్మి వెంకట సాయి ఒకేషనల్ జూనియర్ కళాశాల 7వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంటర్ విద్య అనేది ప్రతి విద్యార్థి జీవితాన్ని మలుపు తిప్పేదని అందుకే విద్యార్థులు బాగా చదివి జీవితంలో రాణించి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని సూచించారు. పరీక్షల సమయం ముందుందని విద్యార్థులు కష్టపడి చదివి మంచి ర్యాంకులు సాధించి కళాశాల తో పాటు తల్లిదండ్రులకు పేరు తేవాలని అన్నారు. కళాశాల కరస్పాండెంట్ కారింగుల బాలాగౌడ్ మాట్లాడుతూ కార్పొరేట్ కళాశాలలకు దీటుగా తమ కళాశాలలో విద్యార్థిని విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నట్లు తెలిపారు. తమ కళాశాలలో చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించి నేడు ఉన్నత స్థాయిలో ఉద్యోగాలు చేస్తున్నారని గుర్తు చేశారు. తమ కళాశాలలో వృత్తి విద్యా కోర్సులు చేసిన విద్యార్థులు ఏ రంగంలోనైనా ఎక్కడైనా రాణించగలరని అందుకు తమ పూర్వ విద్యార్థులు సాధించిన విజయాలే నిదర్శనం అన్నారు. పేద మధ్యతరగతి విద్యార్థుల తల్లిదండ్రులను దృష్టిలో ఉంచుకొని వారి పిల్లలను అభివృద్ధిలోకి తేవాలనే సదాశయంతో తాము, కళాశాల అధ్యాపక బృందం విశేష కృషి చేస్తున్నట్లు తెలిపారు.అనంతరం రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన ముగ్గురు విద్యార్థులు కే వంశవర్ధిని ఎంపీహెచ్డబ్ల్యూ ఫిమేల్ (988), కారింగుల సౌజన్య ఎమ్మెల్టీ ద్వితీయ సంవత్సరం (981), జి.హాసిని ఎం పి హెచ్ ఫిమేల్ డబ్ల్యు ప్రథమ సంవత్సరం (494) మార్కుల సాధించి రాష్ట్ర పొందగా ఒక్కొక్కరికి రూ 10వేల చొప్పున మొత్తం 30 వేల రూపాయల పారితోషకంను డిఐఈఓ భాను నాయక్ చేతులమీదుగా అందజేశారు. అంతకు ముందు విద్యార్థిని విద్యార్థులు ఆడి పాడి సాంస్కృతిక ప్రదర్శనలతో సందడి చేశారు. ఈ



కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కారింగుల విజయలక్ష్మి, అధ్యాపక బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## రామగుండం ఎమ్మెల్యే ని కలిసిన సింగరేణి మారుపేర్ల కార్మికుల పిల్లలు..



**ధర్మఘంట, జనవరి29,రామగుండం:**

సింగరేణిలో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న మారుపేర్ల సమస్యపై సింగరేణి మాజీ కార్మికుల పిల్లలు గురువారం క్యాంపు ఆఫీస్ లో రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ ని కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు.ఈ సందర్భంగా లక్క శ్రావణ్ గౌడ్ మాట్లాడుతూ సింగరేణిలో మారుపేర్ల సమస్య కారణంగా వందలాది మంది కార్మికుల పిల్లలు ఉద్యోగాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత లేకపోవడంతో అటు పిల్లలు ఉపాధి కోల్పోవడమే కాకుండా, ఇటు వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు అనారోగ్యానికి గురవుతూ మానసిక క్షోభ అనుభవిస్తున్నారని ఎమ్మెల్యే కి వివరించారు.కార్మికుల పిల్లల సమస్యలను సావధానంగా విన్న ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ వారికి సానుకూలంగా సింగరేణి మారుపేర్ల సమస్య త్వరలోనే ఒక కొలిక్కి వస్తుందని, కార్మికులకు పూర్తి భరోసా కల్పిస్తామని తెలిపారు. ప్రభుత్వం ఈ విషయంపై సంబంధిత మంత్రివర్యులు ఇప్పటికే సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అర్హులైన వారందరికీ ఉద్యోగ పత్రాలు ఇప్పించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తుందని, మున్సిపల్ ఎన్నికల అనంతరం మారుపేర్ల కార్మికుల పిల్లలకు ఖచ్చితంగా న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జగ్గు శ్రావణ్, డిష్ బాబు, రామీల సందీప్, ఇంజేపల్లి ఓం ప్రకాష్, దాన్నడ రాజు మరియు ఇతర సింగరేణి మాజీ ఉద్యోగులు, కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు.

## జనవరి 31 నుండి ఫిబ్రవరి 2 వరకు సిఎం కప్ క్రీడా పోటీలు..

**=రామగుండం ఎం.ఈ.ఓ జింక మల్లేశం.**

**ధర్మఘంట, జనవరి29,రామగుండం:**



రామగుండం కార్పొరేషన్ స్థాయి సీఎం కప్ క్రీడ పోటీలను గోదావరిఖని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి జింక మల్లేశం తెలిపారు.జనవరి 31 న శనివారం బాలికలు, మహిళలు కబడ్డీ, కోకో, వాలీబాల్,అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నామని ఆయన పేర్కొన్నారు. ఫిబ్రవరి 2న సోమవారం బాలురు పురుషులకు కబడ్డీ, కోకో, వాలీబాల్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించబడునని ఆయన తెలిపారు. ఈ పోటీలలో ఎంపికైన క్రీడాకారులను నియోజకవర్గం స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రీడలో పాల్గొనేవారు తప్పక సీఎం కప్ రిజిస్ట్రేషన్ ఫారం ఆధార్ కార్డు జిరాక్స్ తమ వెంట తీసుకు రావాలని ఆయన కోరారు రిజిస్ట్రేషన్ చేయనివారు పోటీలో పాల్గొనుటకు అనుమతి లేదు అనే విషయాన్ని గమనించగలరని అయన స్పష్టం చేశారు. వివరాలకై క్లస్టర్ ఇంచార్జ్ ఎం రమాదేవి ఫిజికల్ డైరెక్టర్ ని సంప్రదించాలని తెలుపారు. మరిన్ని వివరాలకు ఈ మొబైల్ నెంబర్ 9491480393 లో సంప్రదించాలని అయన కోరారు.

## వూన్ హాండ్స్ ఫౌండేషన్ 'క్లీన్ అండ్ గ్రీన్' కార్యక్రమంలో విద్యార్థుల భాగస్వామ్యం






**నర్సాపూర్: జనవరి 29 (ధర్మఘంట)**

హైదరాబాద్‌కు చెందిన శివ శివాని కాలేజ్ విద్యార్థులు, వూన్ హాండ్స్ ఫౌండేషన్ సహకారంతో నర్సాపూర్ అర్బన్ పార్క్ హనుమాన్ ఆలయం సమీపంలో 'క్లీన్ అండ్ గ్రీన్' డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 100 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచడం పై అవగాహన పెంపొందించడం, అలాగే ప్లాస్టిక్ వల్ల కోతులు సహా ఇతర జంతువుల ఆరోగ్యంపై కలిగే హానికర ప్రభావాలను నివారించడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం. ఈ డ్రైవ్‌లో నరేంద్ర సాయి, నాగ రామ్, అబ్దుల్ జహీర్ అలీ, మేఘ శ్రీవాస్, రాజ్ కుమార్ చంద్ర, అమిషా, వర్ధన్ తదితర విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వూన్ హాండ్స్ బృంద సభ్యులు కూడా ఈ కార్యక్రమంలో భాగమయ్యారు. కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థి వాలంటీర్లు మరియు కాలేజ్ యాజమాన్యాన్ని వూన్ హాండ్స్ ఫౌండేషన్ ప్రత్యేకముగా అభినందించింది.

## మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ను సజావుగా నిర్వహించే బాధ్యత ప్రిసైడింగ్ అధికారులదే





- జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నంద్ లాల్ పవార్

**ధర్మఘంట జనవరి 29, సూర్యాపేట జిల్లా ప్రతినిధి:**

మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ను సజావుగా నిర్వహించే బాధ్యత ప్రిసైడింగ్ అధికారులపై ఉందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.

గురువారం ఆయన సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో మున్సిపల్ ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులకు ఉద్దేశించి ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరై మాట్లాడుతూ జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలను విజయవంతం చేసినట్లుగానే, మున్సిపల్ ఎన్నికలను అదే స్ఫూర్తితో విజయవంతం చేయాలని కోరారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలన్నారు. ఎన్నికల నిర్వహణలో పోలింగ్ కేంద్రంలో పూర్తి బాధ్యత పి ఓ పైనే ఉంటుందని, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లో మెటీరియల్ తీసుకున్నప్పటి నుండి పోలింగ్ పూర్తయ్యే వరకు పిఒ లు అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాలెట్ బాక్స్ ల ప్రారంభం, పిఓ డైరీ తదితర అన్ని అంశాలపట్ల పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కడ తప్పులకు ఆస్కారం ఇవ్వవద్దని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు ఓడి సౌకర్యం కల్పిస్తామని కలెక్టర్ వెల్లడించారు.అదనపు కలెక్టర్ కె.సీతారామ రావు మాట్లాడారు.ఈ సమావేశానికి ట్రైనింగ్ నోడల్ అధికారి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ రెడ్డి, డిటిఓ, మాస్టర్ ట్రైనర్లు, తదితరులు హాజరయ్యారు.

## మొదటి రాండమైజేషన్ ప్రక్రియను సవ్యంగా నిర్వహించాము



జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

**ధర్మ ఘంట జనవరి 29**

నల్గొండ :మున్సిపల్ ఎన్నికలలో భాగంగా జిల్లాలో పోలింగ్ సిబ్బంది మొదటి రాండమైజేషన్ ప్రక్రియను సవ్యంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ తెలిపారు.గురువారం తన చాంబర్లో మొదటి రాండమైజేషన్ ప్రక్రియను జిల్లా అధికారులతో నిర్వహించిన ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న 6 మున్సిపాలిటీలకు 1 కార్పొరేషన్ కు అవసరమైన పోలింగ్ సిబ్బందిని కంప్యూటర్ ఆధారిత విధానంలో రాండమైజేషన్ ద్వారా ఎంపిక చేశారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌కు ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్, ఒక అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్, ఒక ఆఫీసర్ పోలింగ్ ఆఫీసర్, చొప్పున సిబ్బందిని కేటాయించేలా మొదటి రాండమైజేషన్ చేపట్టారు.జిల్లా మొత్తం 162 వార్డులకు గాను 475 పోలింగ్ స్టేషన్లకు అవసరమైన సిబ్బంది ఎంపిక పూర్తయినట్లు తెలిపారు.20 శాతం రిజర్వ్ సిబ్బందిని కూడా రాండమైజేషన్‌లో పొందుపరిచినట్లు చెప్పారు.ఈ విధానం పూర్తిగా పారదర్శకంగా,నిష్పక్షపాతంగా నిర్వహించడం జరిగిందని, ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోపాలకు ఆస్కారం లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో రెండో దశ రాండమైజేషన్ నిర్వహించి, తుది స్థాయిలో పోలింగ్ సిబ్బందిని పోలింగ్ స్టేషన్లకు కేటాయించనున్నట్లు వెల్లడించారు. మున్సిపల్ ఎన్నికలను శాంతియుతంగా, స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు వేగవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు.ఈ ర్యాండమైజేషన్ కార్యక్రమానికి రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ వై .అశోక్ రెడ్డి ,జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి, ఈడీఎం దుర్గారావు హాజరయ్యారు.

## ఎమ్మెల్యే సహకారంతో వీధిలైట్ల ఏర్పాటు



**ధర్మ ఘంట జనవరి 29 మర్రిగూడ :**

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారు.ఆయన సహకారంతో నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం రాంరెడ్డిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని వీధిలైట్ల ఏర్పాటు కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది.గ్రామ సర్పంచ్ లపంగి నర్సింహా నేతృత్వంలో ఈ వీధిలైట్ల కార్యక్రమం నిర్వహించడం జరిగింది.చీకటి పడితే బయటకు రావడానికి ఇబ్బంది పడుతున్న గ్రామస్తుల సమస్యను గుర్తించిన సర్పంచ్,ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.దీనిపై సానుకూలంగా స్పందించిన రాజగోపాల్ రెడ్డి,తక్షణమే నిధులు మంజూరు చేసి లైట్ల ఏర్పాటుకు సహకరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు కారింగు నర్సింహా,వార్డు మెంబర్స్ లపంగి మహేందర్,కొత్త లింగస్వామి గ్రామ ప్రజలు ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ సిరిపంగి శ్రీనివాస్,నాగిళ్ల ప్రసాద్,వెంకులు,శివర్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## యాదగిరిగుట్టలో మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం





**ధర్మఘంట జనవరి 29**

యాదగిరిగుట్ట:మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో గురువారం ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగడి సునీత నివాసంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆలేరు,యాదగిరిగుట్ట బీఆర్ఎస్ ఎన్నికల ఇంఛార్జి,ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ,ఎన్నికల్లో విజయం సాధించేందుకు బీఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రతి కార్యకర్త కష్టపడుతూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బూత్ స్థాయి నుంచి మున్సిపల్ స్థాయి వరకు బలమైన వ్యూహంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో డీసీసీబీ మాజీ చైర్మెన్ గొంగడి మహేందర్ రెడ్డి, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన అత్యంత అవసరం





ఫోటో: ర్యాలీ ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్

జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

**ధర్మ ఘంట జనవరి 29,**

నల్గొండ : రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన అత్యంత అవసరం అని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు.జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో గురువారం రవాణా శాఖ ఆధ్వర్యంలో ఎన్ జి కాలేజ్ నుండి రామ్ గిరి,క్లాక్ టవర్ వరకు నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన బైక్ ర్యాలీని జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ లు జండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుత రోడ్డు ప్రమాదాల వల్ల అనేక మంది విలువైన ప్రాణాలను కోల్పోతున్నారని, ఇది అత్యంత ఆందోళనకరమని అన్నారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన పెంపొందించడమే జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల ప్రధాన లక్ష్యమని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీట్‌బెల్ట్ వాడాలని సూచించారు. ముఖ్యంగా యువత ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలని కోరారు.జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ, అధిక వేగం, మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ వినియోగిస్తూ డ్రైవింగ్ చేయడం రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలని అన్నారు. ఒక్క క్షణ నిర్లక్ష్యం జీవితాంతం పశ్చాత్తాపంగా మారుతుందని హెచ్చరించారు. ట్రాఫిక్ పోలీసుల సూచనలను గౌరవిస్తూ, రహదారిపై శాసనబద్ధంగా ప్రయాణించడమే సురక్షిత జీవనానికి మార్గమని పేర్కొన్నారు.జిల్లా రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్,వాణి, డిటివో లావణ్య, డీఎస్పీ శివరాం రెడ్డి, ఎం వి ఐ కొండయ్య, మల్లికార్జున్ రెడ్డి, స్వప్న ,యువకులు
ఈ బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.

## నూతన గౌడ ప్రజా ప్రతినిధులకు గౌడ సంఘం ఆధ్వర్యంలో సన్మానం

**ధర్మఘంట జనవరి 29 రామన్నపేట:**






ఇటీవల జరిగిన గ్రామ పంచాయితీ ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన గౌడ సామజిక వర్గానికి చెందిన యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల పరిధిలోని పల్లివాడ గ్రామపంచాయితీ సర్పంచ్ కంభంపాటి శ్రీనివాస్ గౌడ్,రామన్నపేట గ్రామ వార్డు సభ్యులు సుర్వి హరిబాబు గౌడ్ ను నీర్నేముల గౌడ యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించి, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు సుర్వి సత్యం గౌడ్, సుర్వి మల్లేష్ గౌడ్,సుర్వి లింగస్వామి గౌడ్,సుర్వి రమేష్ గౌడ్,సుర్వి సురేష్ గౌడ్,సుర్వి సతీష్ గౌడ్,సుర్వి నరేష్ గౌడ్, సుర్వి నవీన్ గౌడ్,సుర్వి రాకేష్ గౌడ్,సుర్వి నవీన్ గౌడ్,సుర్వి మచ్చగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ కు సిట్ నోటీసులు... నేడు 3 గంటలకు విచారణ





**ధర్మఘంట జనవరి 29 న్యూస్ డెస్క్:**

ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ కు సిట్ నోటీసులిచ్చింది.హైదరాబాద్ నందినగర్ లోని ఆయన ఇంటికి వెళ్లిన సిట్ అధికారులు సీఆర్పీసీ 160 కింద మాజీ సీఎం పీఏకు నోటీసులు అందించారు.నేడు 3గంటలకు విచారణకు సిద్ధంగా ఉండాలని చెప్పారు.65 ఏళ్లకు పైగా వయస్సు ఉండటంతో స్టేషన్ రావడం తప్పనిసరి కాదని తెలిపారు.పీఎస్ కు రావాలి అనుకుంటే రావచ్చు,లేదా హైదరాబాద్ పరిధిలో ఆయన కోరిన చోట విచారణ చేస్తామని నోటీసుల్లో పేర్కొన్నారు.

**ఇది విచారణ కాదు ప్రతీకారం:కేటీఆర్**

భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ కు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు ఇవ్వడంపై ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ గురువారం 'ఎక్స్' పోస్టు ద్వారా మండిపడ్డారు. కక్ష సాధింపు రాజకీయాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.ఇది విచారణ కాదని, ప్రతీకారమని,రాజకీయ దురుద్దేశమని విమర్శించారు. సుదీర్ఘ ఉద్యమం చేసి తెలంగాణను సాధించిన మహానేత కేసీఆర్ అని అన్నారు.

## ఘనంగా శ్రీశ్రీ శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 21వ వార్షిక కళ్యాణ మహోత్సవం





**ధర్మ ఘంట జనవరి 29,అనుముల:**

మండలంలోని ఆలయంలో గురువారం శ్రీ గోవింద మాంబా దేవి సమేత శ్రీ మద్విరాట్ పోతులూరి శివ వీరబ్రహ్మేంద్రస్వామి 21 వ వార్షిక కళ్యాణ మహోత్సవం దేవాలయ అధ్యక్షులు చెన్నోజు మోహనా చారి వారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కళ్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అంగరంగ వైభవంగా స్వామివారి కళ్యాణాన్ని తిలకించారు. శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం నాగార్జునసాగర్ ఎడమ కాలువ పక్కన హాలియాలో కొలువై ఉన్న స్వామివారిని తిలకించి పూజారులచే తీర్థప్రసాదాలు స్వీకరించి ఆశీర్వాదం తీసుకున్నారు. స్వామివారి కళ్యాణానికి ముఖ్యఅతిథిగా నాగార్జునసాగర్ ఎడమ కాలువ మాజీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మలిగిరెడ్డి లింగారెడ్డి, శ్రీ వీరబ్రహ్మేంద్ర ఫర్నిచర్ కార్పెంటర్ అధ్యక్షుడు ఎల్లయ్య చారి, మేలోజు సత్యనారాయణ చారి, చేపూరి కొండల చారి, తారకమాచారి, శ్రీనివాసచారి,, మాధవరం నరేందర్ రావు
మరియు దేవాలయ అర్చక పురోహితులు గొట్టిముక్కల నరసింహచార్యులు, భీష్మచార్యులు, ఆధ్వర్యంలో దేవాలయ కమిటీ నిర్వహణలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన చేశారు.

## కెసిఆర్ కు నోటీసులు ఎన్నికల డ్రామా

**ధర్మ ఘంట, జనవరి 29 మోత్కూర్:**

మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కి ఫోన్ ట్యాపింగ్ కేసులో నోటీసులు జారీ జారీ చేయడం రాజకీయ నాటకమేనని, మోత్కూర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొణతం యాకుబ్ రెడ్డి అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడిన ఆయన, ఎన్నికలు సమీపిస్తేనే ప్రభుత్వం బి ఆర్ ఎస్ పార్టీని, ముఖ్యంగా కేసీఆర్ ని బదనాం చేయడానికి ఒక కథను సృష్టిస్తున్నారని అన్నారు. కాళేశ్వరం కూలిపోయిందని ఒకసారి, ఫీూ ఎన్నికల్లో కారు రెసింగులో ఖు= అవినీతి చేశాడని మరోసారి, ఇప్పుడు కేసీఆర్ ఫోన్ ట్యాపింగ్ చేశారంటూ మళ్లీ కొత్త నాటకం తెరపైకి తెచ్చారన్నారు.రెండు సంవత్సరాలుగా పాలనలో ఉన్న ప్రభుత్వం నిజంగా అవినీతి జరిగినట్లయితే ఇప్పటివరకూ ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. అవినీతి జరిగితే అరెస్టులు చేయడానికి ప్రభుత్వం ఎదురు చూసింది ఎందుకు? ఎన్నికలు వచ్చిందని గుర్తొచ్చిందా? అని యాకుబ్ రెడ్డి విమర్శించారు.ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని, వాటిపై సమాధానం చెప్పలేక ఇలాంటి రాజకీయ డ్రామాలు ఆడుతోందని ఆయన ఆరోపించారు. ప్రజలు మీ కుట్రలను గమనిస్తున్నారు. హామీలు అమలు చేయడాన్ని తప్పించుకోవటానికి ప్రజల దృష్టి మరల్చే ప్రయత్నం ఇదని ఆయన విమర్శించారు.



# మా కాలనీలో అభివృద్ధి ఎక్కడ...?

**ధర్మ ఘంట, జనవరి 29 మోత్కూరు :**

మంగళగడ్డ కాలనీ మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అభివృద్ధి నోచుకోలేదు. గ్రామపంచాయతీగా ఉన్న సమయంలో జరిగిన పనులు తప్ప, మున్సిపాలిటీగా మారిన గత ఐదేళ్లలో ఈ ప్రాంతం ఒక గజం కూడా అభివృద్ధి చెందలేదని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మోత్కూరు నుండి మంగళగడ్డకు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా అధ్వాన్నంగా మారిపోయిందని, జామచెట్ల బావి తురకలశాపురం రహదారి నుండి మంగళగడ్డ కు వెళ్లి దారి వర్షాకాలంలో బురదమయంగా తయారై నడవడానికి కూడా వీలు లేకుండా పోతుందని, పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా సీసీ రోడ్లు వేయాలన్న ఆలోచన కూడా చేయలేదని స్థానికులు మండిపడ్డారు. రోడ్ల సమస్యలతో పాటు మంచినీటి సమస్య కాలనీవాసులను మరింతగా వేధిస్తోంది. మిషన్ భగీరథ నీరు అందకపోవడం, దశాబ్దం క్రితం నిర్మించిన వాటర్‌ట్యాంక్ పూర్తిగా నిరుపయోగంగా మారినా అధికారులు దానిపై దృష్టి సారించకపోవడం స్థానికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. గత పంచాయతీ హయాంలో ఏర్పాటు చేసిన బోరు మోటారే ప్రస్తుతం ఈ ప్రాంతానికి ఏకైక ఆధారం. అయితే అది కూడా ఏదైనా కారణంతో చెడిపోతే కాలనీవాసులు





తాగునీటి కోసం వారాల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు. ఇక్కడ మురుగు కాల్వల నిర్మాణం చేపట్టలేదు అన్నారు. మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తూ కుంటలను తలపించేలా నిల్వ అవుతున్నా శానిటేషన్ సిబ్బంది అటువైపు తిరగడం లేదని స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వీధిలైట్ల ఏర్పాటులో కూడా మున్సిపాలిటీ పాలకులు నిర్లక్ష్యం వహించడంతో కాలనీ చీకట్లో మునిగిపోతుందని వారు పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్నప్పటికీ గత కౌన్సిలర్లు తమ గోడు పట్టించుకోలేదని,తమ ప్రాంతాన్ని పూర్తిగా విస్మరించారని, కాలనీవాసులు మండిపడ్డారు. ఇప్పటికే మున్సిపల్ ఎన్నికల వేడి మొదలైన నేపథ్యంలో మంగళగడ్డ ప్రాంతం 9వ వార్డు పరిధిలోకి రావడంతో ఇక్కడి ప్రజల అసంతృప్తి, సమస్యలు పోటీదారులకు పెద్ద సవాలుగా మారే అవకాశం ఉంది. అభివృద్ధి హామీలు, రోడ్లు, త్రాగు నీరు,కల్వలు వంటి ప్రాథమిక వసతులపై తక్షణ చర్యలు తీసుకునే ప్రణాళిక స్పష్టంగా చెప్పనిదే ఓట్లు వేసే ప్రసక్తే లేదని కాలనీవాసులు హెచ్చరిస్తున్నారు.

# ఆర్మూర్ లో యధేచ్ఛగా కాంగ్రెస్ అరాచక కాండ

**ఆర్మూర్, జనవరి29 ధర్మ ఘంట:**

మునిసిపల్ ఎన్నికల్లో ఎలాగైనా బీఆర్ఎస్ గెలుపు ను అడ్డుకోవాలనే దుష్ట తలంపుతో ఆర్మూర్ పట్టణం లో కాంగ్రెస్ పార్టీ పోలీసులను అడ్డుపెట్టుకొని యధేచ్ఛగా అరాచక కాండకు పాల్పడుతోందని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి ఆరోపించారు. పోలీసుల వక్రనీతిని నిరసిస్తూ గురువారం జీవన్ రెడ్డి వందలాది మంది బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి ఆర్మూర్ ఏసీపీ ఆఫీస్ ఎదుట ధర్నా చేశారు. బీఆర్ఎస్ తరపున కౌన్సిలర్ అభ్యర్థులుగా పోటీ చేయనున్న నేతలకు పోలీసులు క్లియరెన్స్ సర్టిఫికెట్లు ఇవ్వకపోగా కాంగ్రెస్ పార్టీలో చేరమని వత్తిడి చేయడం దారుణమని ఆయన మండిపడ్డారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి ఏసీపీ తో మాట్లాడి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ నేతలే టార్గెట్ గా ఖద్దరు నేతలు, ఖాకీలు కలిసి అణచి వేత చర్యలకు పాల్పడు తున్నారని ఆరోపించారు. పోలీసు శాఖ కాంగ్రెస్ కు అనుబంధ సంస్థగా మారిందని ఆయన అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థు లకు క్లియరెన్స్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా పోలీసుల కొర్రీలు పెట్టడం, కాంగ్రెస్ లో చేరమని బీఆర్ఎస్ నేతలను బెదిరించడం సిగ్గుచేటు అని ఆయన ధ్వజమెత్తారు. ఇది ఇందిరమ్మ రాజ్యమా, ఇందిరమ్మ ఎమర్జెన్సీ రాజ్యమా అని జీవన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి వినయ్ రెడ్డి ఒక స్టూవర్ట్ పురం దొంగల ముఠా లీడర్ అని ఆయన మండిపడ్డారు. పైసా వసూలు రెడ్డిగా మారిన వినయ్ రెడ్డి 30 మందితో దొంగల ముఠాను ఏర్పాటు చేసుకొని కమిషన్లు, సెటిల్ మెంట్లతో దోచుకుతింటూ ఆర్మూర్ ను ఆగం చేస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తాను పదేళ్లలో తీర్చిదిద్దిన ఆర్మూర్ నేడు తన కళ్లెదుటే అనాథగా మారి కన్నీరు పెడుతుంటే గుండె తరుక్కు పోతోందని జీవన్ రెడ్డి భావోద్రేకానికి లోనయ్యారు. కాంగ్రెస్ నేతల అరాచకాలపై స్థానిక బీజేపీ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ఎందుకు నోరు మెదపడం లేదని ఆయన నిలదీశారు. నిజామాబాద్ జిల్లాలో కాంగ్రెస్, బీజేపీ లది అక్రమ సంబంధమని, ఢిల్లీలో కయ్యం, గల్లీలో వియ్యం అన్నట్లుగా ఉన్న ఈ రెండు జాతీయ పార్టీలను చూసి ప్రజలు నవ్వుకుంటు న్నారని ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఇంచార్జి వినయ్ రెడ్డి, ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, ఎంపీ అరవింద్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి లు కుమ్మక్కయ్యారని ఆయన అన్నారు.ఈ రెండు పార్టీల తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. తమది 36 పార్టీలను






ఒప్పించి తెలంగాణ రాష్ట్రం సాధించినకేసీఆర్ సైన్యమని ఆయన వ్యాఖ్యా నించారు. బీఆర్ఎస్ అంటే 500 కేవీ పవర్ సబ్ స్టేషన్ అని, ముట్టు కుంటే మాడి మసై పోతారు తస్మాత్ జాగ్రత్త అని జీవన్ రెడ్డి హెచ్చరించారు. తెలంగాణ గురించి తప్పుగా మాట్లాడి నందుకు లగడపాటి రాజగోపాల్, వైఎస్ జగన్మోహన్ రెడ్డిలను, ఆర్మూర్ వచ్చిన రోజాను తెలంగాణ పొలిమేరలు దాటే వరకు తరిమికొట్టిన ఉద్యమ చరిత్ర తమదన్నారు. కేసీఆర్ సైన్యం ఎవరికైనా భయపడుతోందా? అని ప్రశ్నించారు.తెలంగాణ గడ్డ మీద అణిచివేత ఏ స్థాయి లో ఉంటే అంతకు రెట్టించిన వేగంతో నిరసన ఉబికి వస్తుందనే విషయాన్ని గుర్తించాలని జీవన్ రెడ్డి పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఇంతటి దారుణమైన నిర్బంధాలను చూడలేదన్నారు. ఇకనైనా మునిసిపాలిటీ ఎన్నికల్లో పోటీకి దిగే బీఆర్ఎస్ నేతలకు క్లియరెన్స్ సర్టిఫికెట్లు ఇవ్వాలని, పోలీసుల బెదిరింపులు ఆపాలని, ఆయన డిమాండ్ చేశారు. ఆర్మూర్ లో కాంగ్రెస్, పోలీసుల దాష్టీకాల గురించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు వివరించానని, లీగల్ టీమ్ తో మాట్లాడి న్యాయ పోరాటం చేద్దామని హామీఇచ్చార న్నారు. తన ప్రాణాలను అడ్డు పెట్టైనా బీఆర్ఎస్ కార్యకర్తలను కాపాడుకుంటానన్నారు. పోలీసుల తీరు మారకుంటే నిజామాబాద్ లో ఎన్నికల కమిషన్ ఆఫీసును, ఆర్మూర్ లో ఏసీపీ కార్యాలయాన్ని 10 వేల మందితో ముట్టడిస్తానని జీవన్ రెడ్డి హెచ్చరించారు.

# కేసీఆర్ కు సిట్ నోటీసులపై మండిపడ్డ మాజీ మంత్రి,బాల్కొండ ఎమ్మెల్యే

**రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ దగ్ధం**

**జనవరి 29 వేల్పూర్ ధరఘంట:**

తెలంగాణ సాధకుడు కేసీఆర్ కి సిట్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ వేల్పూర్ మండల కేంద్రంలో దీ=హా కార్యకర్తలతో కలిసి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ తగులబెట్టి నిరసన తెలిపారు మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా నిలబెట్టిన తెలంగాణ జాతిపిత కేసీఆర్ కి సిట్ నోటీసులు ఇవ్వడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కక్ష సాధింపు చర్యలు పరాకాష్టకు చేరాయని వారు మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక, పాలనను గాలికి వదిలేశారని విమర్శించారు. ప్రజల దృష్టిని మళ్లించడానికే కాళేశ్వరం కమిషన్లని, సిట్ అని, ఫోన్ ట్యాపింగ్ అని రకరకాల పేర్లతో కేటీఆర్, హరీష్ రావు, సంతోష్ రావు, ఇప్పుడు ఏకంగా కేసీఆర్ ని వేధిస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుత మంత్రివర్గాన్ని "దండుపాళ్యం బ్యాచ్"గా అభివర్ణిస్తూ, వారు రోజుకో కుంభకోణానికి పాల్పడుతున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. దొరికింది దొరికినట్టు రాష్ట్రాన్ని దోచుకుతింటున్నారని విమర్శించారు. మాజీ మంత్రి హరీష్ రావు ఇప్పటికే బొగ్గు స్కామ్, సోలార్ పవర్ స్కామ్, సింగరేణి డీజిల్ స్కామ్, మరియు ఎక్సైజ్ (మద్యం) స్కామ్‌లను బయటపెట్టారని గుర్తుచేశారు. ఈ స్కామ్‌ల నుండి తప్పించుకోవడానికి, ప్రజల





దృష్టి మరల్చడానికి కేసీఆర్ కి నోటీసుల పేరుతో డ్రామాలు ఆడుతున్నారని అన్నారు. వృద్ధులు, వితంతువులు, బీడీ కార్మికులకు పెన్షన్లను 200 నుండి 2000 చేసిన ఘనత కేసీఆర్ గారిదని, రైతులకు 24 గంటల కరెంట్, సాగునీరు, ఎరువులు, రైతుబంధు అందించి రైతులను ఆదుకున్న గొప్ప నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. కోట్లాది మంది ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకున్న నాయకుడిని, పోలీసులను అడ్డం పెట్టుకొని అవమానించడం దారుణమన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులు పనిచేయకుండా, కేసుల చుట్టూ తిరిగేలా చేయాలనే కుట్రతోనే రేవంత్ రెడ్డి ఈ చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.కేసీఆర్ ని వేధిస్తే ఆ ఉసురు ఈ ప్రభుత్వానికి, రేవంత్ రెడ్డికి తగలకుండా పోదని హెచ్చరించారు. న్యాయం, ధర్మం తమ వైపే ఉన్నాయని, ఈ కక్ష సాధింపు చర్యలకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని స్పష్టం చేశారు. యావత్ తెలంగాణ సమాజం మరియు బీఆర్ఎస్ పార్టీ కేసీఆర్ వెంటే ఉంటుందని తెలియజేశారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు



ఫోటో: రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న డిఎస్పి 01

**డి.ఎస్.పి శివరామిరెడ్డి**

**ధర్మ ఘంట జనవరి 29**

నల్గొండ: జరుగుతున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని నల్గొండ డి.ఎస్.పి శివరామిరెడ్డి రౌడీ షీటర్లను హెచ్చరించారు. గురువారం జిల్లా కేంద్రంలోని పట్టణ పరిధిలోని రౌడీషీటర్లు,హిస్టరీ షీటర్లు, కౌన్సిలింగ్ చేశారు.ఎన్నికల ప్రవర్తన నియమావళి రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని, రౌడీ షీటర్లు ఎటువంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సహకరించాలన్నారు బైండోవర్ కేసులు: నేర చరిత్ర కలిగిన ప్రతి ఒక్కరిని తహసీల్దార్ ఎదుట హాజరుపరిచి, వారి నుండి మంచి ప్రవర్తన కలిగి ఉంటామని బాండ్ రాయించుకోవడం జరుగుతుందని తెలిపారు.బాండ్ నిబంధనలు ఉల్లంఘిస్తే, బాండ్ మొత్తాన్ని జప్తు చేయడంతో పాటు జైలు శిక్ష విధించబడుతుందని తెలిపారు.నిఘా: రౌడీ షీటర్ల కదలికలపై పోలీసు శాఖ ప్రత్యేక నిఘా ఉంచింది. వీరు ఏ రాజకీయ పార్టీకి కొమ్ముకాయకూడదు,ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయకూడదని ఎవరైనా శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే వారిపై పీడీ యాక్ట్ ప్రయోగించడంతో పాటు, అవసరమైతే జిల్లా బహిష్కరణ వేటు వేయబడుతుందని డి.ఎస్.పి స్పష్టం చేశారు.కుటుంబాల భవిష్యత్తు: మీ పాత పద్ధతులు మార్చుకొని, సత్ప్రవర్తనతో జీవించాలని, లేదంటే మీ కుటుంబాలు ఇబ్బందుల పాలవుతాయని హితవు పలికారు.ఈ కార్యక్రమంలో పట్టణ సీఐలు, రాఘవ రావు, రాజ శేఖర్ రెడ్డి ఎస్సైలు సైదులు, సతీష్, గోపాల్ రావు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## రైతుల ఖాతాలో రైతు భరోసా నిధులు జమ చేయాలి.



**సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు**

**ధర్మ ఘంట, జనవరి 29 మోత్కూర్:**

యాసంగి సీజన్ ముగింపు దశకు చేరుకున్నప్పటికీ పెట్టుబడి సాయం అందక రైతులు ఇబ్బందేలను ఎదుర్కొంటున్నారని, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు అన్నారు. గురువారం పాలడుగు గ్రామంలో సిపిఎం గ్రామ శాఖ సమావేశం వెండి యాదగిరి అధ్యక్షతన జరిగింది. ఇందులో పాల్గొన్న వెంకటనర్సు మాట్లాడుతూ, రైతు భరోసా నిధులు వెంటనే ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరాకు 10 వేలను 15 వేలుగా పెంచి రైతులకు అందిస్తామని భరోసా ఇచ్చిన విషయం గుర్తు చేస్తూ, ఆ హామీని అమలు చేయడంలో ప్రజాప్రభుత్వం పూర్తిగా వెనుకబడి ఉందని విమర్శించారు. వర్షాభావం, వరదలు, పంటల నష్టం వంటి సమస్యలతో రైతులు అప్పుల్లో కూరుకుపోయి ఉన్నందున, భరోసా సాయం ఆలస్యం అవుతున్న కొద్దీ వారి కష్టాలు పెరుగుతున్నాయని తెలిపారు. యాసంగి నాట్లు పూర్తి దశలో ఉండగా పెట్టుబడి లేక రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని, వారి పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ఎలాంటి అడ్డంకులు లేకుండా వెంటనే రైతు భరోసా నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, గ్రామ శాఖ కార్యదర్శి పిట్టల చంద్రయ్య, సహాయ కార్యదర్శి కొంపల్లి గంగయ్య, చింతకింది సోమరాజు, దడిపల్లి సైదులు, వెండి యాదగిరి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్మూర్, భీంగల్ లో నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్

**నిజామాబాద్, జనవరి 29 ధర్మ ఘంట:**

ఆర్మూర్, భీంగల్ మున్సిపల్ పట్టణాలలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం సందర్శించారు. నామపత్రాల స్వీకరణ నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేశారా, వార్డు స్థానాలకు ఎన్ని నామినేషన్లు దాఖలు అయ్యాయి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. నామపత్రాలు తెలుగు, ఆంగ్లం, హిందీ భాషలలో అందుబాటులో ఉన్నాయా అని పరిశీలించారు. ఆర్మూర్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న నామినేషన్ల స్వీకరణ కేంద్రంలో పలు లోపాలను గమనించిన కలెక్టర్ సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏవైనా సందేహాలు ఉంటే పై అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని, అనవసర తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా రీపోలింగ్ కు అవకాశం కల్పిస్తే, సంబంధిత మున్సిపల్ కమిషనర్లను బాధ్యులుగా పరిగణిస్తామని అన్నారు. నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ) ప్రక్రియలో నిబంధనలను తు.చ తప్పక పాటిస్తూ, జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. చివరి రోజైన శుక్రవారం అధిక సంఖ్యలో నామినేషన్లు దాఖలు అయ్యే అవకాశాలు ఉన్నందున, ఎలాంటి గందరగోళానికి తావు లేకుండా అప్రమత్తతతో విధులు నిర్వహించాలని హితవు పలికారు. కాగా, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని, ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికలు జరిగేందుకు అందరూ సహకరించాలని కలెక్టర్ కోరారు. అభ్యర్థులు, అన్ని పార్టీల వారు ఎన్నికల నియమావళిని తు.చ తప్పక పాటించాలని అన్నారు. ఆయా పార్టీల అభ్యర్థులుగా.నామినేషన్లు దాఖలు చేస్తున్న వారు, నిర్ణీత గడువు లోపు బీ.ఫారం సమర్పించాలని, లేని పక్షంలో వారిని స్వతంత్ర అభ్యర్థులుగా పరిగణించడం జరుగుతుందని తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, ఆర్మూర్, భీంగల్ మున్సిపల్ కమిషనర్లు ఉమా మహేశ్వర్, గంగాధర్, స్థానిక అధికారులు ఉన్నారు.



ధర్మఘంట

# ఎన్నికల సంఘం నియమ నిబంధనల ప్రకారం నామినేషన్ ప్రక్రియ


జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి.

**ధర్మఘంట, జనవరి 29, కరీంనగర్:**

ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు తూచా తప్పకుండా పాటిస్తూ నామినేషన్ ప్రక్రియ పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఎన్నికల అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయితో కలిసి పరిశీలించారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలలో సదుపాయాలు పరిశీలించారు. నామినేషన్ పత్రాల స్వీకరణకు సంబంధించి పలు సూచనలు చేశారు. హెల్ప్ డెస్క్, పోలీస్ బందోబస్తు తదితర అంశాలను పరిశీలిస్తూ, సపోర్టింగ్ స్టాఫ్ వివరాలు ఆరా తీశారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని, నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను రిజిస్టర్ లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. ఆయా డివిజన్ స్థానాలకు దాఖలైన



నామినేషన్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి టీ పోల్ యాప్ లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఎన్నికల సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. అనంతరం కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన




కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. నామినేషన్ కేంద్రాలు, హెల్ప్ డెస్క్, మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ద్వారా ఎన్నికల సిబ్బంది విధులను పర్యవేక్షించారు. కమాండ్ కంట్రోల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, షిఫ్టుల వారీగా 24 గంటలు విధులు నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు.

## 33 వ వార్డు, 46వ వార్డు కౌన్సిలర్ లుగా పోటీ చేస్తున్న డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్, వూర గాయత్రి దంపతులు



**ధర్మ ఘంట జనవరి 29 సూర్యాపేట జిల్లా ప్రతినిధి :**

సూర్యాపేట ఎన్నికల్లో స్థానిక 33 వార్డులో కాంగ్రెస్ పార్టీ తరపున కౌన్సిలర్ గా నామినేషన్ దాఖలు చేసినట్లు ప్రముఖ వైద్యులు డాక్టర్ రామ్మూర్తి యాదవ్ అన్నారు. 46 వ వార్డు లో తన భార్య అడ్వకేట్ వూర గాయత్రి పోటీ చేస్తున్నట్లు చెప్పారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో డాక్టర్ వూర గాయత్రి రామ్మూర్తి యాదవ్ దంపతులు కౌన్సిలర్ లు గా నామినేషన్ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మమ్మల్ని కౌన్సిలర్ లుగా గెలిపిస్తే రెండు వార్డుల ప్రజలకు ఉచితంగా వైద్య సౌకర్యం అందజేస్తానని, అంతేకాకుండా మహిళలకు గర్భసంచి కాన్సర్ రాకుండా ఉచితంగా వ్యాక్సిన్ చేస్తామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యము కల్పిస్తున్నట్లు చెప్పారు. కొత్తగా రేషన్ కార్డుల పంపిణీ , పేదలందరికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీని తరపున పోటి చేస్తున్న మమ్మల్ని ఆదరించాలని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.




## మత్స్యగిరీంద్ర స్వామి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే



**ధర్మఘంట, జనవరి 29:కరీంనగర్ జిల్లా**

శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామంలో శ్రీ మత్స్యగిరీంద్ర స్వామి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి కళ్యాణ మహోత్సవానికి గురువారం మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశంతో కలిసి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి మంగళ శాసనాలు,ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలంతా సుఖశాంతులతో ఆరోగ్యకరమైన జీవనం గడపాలని, సంపదలతో, ప్రజలే కాకుండా రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆ స్వామి వారిని వేసుకున్నట్టు తెలిపారు. ఈ మహోత్సవానికి ఆలయాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దడమే కాకుండా భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించిన పాలకవర్గాన్ని ఆయన అభినందించారు. ఈ మహోత్సవంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కోరం రాజిరెడ్డి, పిసిసి సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ మండల పార్టీ అధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, టెంపుల్ మాజీ చైర్మన్ ఉప్పుగళ్ల మల్లారెడ్డి తో పాటు పాలకవర్గ సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచులు, పార్టీ



# అట్టహాసంగా "గోపు నామినేషన్

**ధర్మఘంట, జనవరి 29:**

కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గోపు మల్లారెడ్డి గురువారం అట్టహాసంగా నామినేషన్ వేశారు. డివిజన్ ప్రజలు పార్టీ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి నిర్వహించిన భారీ ర్యాలీ అలుగునూరు నుంచి ఎన్టీఆర్ విగ్రహం, కోతి రాంపూర్, కమాన్ చౌరస్తా మీదుగా నగరపాలక సంస్థ కార్యాలయం వరకు సాగింది.
ర్యాలీ ప్రారంభ సందర్భంగా టీపీసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ కార్పోరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయం అన్నారు. 8వ డివిజన్ అభ్యర్థి గోపు మల్లారెడ్డిని గెలిపించుకోవడం ద్వారా ప్రజలు మార్పుకు నాంది పలుకాలని కోరారు. ఎమ్మెల్యేగా తాను ఈ గ్రామానికి ఎంతో చేశానని, ఇంకా చేయాల్సినవి కూడా ఉన్నాయని, ఆ పనులు పూర్తిచేసే పూచీ నాదేనన్నారు. కష్టకాలంలో వెన్నంటి ఉన్న అలుగునూరు ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉండే బాధ్యత తనదేనన్నారు. ఇక నుంచి ఆ బాధ్యతను మల్లన్నకు అప్పగించాలని ఆయన ప్రజలను కోరారు. ఎమ్మెల్యే సతీమణి, అంకిత్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ కవ్వంపల్లి అనురాధ మాట్లాడుతూ కార్పొరేషన్ ఎన్నికల్లో గోపు



మల్లారెడ్డిని గెలిపించుకోవడం ద్వారా అలుగునూర్ ప్రజలు తమ ఐక్యతను చాటుకోవాలని కోరారు. మల్లారెడ్డి గురించి అలుగునూరు ప్రజలకు కొత్తగా తాను చెప్పాల్సింది ఏమీ లేదని, పట్టుదలతో పనులు సాధించుకోగలిగే సత్తా మల్లారెడ్డికి ఉందని పేర్కొన్నారు. మల్లారెడ్డిని గెలిపించుకుంటే గ్రామం మరింత అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుందని డాక్టర్ అనూరాధ పేర్కొన్నారు. ఈ ర్యాలీలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, ఎనిమిదవ డివిజన్ పార్టీ అధ్యక్షుడు



తమ్మనవేని రమేష్ యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారు రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మీనారాయణ గౌడ్, పార్టీ నాయకులు కంది లక్ష్మీనారాయణ గౌడ్, కంది అశోక్ రెడ్డి, మామిడి నరేందర్ రెడ్డి, చిందం కిష్టయ్య తుమ్మనపల్లి శ్రీనివాసరావు, శ్రీగిరి రంగారావు, కుంట రాజేందర్ రెడ్డి, మామిడి అనిల్ కుమార్, కొత్త తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చొప్పదండి నామినేషన్ కేంద్రాల పరిశీలించిన కలెక్టర్





**ధర్మఘంట, జనవరి 29, కరీంనగర్:**

చొప్పదండి మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా చొప్పదండి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. హెల్ప్ డెస్క్ సిబ్బంది అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేయాలని, ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు స్పష్టంగా వివరించాలని తెలిపారు. చొప్పదండి వార్డు స్థానాలకు అప్పటివరకు దాఖలైన నామినేషన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలు నామినేషన్ పత్రాలను పరిశీలించారు. దాఖలైన నామినేషన్లకు సంబంధించి జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టులు పంపించాలని అన్నారు. నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, విధుల్లో ఉన్న ప్రభుత్వ సిబ్బంది నామపత్రాలు దాఖలు చేసే విషయంలో అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా, ఉన్నతాధికారులను సంప్రదించాలని సూచించారు. కలెక్టర్ వెంట చొప్పదండి మున్సిపల్ కమిషనర్ మనోహర్ ఉన్నారు.

## బాలసదనం, రక్తసంబంధీకులనుండి పిల్లల దత్తత ఉత్తర్వులు అందజేసిన కలెక్టర్.





**ధర్మఘంట, జనవరి 29, కరీంనగర్ :**

నగరంలోని బాలసదనంలో ఆశ్రయం పొందుతున్న ఏడు సంవత్సరాల బాలికను హైదరాబాద్ కు చెందిన పిల్లల్ని దంపతులు దత్తత తీసుకున్నారు. కరీంనగర్ అర్బన్ పరిధిలోని గోపాల్ పూర్ కు చెందిన పిల్లలు లేని దంపతులు వారి సమీప బంధువుల నుండి 13 సంవత్సరాల బాబును దత్తత తీసుకున్నారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి చేతులమీదుగా ఈ దత్తత కార్యక్రమం కలెక్టరేట్లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలన్నారు. రక్త సంబంధీకుల నుండి దత్తత తీసుకోవాలనుకునే వారు, బాల సదనాల నుండి దత్తత కోరుకునేవారు జిల్లా పరిషత్ లోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి దుర్గాన పర్వీన్, సిడబ్ల్యుసి మెంబర్లు కళింగ శేఖర్, విజయ్ కుమార్, ఎల్.పి.ఓ రాజు, మిషన్ వాత్సల్య సిబ్బంది తిరుపతి, సాధినేని రమేష్, కవిత, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**ధర్మ ఘంట, జనవరి 29మోత్కూర్:**



మోత్కూర్ మున్సిపల్ కేంద్రానికి చెందిన మిత్ర యూత్ సభ్యుడు కన్నెబొయిన సతీష్ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందరు. ఆ కుటుంబానికి మిత్ర యూత్ తరపున ఆర్థిక సహాయం అందజేశారు.
గురువారం మిత్ర యూత్ ఆధ్వర్యంలో సేకరించిన రూ.60 వేలు,అంగడి బజార్ యువసేన యూత్ ఆధ్వర్యంలో మరో రూ.6 వేలనగదును మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మిత్ర యూత్ గౌరవ సలహాదారు పురుగుల వెంకన్న, ఉపాధ్యక్షుడు కొంతం సత్తయ్య, కార్యదర్శి పయ్యాముల శ్రీను, ప్రచార కార్యదర్శి బొడ్డుపల్లి సతీష్, పిట్టల బాలయ్య, వాసం ప్రసాద్, పన్నాల శ్రీనివాస్ రెడ్డి, జంగ సతీష్, మోత్కూర్ ప్రదీప్ శర్మ, బుర్ర శివమల్లేష్, ఇక్కరి నాగరాజు, మల్లయ్య, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.